అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 11-09-2024
సంపుటి : 10 | సంచిక : 206 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50



అప్పుల్ని పునర్ వ్యవస్థీకరించండి

వాటిని తీర్చటమే మాకు అతి పెద్ద సవాల్

అందుకోసం సాయం చేయండి :

16వ ఆర్థిక సంఘంతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్

ప్రభుత్వానికి పట్టణీకరణపై అధిక దృష్టి
- పేద రాష్ట్రాలకు ఎక్కువ సాయం చేయాల్సిందే
- రాజ్యాంగంలోని నియమమదే: 16వ ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా

2లో..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ సర్కారు పదేండ్ల కాలంలో లెక్కకు మిక్కిలిగా చేసిన అప్పులు ఇప్పుడు తమ ప్రభుత్వానికి అతి పెద్ద సవాల్‌గా మారాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని తీర్చటమే తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. ఈ క్రమంలో అప్పుల్ని పునర్ వ్యవస్థీకరించాల (రీ-స్ట్రక్చర్‌)ని పదహారో ఆర్థిక సంఘాన్ని ఆయన కోరారు. ఇందుకోసం తగిన మద్దతును ఇవ్వాలనీ, ఇతోధికంగా ఆర్థిక సాయం చేయాలని ఆ సంఘానికి విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం పదహారో ఆర్థిక సంఘం ప్రతినిధి బృందం హైదరాబాద్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం బేగంపేటలోని ప్రజా భవన్‌లో ఆ సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా, ఇతర ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తెలంగాణ దేశంలోనే యంగెస్ట్ స్టేటని చెప్పారు. అందువల్ల రాష్ట్రాన్ని 'ది ఫ్యూచర్ స్టేట్'గా పిలుస్తున్నామని తెలిపారు. దేశంలోనే తెలంగాణ వేగంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమని నొక్కి చెప్పారు. మన దేశాభివృద్ధిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బలమైన పునాదులు, చక్కటి ఆర్థిక వ్యవస్థ ఉన్నప్పటికీ... ఆర్థికంగా తెలంగాణ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని వాపోయారు. భారీ రుణభారం రాష్ట్రానికి సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ అప్పుల భారం రూ.6.85 లక్షల కోట్లకు చేరుకుందని వివరించారు. ఇందులో బడ్జెట్ రుణాలతో పాటు ఆఫ్-బడ్జెట్ రుణాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు.

గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు తెచ్చిందన్నారు. ఫలితంగా ఇప్పుడు రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ భాగాన్ని... రుణాలను తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాలు, వడ్డీ చెల్లింపులను సక్రమంగా నిర్వహించకపోతే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాపోయారు. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు తమకు తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరారు.

'రుణాలను రీ-స్ట్రక్చర్ చేయండి, లేదంటే అదనపు ఆర్థిక సహాయాన్ని అందించండి' అని సీఎం ఈ సందర్భంగా ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. అన్ని రాష్ట్రాల తరపున ఈ డిమాండ్‌ను ఆర్థిక సంఘం ముందు ఉంచుతున్నామని ఆయన తెలి పారు. దీన్ని నెరవేర్చితే... దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలనే ప్రధాని మోడీ లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. తెలంగాణను ...11లో..

కోఠి మహిళావర్సిటీకి ఐలమ్మ పేరు

శ్వేత ఐలమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తాం.. : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రవీంద్రభారతిలో ఐలమ్మ నృత్యరూపకం ప్రదర్శన

వివరాలు 10లో

ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలపై ఆంక్షలు

- అనుమతి లేదంటూ ఫ్లెక్సీలు
- గ్రిల్స్‌కు ఇనుప కంచె ఏర్పాటు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ ట్యాంక్ బండ్‌లో వినాయక నిమజ్జనాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిమజ్జనాలకు అనుమతి లేదంటూ మంగళవారం జీహెచ్ఎంసీ, హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా భారీ ఎత్తున ట్యాంక్ బండ్‌పై గ్రిల్స్‌కు ఇనుప కంచె అమర్చారు. అయితే, పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ మరోవైపు పీవీ, ఎన్టీఆర్ మార్గ్ వైపున భారీ క్రేన్లు ఏర్పాటు చేసివినాయక నిమజ్జన ప్రక్రియను కొనసాగిస్తుండటం గమనార్హం. ట్యాంక్ బండ్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు ...11లో..


హైకోర్టు — నిమజ్జనంపై ధిక్కార పిటిషన్ కొట్టివేత | బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేయండి 10లో.

జేబులు ఖాళీ

'పోటీ' నిచ్చెన పైకి ఎగబాకాలని విద్యార్థుల ఆరాటం

వారి బలహీనతలను సొమ్ము చేసుకుంటున్న కోచింగ్ కేంద్రాలు

కుటుంబాల విద్యా బడ్జెట్‌లో అధిక భాగం వాటికే



విద్యా ప్రమాణాలు మెరుగు పరచుకోవడానికి కోచింగ్ తీసుకోవడం ఇప్పుడు మన దేశంలో సర్వసాధారణమై పోయింది. నర్సరీ నుండి ఏ స్థాయి విద్య కోసం అయినా కోచింగ్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు ఏ సబ్జెక్టులో వెనుకబడితే దానికి సంబంధించి మాత్రమే ట్యూషన్ చెప్పించుకునే వారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కోచింగ్ తీసుకోవడమంటే అదో ప్రస్టేజ్‌గా భావిస్తున్నారు. ఫలితంగా కుటుంబ తలసరి వ్యయం పెరిగిపోతోంది.


న్యూఢిల్లీ: విద్యార్థులు ప్రైవేటు కోచింగ్ తీసుకోవడానికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. తరగతి గదిలో అధ్యాపకులు చెప్పేది అర్థం కాక పోవడం, ఉపాధ్యాయులు సరిగా చెప్పలేక పోవడం, అవసరమైన మద్దతు లభించక పోవడంతో పాటు పోటీ నిచ్చెన పైకి ఎగబాకాలన్న తాపత్రయం కూడా ప్రైవేటు కోచింగ్ కేంద్రాలను పెంచిపోషిస్తోంది. తల్లి దండ్రుల ఇష్టాఇష్టాలకు ఇక్కడ చోటు లభించడం లేదు. సామాజిక కారణాలే పైచేయి సాధిస్తు న్నాయి.

అదో పెద్ద మార్కెట్

చివరికి ఏం జరుగుతోంది? కోచింగ్ అనేది పూర్తి స్థాయి వ్యాపారంగా మారిపోయింది. ప్రధాన స్రవంతి విద్యా వ్యవస్థతో సమాంతరంగా దూసుకుపోతోంది. అదో పెద్ద మార్కెట్. తరగతి గదిలో బోధన, స్టడీ గ్రూపులు, ...11లో..

పెరుగుతున్న కోచింగ్ ఖర్చులు

2011-12, 2022-23 మధ్యకాలానికి సంబంధించి కుటుంబాలు విద్యపై చేస్తున్న ఖర్చుపై జాతీయ శాంపిల్ సర్వే చాలా ఉపయోగకరమైన సమాచారాన్ని అందించింది. 2011-12లో ఒక్కో కుటుంబం ప్రైవేటు ట్యూషన్లు లేదా కోచింగ్ క్లాసులపై ఏడాదికి రూ.859.20 ఖర్చు చేసింది. మొత్తంమీద విద్యపై ...11లో..



విషమంగా ఏచూరి ఆరోగ్యం

సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం ప్రకటన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఏచూరి చికిత్స పొందుతున్నారు. తీవ్రమైన శ్వాసకోస ఇన్‌ఫెక్షన్ ఉండడంతో, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స జరుగుతున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. డాక్టర్ల బృందం ఏచూరిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నదని, అయితే ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రిటికల్‌గా ఉన్నట్టు వెల్లడించింది. ఏచూరి ఆగస్టు 19న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. న్యుమోనియా లాంటి ఛాతి ఇన్‌ఫెక్షన్‌తో ఆయన బాధపడుతున్నారు.

వామపక్ష ప్రభుత్వ చొరవతోనే

హేమ కమిటీ

బాధితుల ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



తిరువనంతపురం : కేరళలో జస్టిస్ హేమ కమిటీ రిపోర్టు మాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. పలువురు సినీతారలు చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న భయానక అనుభవాలను బయటపెడుతున్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ హేమ కమిటీ ఏర్పాటు అంశంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ సినీ పరిశ్రమలో జోక్యం చేసుకుని జస్టిస్ హేమ కమిటీ తరహా కమిటీలను ఏర్పాటు చేయలేదని.. కేరళలో వామపక్ష ప్రభుత్వ చొరవతోనే హేమా కమిటీ సాధ్యమైందని ఆయన అన్నారు. ఇప్పటికే ఈ కమిటీ ముందు వాంగ్మూలాలు ఇచ్చినవారు, ఇవ్వని వారు సైతం పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై సమగ్రంగా దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో మహిళా వైద్యురాలిపై లైంగికదాడి ఘటన నేపథ్యంలో మహిళల భద్రతపై పెద్ద యెత్తున చర్చ జరుగుతోందని విజయన్ పేర్కొన్నారు. మంగళవారం తిరువ నంతపురంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన విజయన్ దేశంలోని అనేక రాష్ట్రాల్లో మహిళ లపై దాడులు కొనసాగు తుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఆ ఘటనతో సమాజానికి తప్పుడు సందేశం

'బిల్కిస్ బానో కేసులో నిందితుల విడుదల, వారికి ఘనస్వాగతం పలకడం వంటి పరిణామాలు సమాజానికి తప్పుడు సందేశాన్నిచ్చాయి. జాతీయ స్థాయిలో ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యంలో కేరళ ప్రభుత్వం మహిళల భద్రతకు భరోసా ఇచ్చేలా కచ్చితమైన విధానాలతో ముందుకెళ్తోంది. సినీ పరిశ్రమలో పలు సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో మరే ఇతర రాష్ట్రమూ ఈ తరహాలో సినీ పరిశ్రమలో జోక్యం చేసుకోలేదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో జస్టిస్ హేమ కమిటీ తరహాలో ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు పలు రాష్ట్రాల్లో వస్తు న్నాయి. కమిటీ నివేదికకు సంబంధించి న్యాయ పరమైన ప్రక్రియలు కొనసాగుతున్నాయి. అలాంటి ఫిర్యాదులు ఏవి వచ్చినా దర్యాప్తు వ్యవస్థ రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉంది' అని తెలిపారు.

పాలకుర్తిలో శౌర్యయాత్ర

కామ్రేడ్ చిట్యాల ఐలమ్మకు ఘన నివాళులు

పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు, సీపీఐ(ఎం) నేతలు, శ్రేణులు

ప్రజా నాట్యమండలి ప్రదర్శనలకు జేజేలు

ఐలమ్మ వర్థంతి సందర్భంగా ప్రజానాట్యమండలి శౌర్యయాత్ర పాలకుర్తికి చేరుకుంది. నాటి పోరాట స్మృతులను, ఐలమ్మ శౌర్యాన్ని గుర్తు చేస్తూ తమ ఆటపాటల్లో ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించింది.



వివరాలు 12లో

పోరాట గడ్డ పాలకుర్తి

భావితరాలకు ఐలమ్మ స్ఫూర్తిదాయకం

ఆమె పోరాటంతోనే దొరల పాలన అంతం

ఐలమ్మ పేరున భవన నిర్మాణానికి ఎకరం స్థలం: వర్థంతి సభలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో సభ

రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఐలమ్మకు ఘనంగా నివాళులు

నవతెలంగాణ-పాలకుర్తి/విలేకరులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల గడీలను బద్దలు కొట్టిన పోరాటాల గడ్డగా పాలకుర్తికి దక్కిందని, పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దొరల పాలనను రాష్ట్ర, పాలకుర్తి ప్రజలు అంతం చేశారని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ 39వ వర్థంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. జనగామ జిల్లా పాలకుర్తిలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, కాంగ్రెస్ ...11లో..



భయం గుప్పెట్లో

భద్రాచలం

నీట మునిగిన స్నానాల ఘాట్

మూడు రాష్ట్రాలకు నిలిచిన రాకపోకలు

గోదావరి పరిసర ప్రాంతాల్లో పోలీసుల ఆంక్షలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పోలవరం ముప్పు, శబరి ఉగ్రరూపం, తాలిపేరు ప్రాజెక్టు వరదతో భద్రాచలం వద్ద గోదావరి క్షణక్షణానికి పెరుగుతోంది. దాంతో భద్రాద్రి జనం భయం భయంగా గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి తోడు కరకట్ట బలహీనం.. రామయ్య పట్టణానికి పెనుముప్పు తప్పదని భద్రాద్రి మరో ...11లో..

భూముల ధరల పెంపునకు బ్రేక్

50 శాతం పెంపు ప్రతిపాదనలు ఆమోదించిన కమిటీ | **హైడ్రా దెబ్బకు ఆగిన ప్రక్రియ**

పునరాలోచనలో సర్కార్

భూముల ధరల పెంపునకు బ్రేక్ పడింది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు ఒకటి నుంచి భూముల ధరలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా బదిలీలు జరగడం, కమిషనర్ నవీన్‌మిట్టల్ స్థానంలో బుద్ద ప్రకాష్ రావడంతో అనుకున్న ప్రకారం ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ క్రమంలోనే తాజాగా హైడ్రా కూల్చివేతల దెబ్బకు భారీగా ఆదాయం తగ్గింది. తాజా పరిణామాల నేపథ్యంలో తాత్కాలికంగా భూముల ధరల పెంపుపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. మరి కొద్ది రోజుల వరకు పెంపు జోలికెళ్లకూడదని నిర్ణయించినట్టు సమాచారం.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో భూముల మార్కెట్ ధరల పెంపుపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ జూన్ 7న జీవో 211 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. పెంపునకు సంబంధించి విధానాలను ఖరారు చేసేందుకు షెడ్యూల్ ప్రకటించారు. జూన్ 18 నుంచి జులై 31 వరకు ...11లో..

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రెండు సార్లు భూముల ధరలను పెంచారు. 2021 జులైలో ఒక సారీ, 2022 ఫిబ్రవరిలో రెండో సారీ భూములు, భవనాల మార్కెట్ ధరలను ప్రభుత్వం పెద్ద ఎత్తున పెంచింది. రాష్ట్రం ఏర్పడక ముందున్న ధరలతో పోల్చినా, ఏర్పడ్డాక రెండు సార్లు పెంచిన సగటుతో పోల్చినా వ్యవసాయ భూముల ధరలు గరి ష్టంగా 150 శాతం పెరగగా, స్థిరాస్తి భూముల ధరలు 100శాతం, అపార్ట్ మెంట్ ధరలు 50 నుంచి 80 శాతం వరకు పెరిగాయి. భూముల ...11లో..



దిగ్గజ కంపెనీల నుంచి

సెబీ చీఫ్‌కు ఆదాయం

మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, ఐసీఐసీఐ బ్యాంక్‌లతో దోస్తీ

మరో మూడు సంస్థలతోనూ లాలూచీ

మాధబి కంపెనీకి కోట్ల రాబడి

- ఆమె భర్త దావల్‌కు సంపాదన : కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ : సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పూరి బచ్ అక్రమ ఆర్థిక లావాదేవీలు మరిన్ని బయటపడ్డాయి. అదానీ విదేశీ సంస్థలతో మాధబి అంటకాగారని అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ సంచలన ప్రకటన తర్వాత.. ఆమెను రోజుకో వివాదం చుట్టుముడుతోంది. దేశంలోని దిగ్గజ సంస్థలు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం), ఐసీఐసీఐ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ సహా మరో మూడు కంపెనీలు మాధబి సంస్థతో ఆర్థిక లావాదేవీలు జరపడంతో ఆమెకు కోట్ల ఆదాయం సమకూరిందని ...11లో..

సుప్రీంకోర్టులో ఆరుగురు ఏఎస్‌జీల నియామకం వివరాలు 11లో..



...3లో..

రిజర్వేషన్ల రద్దుకు సమయం రాలేదు

ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల భాగస్వామ్యం నామమాత్రమే

టాప్ 200 వ్యాపారుల్లో వీరు ఎక్కడున్నారు? : రాహుల్



10లో..

4 మెడికల్ కాలేజీలకు గ్రీన్ సిగ్నల్

ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున ప్రవేశాలకు అనుమతి

కేంద్రానికి, సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు: మంత్రి దామోదర రాజనర్సింహ





సీఎం సహాయ నిధికి రూ.2 కోట్లు

- రేవంత్‌రెడ్డికి ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అందజేత

నవతెలంగాణ-ఖమ్మం

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పలు ప్రాంతాల్లో ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లగా.. వారిని ఆదుకునేందుకు ప్రభు త్వానికి తన వంతుగా చేయూత నిచ్చేందుకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ముందుకొచ్చారు. హైదరాబాద్ రేస్ క్లబ్ డైరెక్టర్ నరసింహారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. రేస్ క్లబ్ తరపున రూ.2కోట్ల చెక్కును అందజేశారు. వరద బాధితుల కోసం పెద్దమొత్తంలో అందజేయడం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నేటి నుంచి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం జరిగిన చారిత్రాత్మక పోరాటమని గుర్తు చేశారు.ఆ పోరాటం భూ సమస్యలను ఎజెండాగా తీసుకొచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం : కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమైందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర సాధనకోసం సాగిన ఉద్యమంలో ఆమె పోరాట స్ఫూర్తి ఇమిడివున్నదని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన చాకలి ఐలమ్మ ప్రతిఘటనా తత్వం ఎల్లవేళలా ఆదర్శమని తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించేదిశగా ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా అధికారికంగా నిర్వహించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు.

నటుడు రాజ్ తరుణ్‌పై నార్సింగి పీఎస్‌లో లావణ్య ఫిర్యాదు

- రూ.12 లక్షల విలువ గల బంగారం పోయిందని ఆరోపణ

నవతెలంగాణ-గండిపేట్

హీరో రాజ్‌తరుణ్, లావణ్య కేసులో రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా తన బంగారం, పుస్తెలతాడు దొంగిలించాడంటూ మంగళవారం రాజ్‌తరణ్‌పై నార్సింగి పోలీసులకు లావణ్య ఫిర్యాదు చేసింది. ఈ బంగారం విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని అంచనా. పోలీసులు, లావణ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల రాజ్‌తరుణ్, మాల్వోత్రా ముంబైకి వెళ్లారు. వారిని వెతుక్కుంటూ లావణ్య సైతం వెళ్లింది. వారున్న రూమ్‌కి వెళ్లిన లావణ్య.. రాజ్‌తరుణ్‌ను తనవెంట రావాలని, తనతోనే ఉండాలని కోరింది. ఈ క్రమంలో మాల్వోత్రా, లావణ్యకు మధ్య గొడవ జరిగింది. అయితే హైదరాబాద్‌లోని లావణ్య ఇంటి బీరువా తాళాలు రాజ్‌తరుణ్ వద్దే ఉన్నాయి. వాటిని ఇవ్వాలని లావణ్య పట్టుబట్టడంతో రాజ్‌తరుణ్ బీరువా తాళాలు ఇచ్చాడు. తిరిగి హైదరాబాద్ ఇంటికి వచ్చిన లావణ్య.. బీరువా తాళాలు తీయగా అందులో ఉన్న పుస్తెలతాడు, గాజులు, ఇతర బంగారు నగలు కనిపించలేదు. దాంతో తన బంగారు నగలు రాజ్‌తరుణ్, మాల్వోత్రానే దొంగిలించారని ఆరోపిస్తూ నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తను డ్రగ్స్ కేసులో జైల్లో ఉన్నప్పుడు ఆ నగలు తీసి ఉంటారని పేర్కొంది. తనకు న్యాయం జరిగే వరకూ పోరాడుతానని, రాజ్‌తరుణ్‌ను తానే దక్కించుకుంటానని ఈ సందర్భంగా లావణ్య తెలిపింది.

రైతులను నిండా ముంచిన తుఫాను

- ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలంటూ రైతుల డిమాండ్



నవతెలంగాణ-చంద్రుగొండ

ఇటీవల కురిసిన భారీ వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చాయి. వర్షాలతో వరద పంట పొలాల్లోకి చేరి నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో వరద నీరు పంట పొలాల్లోకి చేరడంతో వేర్లు కుళ్ళి పోయి పంట ఎండిపోతోంది. పత్తి చేను పూర్తిగా ఎరుపు రంగులోకి మారి మొక్కలు చనిపోతున్నాయి. ఈ సందర్భంగా రైతులు నాగరాజు, రామారావు తదితరులు మాట్లాడుతూ.. వర్షాలతో వేసిన పత్తి, మిర్చి పంటంతా వరదకు కొట్టుకుపోయిందన్నారు. కుళ్లిన మొక్కలను మందుల షాపులకు తీసుకువెళ్లి అడిగితే.. దీనికి ఎలాంటి మందులు లేవని చెబుతున్నారని వాపోయారు. ఎకరానికి సుమారు రూ.25 నుంచి 30 వేల పెట్టుబడి పెట్టామని, మిర్చి మొక్క నాటిన దగ్గర నుంచి వర్షాలు మొదలవడంతో తమ గోస ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది మిర్చి పంట రోగాల బారిన పడి దిగుబడి తక్కువ రావడంతో అప్పుల పాలయ్యామని, ఈ ఏడాదైనా దిగుబడి ఎక్కువగా వచ్చి అప్పులు తీరుతాయనుకుంటే.. తుఫాను నిండా ముంచిందని తెలిపారు. ప్రభుత్వం పత్తి, మిర్చి రైతులను ఆదుకోవాలని, ఎకరానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

దోస్త్ రిజిస్ట్రేషన్‌కు నేడే ఆఖరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బుధవారం వరకే గడువున్నది. వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు కూడా బుధవారమే చివరి తేదీ. గురువారం దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. అదేనెల 13 నుంచి 16 వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి, ఫీజు చెల్లించాలి. అదేనెల 13 నుంచి 16 వరకు కేటాయించిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి.

ప్రభుత్వానికి పట్టణీకరణపై అధిక దృష్టి

- పేద రాష్ట్రాలకు ఎక్కువ సాయం చేయాల్సిందే
- రాజ్యాంగంలోని నియమమదే
- విలేకర్ల సమావేశంలో పదహారో ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం నగరాల అభివృద్ధి, పట్టణీకరణపై ఎక్కువగా దృష్టి సారించిందనీ, రోజురోజుకి జనాభా పెరుగుతున్న క్రమంలో ఇది మంచి పరిణామమేనని పదహారో ఆర్థిక సంఘం చైర్మెన్ డాక్టర్ అరవింద్ పనగారియా వ్యాఖ్యానించారు. అయితే పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైన్నే ఉంటుందని ఆయన తెలిపారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు విచ్చేసిన ఆర్థిక సంఘం ప్రతినిధుల బందంతో మంగళవారం బేగంపేటలోని ప్రజా భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు హరిత, కృష్ణభాస్కర్ తదితరులు హాజరయ్యారు.

అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పనగారియా మాట్లాడుతూ...దేశంలో అత్యంత పేదరికం ఉన్న రాష్ట్రాలకు కేంద్రం ఇతోధికంగా సాయం చేయాల్సిందేనని అన్నారు. ఇది రాజ్యాంగంలో పొందుపరిచిన నియమమేనని తెలిపారు. అదే సమయంలో వృద్ధిరేటుతోపాటు స్థూల జాతీయోత్పత్తిలో ముందున్న రాష్ట్రాలకు కూడా ఆర్థిక సాయాలు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఆర్థిక సంఘాలన్నీ కేంద్రానికి ఇదే రకమైన సిఫారసులను చేస్తుంటాయని పేర్కొన్నారు. పదహారో ఆర్థిక సంఘం అందుకు భిన్నంగా ముందుకెళ్లబోదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వంతో నిర్వహించిన సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు ఆర్థిక సంఘం, కేంద్రానికి చేయబోయే సిఫారసులు, సూచనలు, సలహాల గురించి వివరించామని తెలిపారు. పట్టణీకరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మహిళాభ్యుదయానికి అధిక నిదులివ్వాలంటూ ఇక్కడి ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందన్నారు. ఆ విజ్ఞప్తిని ఆర్థిక సంఘం సానుకూలంగా పరిశీలిస్తుందని హామీనిచ్చారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటాల పంపకం, సెస్‌లు, సర్ ఛార్జీలు తదితరాంశాలన్నీ విధానపరమైనవనీ, వాటిలో ఆర్థిక సంఘం జోక్యం చేసుకోబోదని పనగారియా ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్ర పన్నుల్లో కేవలం 31 శాతాన్నే రాష్ట్రాలకు పంచుతున్నామనే వాదనలో వాస్తవం లేదని ఆయన కొట్టిపారేశారు. 41 శాతం మేర ఆ నిధులను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 'ఆర్థిక సంఘం చేసే సిఫారసులను కేంద్రం పట్టించుకోనప్పుడు... అసలు ఆ సంఘం ఉండి ఏం ప్రయోజనం..?' అని అడగ్గా... పనగారియా జవాబివ్వకుండా దాటవేయటం గమనార్హం.

మీడియా సమావేశంలో పదహారో ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ్ ఝా, అన్నీ జార్జ్ మాథ్యూస్, డాక్టర్ మనోజ్ పాండా, సౌమ్య శాంతి ఘోష్, కార్యదర్శి రిత్విక్ పాండే తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు తవ్వే హక్కు సింగరేణికే ఉండాలి

- లేదంటే పరిణామాలు తీవ్రం : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య హెచ్చరిక
- పార్టీ ఆధ్వర్యంలో సభ, సంతకాల సేకరణ



నవతెంలగాణ-కొత్తగూడెం

రాష్ట్రంలో సింగరేణికే బొగ్గును తవ్వే హక్కు ఉండాలని, కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా వేలంపాట విధానం తీసుకొచ్చి.. సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదం వచ్చేలా ప్రయత్నం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం ఐక్యంగా ఉద్యమించాలని భద్రాద్రి కొత్తగూడెం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. మంగళవారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభ, సంతకాల సేకరణ కార్యక్రమాల్లో కనకయ్య మాట్లాడారు. రాష్ట్రాలను ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెడుతూ ఒక్కొక్క ప్రభుత్వ సంస్థను కార్పొరేట్ సంస్థలకు ముట్ట చెబుతూ ప్రజల్ని మోసం చేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆర్థికంగా, అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలను కల్పిస్తూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సింగరేణిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చేస్తే తీవ్ర పరిణామాలను చవిచూడక తప్పదని హెచ్చరించారు. సీపీఐ(ఎం), ప్రజా సంఘాలు ఇప్పటికే బొగ్గు బ్లాక్‌ల ప్రయివేటుకరణకు వ్యతిరేకంగా దశల వారీ ఉద్యమాలు చేస్తున్నట్టు చెప్పారు. రానున్న ఆరేండ్లలో సగం బొగ్గు బావులు మూతపడ తాయని, 18 వేలమంది ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సింగరేణి పరిరక్షణకు కేంద్రంపై పోరాడాలని తెలిపారు. సభ అనంతరం సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, పట్టణ కమిటీ సభ్యులు డి.వీరన్న, జునుమాల నగేష్, ఎంఎస్. ప్రకాష్, వై.వెంకటేశ్వర్లు, కూరపాటి సమ్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు యువతరం నడుం బిగించాలి

- రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదం : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

భారతదేశ ప్రజలందరి గుండెకాయ లాంటి రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం పొంచి ఉందని, దాని రక్షణకు యువతరం నడుం బిగించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో మంగళవారం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం "రాజ్యాంగం ఎదుర్కొం టున్న సవాళ్లు" అనే అంశంపై కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రపంచ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి.. విభిన్న వైవిధ్యాలు కలిగిన భారత దేశంలో ప్రజలందరికీ సమాన హక్కులు ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ.. దేశ రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. దీన్ని సామాజిక శక్తులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానంతో అట్టడుగు వర్గాల హక్కులను కాలరాస్తోందన్నారు. మతాన్ని, దేవున్ని రాజకీయాల్లోకి చొప్పిస్తూ.. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ, ఎంఐఎం పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. తద్వారా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతు న్నాయన్నారు. దేశ సమైక్యత సమగ్రతల కోసం.. లౌకిక విలువల కోసం యువతరం కట్టుబడి ఉండాలని సూచించారు. రాజ్యసభ స్థానాల్లో రిజర్వేషన్లతో పాటు ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని, తద్వారా సామాజిక న్యాయానికి బాట వేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సెమినార్‌లో కెవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంతటి కాశన్న, పులిజాల పర్శరాములు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, ఆవాజ్ నాయకులు ఎండి సలీం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సురేందర్, నాయకులు ఎస్.హనుమంతు, సంజీవ్, రాజు, సాయి, శేషు, శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- యూపీ, ముంబైకు చెందిన ఐదుగురికి రిమాండ్
- రూ.కోటి విలువ చేసే 254 కేజీల గంజాయి, 32 దేశీయ పిస్టల్, పదకొండు రౌండ్ల బుల్లెట్స్ సీజ్ : రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడి





నవతెలంగాణ-మియాపూర్

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకులో రాజు అనే వ్యక్తి నుంచి ముఠా సభ్యులు గంజాయిని కొనుగోలు చేశారు. అరకు నుంచి హైదరాబాద్ మీదుగా యూపీ, ముంబైకు తరలించేందుకు ప్రణాళిక ప్రకారం గంజాయిని తీసుకువెళ్తున్నారు. పక్కా సమాచారం మేరకు సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు నిర్వహించి, రాజేంద్రనగర్‌లో గంజాయి ముఠాను అరెస్టు చేశారు. వారిని విచారించగా.. మూడు నెలలుగా ముంబైకి 100 కిలోలపైగా గంజాయిని సప్లై చేసినట్టు వెల్లడైంది. నదీమ్, సక్లేన్, సలీం.. ముంబైలో క్యాబ్ డ్రైవర్‌గా ఉంటూ అక్కడ సప్లయర్‌గా పని చేస్తున్నారు. యూపీలో సచిన్‌సింగ్ అనే వ్యక్తి వద్ద దేశీయ తయారీ తుపాకీని నిందితులు కొనుగోలు చేశారు. వీరి నుంచి 254 కేజీల గంజాయి, 32 దేశీయ పిస్టల్, 11 రౌండ్ల బుల్లెట్స్, రెండు కార్లు, 7 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఉదయం నుంచి సోషల్ మీడియాలో పోలీసులపై గంజాయి ముఠా కాల్పులు జరిపారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని డీసీపీ తెలిపారు. కేవలం పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించి, ముఠాను అరెస్టు చేసినట్టు చెప్పారు. మీడియాలో వచ్చిన వార్తలను ఖండించారు.

స్పీకర్‌ను బీఆర్ఎస్, బీజేపీ అవమానిస్తున్నాయి

- మంత్రి శ్రీధర్‌బాబు ఆవేదన



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు శాసనసభ స్పీకర్‌ను అవమానిస్తున్నాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ నిబంధనలను, సంప్రదాయాలను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మెన్ చట్టసభలను నిర్వహిస్తారని తెలిపారు. అంతేగానీ ఏక్షపక్షంగా వ్యవహారాలు చేయరని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వ్యక్తులపై భిన్నాభిప్రాయాలున్నప్పటికీ ప్రతి ఒక్కరూ వ్యవస్థను గౌరవించాల్సిందేనని చెప్పారు. సభాపతి ఒక ప్రక్రియ ప్రకారం అసెంబ్లీ కమిటీలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై ఎవరూ మాట్లాడేందుకు లేదని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ వ్యవహారాలపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని పాలించేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు లేకుండా చేశారని తెలిపారు.ఆ పార్టీని ప్రజలు జీరో చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతల్లో మార్పు రాలేదని విమర్శించారు. అధికారం కోల్పోయామన్న బాధతో బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను తారుమారు చేసి అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కను ఇబ్బంది పెట్టారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌కు కాకుండా పీఏసీ పదవి ఎవరికిచ్చారని ప్రశ్నించారు.

అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 ఫలితాలు విడుదల



నవతెలంగాణ రాజేంద్రనగర్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్-2024 ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈ అగ్రిసెట్‌ను గత నెల 24న నిర్వహించారు. పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి మృతి

- అంత్యక్రియలకు హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు



నవతెలంగాణ -జడ్చర్ల

బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి సోమవారం రాత్రి మృతిచెందగా.. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచలో అంత్యక్రియలు నిర్వహించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చైన్నయ్‌లో చికిత్స పొందారు. పరిస్థితి విషమించి మృతిచెందారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, నేతలు నివాళులర్పించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావును చూడగానే లక్ష్మారెడ్డి బోరున విలపించారు. ఆయనను హరీశ్‌రావు ఓదార్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజేష్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కసిరెడ్డి నారాయణరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, గంగుల కమలాకర్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, గువ్వల బాలరాజ్, రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్మెన్ శివకుమార్ తదితరులు నివాళులు అర్పించారు.

జిబ్రానిక్స్ నుంచి సరికొత్త మానిటర్లు



చెన్నయ్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ జిబ్రానిక్స్ కొత్తగా వంపు (కర్వ్‌డ్) మానిటర్లను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇది ప్రొఫెషనల్స్, గేమింగ్ ఔత్సాహికులకు అత్యున్నతమైన అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిందని ఆ కంపెనీ కో ఫౌండర్, డైరెక్టర్ ప్రదీప్ దోషి తెలిపారు. ఈ నూతన శ్రేణీలో జిబ్ ఎస్49ఎ, జిబ్-ఎస్34ఎ, జిబ్-ఎస్30ఎ వేరియంట్లు ఉన్నాయన్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లో అందుబాటులో ఉండే వీటి ధరల శ్రేణీని రూ.31,999- రూ.79,999గా ఆ సంస్థ నిర్ణయించింది.

సంక్షేమ హాస్టళ్లలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ తనిఖీలు

- సమస్యలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తాం : ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-చేగుంట

సాంఘిక, సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో ఉన్న బాలుర సంక్షేమ హాస్టల్, వడియారం బాలికల సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్లో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో సమయానికి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా, మౌలిక వసతులు ఎలా ఉన్నాయి, కాస్మోటిక్స్ చార్జీలు సమయానికి వస్తున్నాయా, చార్జీలు సరిపోతున్నాయా లాంటి పలు విషయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాగా హాస్టల్‌లో తరగతి గదుల ఇబ్బందులు ఉన్నందున, తక్షణమే వాటిని నిర్మించడానికి, ఏ నిధులు ఉన్నా.. తొందరగా ఏర్పాటు చేసే విధంగా చూడాలని మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డికు సూచించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేసి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకంటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శశికళ, ఆర్డీఓ జయచంద్రా రెడ్డి, తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, ఏఎస్సీడీఓ లింగేశ్వర్, హాస్టల్ వార్డెన్లు ఏ. స్వాతి, కే.రమేష్, కే.తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'బునాదిగాని'పై దశాబ్దాల నిర్లక్ష్యం

వెంటనే కాల్వ పనులు పూర్తి చేయాలి

- మూసీ విషపు నీరు వద్దు.. గోదావరి జలాలివ్వాలి : సీపీఐ(ఎం) యాదాద్రి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్
- అడ్డగూడూరు నుంచి మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభం



నవతెలంగాణ-భువనగిరి

దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్న బునాదిగాని కాలువ, ధర్మారం కాల్వకు వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) యాదాద్రిభువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని వడపర్తి కత్వకు తరలించి భువనగిరి, బీబీనగర్ మండలంతోపాటు ఈ ప్రాంతానికి గోదావరి జలాలను అందించాలని డిమాండ్ చేశారు. బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అడ్డగూడూరు నుంచి వలిగొండ మండలం పైల్వాన్‌పురం వరకు మోటర్ సైకిల్ యాత్ర నిర్వహించారు. గ్రామగ్రామానా స్థానికులు యాత్రకు స్వాగతం పలికారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో యాత్రను జహంగీర్ ప్రారంభించి మాట్లాడారు.

చిన్న నీటి పారుదల ద్వారా తక్కువ ఖర్చు.. అధిక విస్తీర్ణం సాగు అనే లక్ష్యంతో 2006లో బునాదిగాని కాల్వకు శంకుస్థాపన చేశారన్నారు. నేటికి 18 ఏండ్లు పూర్తయినా అతీగతి లేదన్నారు. 98.64 కిలోమీటర్ల కాలువ తీయాల్సి ఉండగా 34 కిలోమీటర్ల పనులు మాత్రమే అయ్యాయన్నారు. కాల్వ పరిధిలో 259 కల్వర్టు బ్రిడ్జిలు అవసరం ఉంటే 33 మాత్రమే నిర్మించారన్నారు. కాల్వ పనులు పూర్తి చేసేందుకు రూ.260 కోట్లతో ప్రతిపాదన ఉంటే నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బునాదిగాని కాలువ పూర్తి చేస్తే ఆ పరిధిలో ఉన్న 50 చెరువులను నింపడం ద్వారా 6000 ఎకరాలకు పైగా, 18 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా 12 వేల ఎకరాలు, పాత కాలువలను మరమ్మతు చేస్తే మరో రెండు వేల ఎకరాలు, భూగర్భ జలాల పెరుగుదల ద్వారా మొత్తంగా 25000 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని వివరించారు. కరువు పీడిత ప్రాంతాలకు ఎంతో కీలకమైన బునాదిగాని కాలువను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు ఈ ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఎన్నికల ముందు మూసీ ప్రక్షాళనపై ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చిన్న నీటి వనరులైన బునాదిగాని కాలువ, పిలాయి పల్లి, ధర్మారెడ్డి కాల్వ, భీమ లింగ కాలువ, ఆసిఫ్ నగర్ కాలువలోకి గోదావరి జలాలు అందించాలన్నారు. మూసీ కాలుష్య రసాయన నీటితో ప్రాంత ప్రజలు, పశుపక్షాదులు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. మూసీ ప్రక్షాళన, గోదావరి జలాల కోసం సీపీఐ(ఎం) నిర్వహించే కార్యక్రమాల్లో రాజకీయాలకతీతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 11 జిల్లా కలెక్టరేట్ ముందు మహాధర్నా నిర్వహించి మరోమారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిధులు కేటాంచకుండా, సమీక్షా సమావేశాలతో సమస్య పరిష్కారం కాదని, నిధులు కేటాయించి, స్థానిక ఎమ్మెల్యే ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే ఎమ్మెల్యే క్యాపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, నాయకులు బొల్లు యాదగిరి, గుండు వెంకటనర్సు, రాచకొండ రాములమ్మ, పైళ్ల యాదిరెడ్డి, కూరపాటి రాములు, సిరిపంగి స్వామి, దయ్యాల నర్సింహా, గడ్డం వెంకటేష్, మద్దెపురం రాజు, బుర్ర అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్యా రాజు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు పాల్గొన్నారు.

మహారాష్ట్ర బీజేపీ చీఫ్ కుమారుడి నిర్వాకం

రోడ్డుపై ఆడి కారుతో బీభత్సం
పలు వాహనాలను ఢీకొట్టి పరారీ



నాగపూర్ : అసలే కోతి...ఆపై కల్లు తాగింది...ఇది ఓ సామెత. కట్ చేస్తే అతను మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బావన్‌కులే కుమారుడు. పేరు సంకేత్ బావన్‌కులే. అతనికి ఖరీదైన ఆడి కారు ఉంది. ఇకనేం? రయ్యిమంటూ నాగపూర్‌లో జనసమ్మర్దంగా ఉన్న ఓ రోడ్డుపై కారును పరుగులు పెట్టించాడు. ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీకొట్టాడు. దీనికి సంబంధించిన 14 సెకన్ల వీడియో క్లిప్పింగ్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. సాకేత్ సహా ముగ్గురు పరారు కాగా డ్రైవర్, మరో ప్రయాణికుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

వీరందరూ ఓ బీర్ బార్ నుండి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అరెస్టయిన వారి రక్త నమూనాలను పోలీసులు సేకరించి పరీక్షకు పంపారు. బైకు మీద ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డారు. సాకేత్ కారు మరికొన్ని వాహనాలనూ ఢీకొంది. వాటిలో ఓ వాహనంలో ఉన్న వారు ఆడి కారును వెంబడించి మంకాపూర్ బ్రిడ్జి సమీపంలో దానిని ఆపారు. 'సెంట్రల్ పాయింట్ హోటల్ ఎదుట ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. రెండు కార్లు, ఓ బైక్‌ను ఢీకొన్న కారు వేగంగా వెళ్లిపోయింది. దీనికి సంబంధించి కేసు నమోదు చేశాము. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశాము' అని సితాబుల్డీ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ అనామికా మిర్జాపూర్ చెప్పారు. నిందితులను అర్జున్ హారే, రౌనిత్ చిట్టంవార్‌గా గుర్తించారు.

ఆడి కారు తన కుమారుడి పేరిటే రిజిస్టర్ అయిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అంగీకరించారు. పోలీసులు నిస్పాక్షిక విచారణ జరిపి, తప్పు చేసిన వారిని శిక్షించాలని కోరారు. చట్టం అందరికీ సమానమేనని ముక్తాయింపు ఇచ్చారు.

వినేశ్ ఫోగట్ వర్సెస్ కెప్టెన్ యోగేశ్ బైరాగి

బీజేపీ రెండో జాబితా విడుదల

చండీగఢ్ : హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన రెండో జాబితాను బీజేపీ మంగళవారం విడుదల చేసింది. ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు వ్యతిరేకంగా బీజేపీ తరుపు నుంచి కెప్టెన్ యోగేశ్ బైరాగి పోటీపడనున్నారు. అథ్లెట్ల హక్కుల కోసం పోరాడుతున్న వినేశ్ ఫోగట్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఆమె జులానా నియోజకవర్గం నుంచి పోటీకి దిగారు. కాగా బీజేపీ 21 మంది అభ్యర్థుల పేర్లతో రెండో జాబితాను విడుదల చేసింది. భారతీయ జనతా యువ మోర్చ ఉపాధ్యక్షుడిగా బైరాగి కొనసాగు తున్నారు. బీజేపీ స్పోర్ట్స్ సెల్ కో కన్వీనర్‌గా కూడా ఆయన ఉన్నారు.



మణిపూర్‌లో కర్ఫ్యూ

- మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధం

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ, నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. ఇప్పటికే రాష్ట్రంలో మూడు జిల్లాల్లో కర్ఫ్యూ అమల్లో ఉంది. ఈ నెల 10వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ నెల 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకూ లీజ్ లైన్లు, విఎస్ఎటిఎస్, బ్రాండ్‌బాండ్స్, విపిఎన్ సర్వీసులతో సహా ఇంటర్నెట్, మొబైల్ డేటా సర్వీసులపై నిషేధం విధిస్తున్నట్లు మణిపూర్ హోం డిపార్ట్‌మెంట్ ఒక ఉత్తర్వు విడుదల చేసింది. సోషల్ మీడియా ఉపయోగిస్తూ ఫోటోలు, విద్వేష ప్రసంగం, విద్వేష వీడియో మెసేజ్‌లు షేర్ చేస్తూ ప్రజలను రెచ్చగొట్టడానికి కొంత మంది సంఘ విద్రోహ శక్తులు చేస్తున్న యత్నాలను అణచివేయడానికే ఈ నిషేధం విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తులకు ఎలాంటి నష్టం, ప్రమాదం జరగకుండా నిరోధించడానికి, చట్టాన్ని అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడానికి, నకిలీ సమాచారం, పుకార్ల వ్యాప్తిని ఆపడం ద్వారా ప్రజా ప్రయోజనాలను రక్షించడానికి ఈ నిషేధం విధిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.అలాగే, మణిపూర్‌లో ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, తౌబాల్ జిల్లాల్లో ఇప్పటికే బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163(2) ప్రకారం కర్ఫ్యూ అమల్లో ఉంది.

రిజర్వేషన్ల రద్దుకు సమయం రాలేదు

ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల భాగస్వామ్యం నామమాత్రమే

- టాప్ 200 వ్యాపారుల్లో వీరుఎక్కడున్నారు?
- యూసీసీపై బీజేపీ ఏమనుకుంటుందో చూద్దాం
- అనేక అంశాలపై ఇండియా బ్లాక్‌లో ఏకాభిప్రాయం
- మోడీతో ఏకీభవించకున్నా ద్వేషించను : అమెరికా పర్యటనలో రాహుల్



వాషింగ్టన్ : భారత్‌లో రిజర్వేషన్లను రద్దు చేసే సమయం ఆసన్నం కాలేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలో వివక్ష లేనప్పుడు, నిజాయితీ, నిస్పాక్షికత కన్పించినప్పుడు రిజర్వేషన్ల రద్దు గురించి కాంగ్రెస్ ఆలోచిస్తుందని అంటూ అయితే ఆ సమయం ఇప్పుడు రాలేదని చెప్పారు. అమెరికా పర్యటన ముగింపు సందర్భంగా ఆయన ప్రతిష్టాత్మక జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో విద్యార్థులతో ముచ్చటించారు. భారత్‌లో రిజర్వేషన్లు ఇంకా ఎంత కాలం అమలులో ఉంటాయని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాహుల్ ఈ వ్యాఖ్య చేశారు.

'ఆర్థిక గణాంకాలను తీసుకుందాం. ప్రతి వంద రూపాయలలో గిరిజనులు కేవలం పది పైసలు మాత్రమే పొందుతున్నారు. దళితులకు ఐదు రూపాయలు వస్తున్నాయి. ఓబీసీలకూ అంతే వస్తోంది. దీనిని బట్టి మనకు అర్థమవుతోంది ఏమంటే వారు తగిన భాగస్వామ్యం పొండడం లేదు' అని రాహుల్ వివరించారు. దేశంలో 90 శాతం మంది అసలు ఏ పాత్ర నిర్వహించలేకపోతున్నారని ఆయన చెప్పారు. 'భారత్‌లోని వ్యాపారవేత్తల జాబితాను పరిశీలించండి. నేను ఆ పని చేశాను. అందులో ఒక్క గిరిజనుడి పేరు చూపించండి. దళితుడి పేరు చూపండి. ఓబీసీ పేరు చూపండి. మొదటి 200 స్థానాలలో ఉన్న వారిలో ఒకే ఒక ఓబీసీ ఉన్నారని అనుకుంటున్నాను. దేశ జనాభాలో వారు 50 శాతం మంది' అని వివరించారు. అదే సమస్య అని, దాని పరిష్కారానికి ఇప్పుడు కేవలం రిజర్వేషన్లు మాత్రమే సాధనాలు కావని, వేరేవి కూడా ఉన్నాయని తెలిపారు.

'మేము చేసిన తప్పేమిటని అగ్ర వర్ణాలకు చెందిన అనేక మంది ప్రశ్నిస్తున్నారు. మమ్మల్ని ఎందుకు శిక్షిస్తారని నిలదీస్తున్నారు. మీరు అధికార వికేంద్రీకరణ గురించి ఆలోచిస్తున్నారు. మా దేశ పరిపాలనలో మరింత మందిని భాగస్వాములను చేయాలని మీరు ఆలోచిస్తున్నారు. మీలో ఎవరైనా అదానీయో, అంబానీయో అవుతారని నేను అనుకోవడం లేదు. అందుకు ఓ కారణం ఉంది. మీరు అలా కాలేరు. ఎందుకంటే ఆ తలుపులు మూసుకుపోయాయి' అని వ్యాఖ్యానించారు. ఉమ్మడి పౌరస్మృతిపై బీజేపీ ఆలోచన ఏమిటో తెలిసిన తర్వాతే దానిపై వ్యాఖ్యానిస్తానని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. యూసీసీని బీజేపీ ప్రతిపాదించిందని, దానిని తాము ఇంకా పరిశీలించలేదని, వారి ఆలోచన ఏమిటో తమకు తెలియదని అన్నారు. ఇండియా కూటమిలో అభిప్రాయబేధాలు ఉన్నాయని, అయితే పలు అంశాలపై అంగీకారం కుదిరిందని చెప్పారు.

'రాజ్యాంగాన్ని పరిరక్షించాలని మేము అంగీకారానికి వచ్చాము. కులగణనపై మాలో చాలా మందికి అంగీకారం కుదిరింది. అదానీ, అంబానీలు దేశంలో కనీసం ఒక్క వ్యాపారాన్ని అయినా నిర్వహించకూడదని మేము భావిస్తున్నాము.

సంకీర్ణంలో రాకపోకలు సర్వసాధారణమే. అది సహజం. అందులో తప్పేమీ లేదు. సంకీర్ణాలతో మేము పలు ప్రభుత్వాలను నడిపాము. మరోసారి ఆ పని చేస్తామన్న నమ్మకం ఉంది' అని రాహుల్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ అభిప్రాయాలతో తాను ఏకీభవించనని, అంతమాత్రాన ఆయనను ద్వేషించనని రాహుల్ అన్నారు. 'ఆయనకు కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. నేను వాటితో ఏకీభవించను. కానీ ఆయనను ద్వేషించను' అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై నిప్పులు చెరిగారు. భారతదేశం అనేది వేర్వేరు అంశాల గుత్తి అని అవి తప్పుగా అర్థం చేసుకుంటున్నాయని తెలిపారు. జాతిని పునర్నిర్వచించాల్సిన అవసరం లేదని, అది వేర్వేరు భాషలు, సంప్రదాయాలు, మతాలు, సంస్కృతుల సమ్మేళనమని రాహుల్ గాంధీ వివరించారు.

పెండింగ్‌లో లైంగికదాడి, పోక్సో కేసులు

న్యూఢిల్లీ : లైంగికదాడి, పోక్సో కేసుల విచారణలో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు(ఎఫ్‌టీఎస్‌సీ)ల నుంచి ఆశించినంత వేగం కనిపించటం లేదు. దీంతో దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా కేసులు ఈ కోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. 2.14 లక్షలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయి. 'ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్' రూపొందించిన ఫాస్ట్ ట్రాకింగ్ జస్టిస్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. లైంగికదాడి, పోక్సో కేసులలో సత్వర న్యాయ విచారణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఎఫ్‌టీఎస్‌సీలను ఏర్పాటు చేసింది. 2019 అక్టోబర్‌లో ఎఫ్‌టీఎస్‌సీ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఇక అప్పటి నుంచి గతేడాది డిసెంబర్ నాటికి మొత్తం 4,16,638 లైంగికదాడి, పోక్సో కేసులలో 52 శాతం కేసుల (2,14,463)ను ఎఫ్‌టీఎస్‌సీలు క్లియర్ చేశాయి.

అయితే, గతేడాది డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న ఈ రెండు లక్షలకు పైగా కేసులను ఏడాదిలోగా క్లియర్ చేయటానికి ఎఫ్‌టీఎస్‌సీల పైన పెద్ద భారమే పడనున్నది. ఈ లెక్కన రోజుకు దాదాపు 554 కేసులను (అంటే ప్రతి మూడు నిమిషాలకు ఒకటి) కోర్టులు పరిష్కరించాల్సి ఉంటుంది. ఎఫ్‌టీఎస్‌సీ పథకం కింద ఏర్పాటు చేసిన 1023 కోర్టులలో ఈ ఏడాది ఆగస్టు నాటికి 755 ఎఫ్‌టీఎస్‌సీలు పని చేస్తున్నాయి. ఒకవేళ కొత్తకేసులేవీ వచ్చి చేరకుంటే, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులను క్లియర్ చేయటానికి కోర్టులకు దాదాపు మూడేండ్ల సమయం పడుతుంది. నిర్దిష్ట సమయంలోగా కేసులను పరిష్కరించటానికి పథకం కింద మిగిలిన 268 ఎఫ్‌టీఎస్‌సీలను కూడా క్రియాత్మకంగా మార్చాలనీ, కనీసం 1000 ఎఫ్‌టీఎస్‌సీ లను ఏర్పాటు చేయాలని 'ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్' సూచించింది. ఎఫ్‌టీఎస్‌సీల ముందుకు వస్తున్న కేసుల సంఖ్య ఏటికేడు పెరుగుతున్నది. 2020లో 1,95,991గా ఉన్న కేసుల సంఖ్య 2023 నాటికి 2,78,494కు పెరిగింది. కాబట్టి రానున్న కాలంలో కొత్త కేసులు కూడా వచ్చి చేరితే పెండింగ్ కేసులను పరిష్కరించటం సవాలు గానే మారనున్నది. ఎఫ్‌టీఎస్‌సీలు పరిష్కరిస్తున్న కేసుల సంఖ్య ప్రతి ఏడాదీ పెరగటం కొంత వరకు సానుకూల అంశం. 2020లో పరిష్కారమైన కేసుల సంఖ్య 37,148 గా ఉండగా.. అది 2023 నాటికి 76,319కి పెరిగింది.

ఎందుకూ కొరగాని నైపుణ్యం

ఇజ్రాయిల్‌లో భారతీయుల వెట్టి చాకిరీ

- నియామకాలకు ముందు మూడు ఒడపోతలు
- ఇప్పుడేమో అనుభవం లేదని కుంటిసాకులు
- కష్టాలు భరించలేక తిరుగు ప్రయాణం



న్యూఢిల్లీ : దేశం కాని దేశంలో వెట్టి చాకిరీ చేస్తూ అష్టకష్టాలు పడుతున్న భారతీయ కార్మికుల వెతల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇజ్రాయిల్‌లో ఉద్యోగం సంపాదించేందుకు నైపుణ్య పరీక్షకు హాజరై తీరా అక్కడికి చేరుకున్న తర్వాత కానీ వారికి వాస్తవ పరిస్థితులు బోధపడడం లేదు. నైపుణ్య పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ అక్కడ దానితో ఏ మాత్రం సంబంధం ఉండదు. చేసేది కార్మికుడిగా గొడ్డు చాకిరీ మాత్రమే. ఉదాహరణకు నిర్మాణ రంగంలో పని కోసం వెళ్లిన ఛోటే లాల్ బింద్ 12 రోజులకే ఉపాధి కోల్పోయి చివరికి జెరుసలేం సమీపంలోని ఓ కాస్మెటిక్స్ ఫ్యాక్టరీలో గంటకు రూ.800 సంపాదిస్తున్నాడు. వీణా నాథ్ గుప్తా ఏప్రిల్‌లో ఇజ్రాయిల్‌లో అడుగు పెట్టాడు. అతనిని వేర్వేరు నగరాలకు తిప్పుతున్నారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ తనకు తెలియడం లేదని చెప్పాడు. ఓ కార్మికుడిగా పని చేస్తూ పొట్ట నింపుకుంటున్నాడు. కార్పెంటర్ అమరేష్ మదేషియాదీ ఇదే కథ. టెల్ అవీవ్‌లో ఎనిమిది వారాలు కార్మికుడిగా పనిచేశాడు. ఇప్పుడు సిమెంటు బస్తాలు, ఇనుప రాడ్లు మోస్తున్నాడు.

ఇది మచ్చుకు కొందరి వ్యథ మాత్రమే. ద్వైపాక్షిక ఉద్యోగ పథకంలో భాగంగా అనేక మంది భారతీయులు ఇజ్రాయిల్ వెళ్లారు. నిర్మాణ రంగంలో పని కోసం వీరిని తీసుకుంటున్నామని చెబుతారు. గత సంవత్సరం అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడి తర్వాత ఇజ్రాయిల్‌లో పనిచేస్తున్న లక్ష మంది పాలస్తీనీయులపై నిషేధం విధించారు. దీంతో అక్కడ పనివారి అవసరం ఏర్పడింది. భారతీయులలో నిరుద్యోగాన్ని ఆసరాగా చేసుకొని వారికి వల వేశారు. ఆ వలలో పడిన అనేక మంది ఇజ్రాయిల్ బాట పట్టి ఇప్పుడు నానా అవస్థలు పడుతున్నారు. మన దేశంలో వారు చేసిన పనికి, ప్రస్తుతం అక్కడ చేస్తున్న పనికి ఏ మాత్రం పొంతన లేదు. వారి నైపుణ్యం ఎందుకూ పనికి రావడం లేదు. ఇజ్రాయిల్ తరలించే ముందు వారికి ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలే అయ్యాయి. నెలకు సగటున నికరంగా రూ.1.9 లక్షల వేతనం ఇస్తామని ఆశ చూపి వివిధ పనులలో నైపుణ్యం కలిగిన పనివారిని ఇజ్రాయిల్ తీసికెళ్లారు. ఇందుకు మోడీ ప్రభుత్వం సహకరించింది. ఇజ్రాయిల్ అధికారులు మన కార్మికులకు నిర్మాణ రంగంలో పని కల్పించాల్సింది పోయి వారిని నైపుణ్యం లేని పనులకు, నిర్మాణేతర రంగాలలో పారిశ్రామిక ఉద్యోగాలకు పంపారు. రెండు దేశాల మధ్య ఉన్న ముఖ్యమైన సంబంధాలు దెబ్బతినకుండా చూసేందుకే ఇజ్రాయిల్ అధికారులు ఈ ఎత్తుగడ పన్నారు. దీనిపై ఇజ్రాయిల్ రాయబార కార్యాలయ అధికారులను సంప్రదించగా నియామక ప్రక్రియతో తమకు ఎలాంటి సంబంధం ఉండదని తేల్చేశారు.

భారతీయ కార్మికులతో బయలు దేరిన మొదటి విమానం ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్‌కు చేరి నాలుగు నెలలు అయింది. ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా నియమితులైన ఐదారు వందల మంది కార్మికులు ఇప్పటికే స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం అందించిన వివరాల ప్రకారం అక్కడ ఐదు వేల మంది భారతీయ కార్మికులను నియమించారు. దానికి ముందు హర్యానా, యూపీ, తెలంగాణ రాష్ట్రాలలో మూడు విడతలుగా వారికి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. అయితే వీరిలో చాలా మందికి నిర్మాణ రంగం పనులలో అనుభవం లేదని అక్కడి అధికారులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇజ్రాయిల్ బిల్డర్లు వీరితో పని చేయించుకునేందుకు నిరాకరించారని, ఇతర దేశాల నుండి కార్మికులను పిలిపించాలని కోరారని తెలిపారు. నిర్మాణ రంగంలో కార్మికుల అనుభవాన్ని సరిగా అంచనా వేయలేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని వివరించారు. మే తర్వాత రెండు వేల మంది భారతీయ కార్మికుల వీసాలు, కాంట్రాక్టులను రద్దు చేశారని చెప్పారు.ఈ నేపథ్యంలోనే భారతీయ కార్మికులకు ఇతర పనులు అప్పగించామని జూన్ 24న ఇజ్రాయిల్ పాప్యులేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ (పీఐబీఏ) ఓ అధికారిక నోట్ విడుదల చేసింది. ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చింది. కార్మికులకు ఈ నెలలోనే మరో విడత నైపుణ్య పరీక్ష నిర్వహించేందుకు ఇజ్రాయిల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నవతెలంగాణ

మంచి ఆలోచనలు నిస్వార్థ కోరికలు కలిగి ఉన్నవారు
సంతోషంగా జీవిస్తారు - ఎమర్సన్

బుధవారం 11 సెప్టెంబరు 2024
www.navatelangana.com

సంక్షేమంపై ప్రైయి'వేటు'!

అద్దాల మేడల నిర్మాణంలో రాళ్లెత్తే కూలీలు వారు. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు. అడ్డాలపై నిలబడి పనికోసం పడిగాపులు పడుతుంటారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకున్నారు. ఇప్పుడు ఆ పథకాల నుండి ప్రభుత్వం తప్పుకోజూస్తున్నది. ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీని కోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2009లో వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులోని ప్రమాద మరణం, సహజ మరణం, పాక్షిక, శాశ్వత అంగవైకల్యానికి సంబంధించిన పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటూ ఆగస్టు 21వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఈ పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించడం వల్ల వచ్చే ఆ కాస్త ప్రయోజనాలు కూడా అందకుండా పోతాయేమోనని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. వీరి వేదనలో నిజం లేకపోలేదు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అనేక తప్పులు చూపి, సాకులు వెదికి కార్మికులకు రావల్సిన నష్టపరిహారం అందకుండా చేస్తున్నారు. ఇక (ప్రయివేటు) ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తే సమస్య ఎంత జఠిలమవుతుందో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు.



> ఒకపక్క అడ్డాల్లో మౌలిక సదుపాయాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేరళ, పంజాబ్, ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రాలు 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం ఇలాంటివేవీ అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మిక సంక్షేమ పథకాలను సరిగ్గా అమలు చేస్తుందనుకుంటే ముఖ్యమైన స్కీంలను హడావుడిగా ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటున్నది. అందుకే కార్మికులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

ఇందులో అనేక తిరకాసులు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకున్న కార్మికులు 25,71,880. వీరంతా ప్రతి ఐదేండ్లకు ఓసారి రెన్యువల్ చేయించుకోవల్సి వుంటుంది. అనేక సమస్యలతో ప్రస్తుతం 15,10,330 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారు. ప్రభుత్వం వీరిని మాత్రమే కార్మికులుగా గుర్తిస్తోంది. మిగిలిన వారిని ఈ స్కీమ్ పరిధిలో చూపించడం లేదు. మరో విషయం గిగ్ వర్కర్స్(ఆన్‌లైన్ కార్మికులు)ను కూడా ఇందులో కలుపుతామంటున్నారు. అయితే వీళ్లకు ప్రీమియం ఎవరు కడతారనే దాంట్లో స్పష్టత లేదు.

నిబంధనల ప్రకారం పది లక్షల రూపాయలకు మించి కట్టే ప్రతి భవనానికి ఆ యజమాని పర్మిషన్ల సమ యంలో ప్రభుత్వానికి ఒక శాతం చెల్లించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలా రూ.5,700 కోట్లు బోర్డులో జమయ్యాయి. ఇందులో రూ.4,262 కోట్లు మాత్రమే కార్మికుల సంక్షేమానికి అందాయి. మిగిలిన మొత్తం గత ప్రభుత్వ హయాంలో ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళు ఖర్చు చేసుకున్నారు. చట్టం ప్రకారం ఒక శాఖకు చెందిన నిధులను మరో శాఖకు మళ్లించే హక్కు ప్రభుత్వానికే లేదు. అయినా న్యాయంగా కార్మికులకు అందాల్సిన నిధులను అధికారులు దారి మళ్లించారు. వాస్తవానికి 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డుకు కార్మిక సంఘ నాయకులతో ఓ అడ్వయిజరీ కమిటీ నియమించాలి. నిధులు ఖర్చు పెట్టాలన్నా, మార్పులేమైనా చేయాలన్నా ఈ కమిటీ నిర్ణయించాలి. అలాంటి కమిటీ మన రాష్ట్రంలో అసలు లేకపోవడమే ఈ సమస్యలకు ప్రధాన కారణం.

మరో ముఖ్యమైన విషయం ఈ పదేండ్లలో రాష్ట్రంలో కేవలం 5639 మంది మరణం ద్వారా, 627 మంది అంగవైకల్యం ద్వారా ఈ పథకాల నుండి ప్రయోజనం పొందారు. కానీ ప్రీమియం మాత్రం ప్రభుత్వం ప్రతి ఏడాది అందరికీ చెల్లిస్తుంది. దాంతో పెద్ద మొత్తంలో అందులో డబ్బు జమవుతుంది. వడ్డీ కూడా బాగానే వస్తుంది. ఇదంతా ప్రస్తుతం వెల్ఫేర్ బోర్డ్ ఆధ్వర్యంలో ఉంది. అయితే ఐఆర్‌డీఏ పరిధిలోని ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామని అంటున్నారు. అందులో ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రయివేటు కంపెనీలు కూడా ఉన్నాయి. ఏ కంపెనీలకు అప్పగిస్తారనేదాంట్లో స్పష్టత లేదు. ఒకవేళ ప్రయివేటు వారికి అప్పగిస్తే కార్మికుల నిధిని ఇన్సురెన్స్ కంపెనీలు స్వాహా చేసే ప్రమాదముంది.

ఒకపక్క అడ్డాల్లో మౌలిక సదుపాయాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేరళ, పంజాబ్, ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రాలు 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం ఇలాంటివేవీ అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మిక సంక్షేమ పథకాలను సరిగ్గా అమలు చేస్తుందనుకుంటే ముఖ్యమైన స్కీంలను హడావుడిగా ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటున్నది. అందుకే కార్మికులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి. కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి. ఎట్టిపరిస్థితుల్లో కార్మిక సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అమలు చేయాలి. ఒకవేళ అప్ప గించాల్సి వస్తే ఎల్‌ఐసీ వంటి ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే అప్పగించాలి. అప్పుడే కార్మికులకు మేలు జరుగుతుంది. అలాగే వెంటనే వెల్ఫేర్ బోర్డ్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇది సర్కారు బాధ్యత.

సంపాదకీయం

ఆకాశం నిప్పుల వాన
కురిపిస్తుంది
మృత్యువు వికటాట్టహాసం
చేస్తుంది
నేల నలుదిక్కుల నెత్తురు
చిమ్ముతుంది
నెనరు లేని ఆకాశం రక్త
వర్ణంలో
మరో రోజుకు
పురుడు పోస్తుంది
పసి మొగ్గలు అర్థాంతరంగా
అంతర్ధానమవుతాయి
రెక్క విరిగిన తెల్ల పావురం
నిశ్శబ్దంగా కన్నీటి చుక్క
విడుస్తుంది
మృత్యు శిశిరం
మరో ఆకు రాలుస్తుంది

నెత్తుటి రుతువు



ఆయుధాలు రాజకీయాలని
నిర్ణయిస్తాయి
వాణిజ్యం యుద్ధాల్ని
ఎగుమతి చేస్తాయి
లాభాలు భావజాలానికి
దర్శకత్వం వహిస్తాయి
శిఖరాగ్ర సమావేశాల్లో
రెండు క్షిపణులు
చిరునవ్వులతో కరచాలనం
చేసుకుంటాయి
మరో రెండు
యుద్ధ ట్యాంకులు
పశ్చిమాసియాలో శాంతి
కోసం పరితపిస్తాయి
రహస్యంగా మరో యుద్ధానికి
ఒప్పందం జరిగిపోతుంది

ఆయుధ కాంట్రాక్టు పత్రాలపై
చేసిన సంతకాల సిరా
ఆరకముందే
రెండు ఆసుపత్రులు
నేలమట్టమవుతాయి
మరుక్షణం మరో రెండు
స్కూళ్లు
బూడిద కుప్పలౌతాయి
పసిపిల్లలు అనాథలవుతారు
ప్రపంచం కన్నీటితో
నివాళులర్పిస్తుంది

మానవత్వ హననానికి
ప్రపంచ పెట్టుబడి
ఐక్యరాజ్యసమితి సాక్షిగా
మరోసారి
ప్రతిన బూనుతుంది

- టి.హరికృష్ణ,
9494037288

ఒక యుద్ధంతో సంభాషణ



రమేష్ రాంపల్లి

సాయంకాలపు నీరెండకు ఆకాశం వెండిమబ్బులతో కొత్త కాంతులీనుతోంది. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. మెల్లగా వాన చినుకులు రాలుతుండగా ఆ సాయంత్రం మిత్రులతో కలిసి ఒక యోధుడిని చూడటానికి వెళ్లాను. చుట్టూ పచ్చని చేలు, చేల గట్టున పెద్దపెద్ద చెట్లు, ఆ చెట్ల మధ్యన పదో పదిహేనో ఇండ్లు. అందులో ఓ ఇంట్లో...పరుగులు తీసి, పరవళ్లు తొక్కి, ప్రళయగర్జనలు చేసి శాంతించిన జీవనదిలా ఉన్నాడాయన. ముగ్గుబుట్టలాంటి జుట్టు, కాంతులీనే కళ్లు, బంగారు రంగులో నిగనిగలాడే వళ్లు, తెల్లని దోవతీ, ఏ ఆచ్చాదనా లేని ఒంటిపై ఎర్రని కండువాతో ఓ నులక మంచంలో కూర్చుని ఉన్నాడు.

నాతోపాటే వచ్చిన మిత్రబృందమంతా "నమస్తే కామ్రేడ్" అని పలకరించింది.

పిడికిలి బిగించి "లాల్ సలామ్" అని బదులిచ్చాడు. "ఎట్లున్నవే.." అంటూ పక్కన కూర్చుని సంభాషణ ప్రారంభించాం..

"రెండేండ్ల కింద జారిపడ్డ. తుంటిబొక్క ఇరిగింది. ఆపరేషన్ చేయించుకున్న. అప్పటి నుంచి మంచానికే కట్టేసినట్టైంది" ఒకింత బాధను వ్యక్తం చేస్తూ చెప్పుకొచ్చాడు. అంతలోనే తేరుకుని "నా బాగుకేంగానీ మన పార్టీ ఎట్లుంది కామ్రేడ్? మన నాయకులేమంటుండ్రు?" అని అడిగాడు. నేనేదో సమాధానం చెప్పబోతుండగానే..."ఏం ఫికర్లేదు... ఎదురుదెబ్బలకు జడువొద్దు. ఎప్పటికైనా మనదే గెలుపు" అని ఆయన చెపుతుంటే... ఆత్మవిశ్వాసానికి నిలువెత్తురూపంలా కనిపించాడు. రెపరెపలాడే ఎర్రజెండాలా అనిపించాడు. నూటా ఆరేళ్ల పైబడుతున్నా నిరాశా నిస్పృహలను దరిచేరనివ్వని ఆ పండుటాకును గుండెలకత్తుకుని, పాదాలకు ప్రణమిల్లకుండా ఉండలేకపోయాం.

ధర్మాపురం పడమటి తండా ఓ తెల్లవారుజామున కన్న కల ధర్మానాయక్. ఆ కల నిజమై కడవెండి కొండల్లో నడకనేర్చి, పాలకుర్తి దారుల్లో సంఘమై నినదించి ఒక మహోన్నత పోరాటానికి, చరిత్రకూ నేడు ప్రతినిధిగా నిలబడి ఉన్నాడు దర్మానాయక్. తనను మొదటిసారి కలిసిప్పుడు ఆయనకు నూరేళ్లు. ఇప్పుడు నూటా ఆరేళ్లు. అప్పటికీ ఇప్పటికీ ఆయన ఒంట్లో బలం తగ్గిందేగానీ ఆలోచనల్లో పదును తగ్గలేదు. ఆయన తన తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను ఒక్కొక్కటిగా వివరిస్తుంటే మా కళ్లు చెమ్మగిల్లి, వళ్లు జలదరించిన సందర్భాలు అనేకం....

"నరహంతకులు విసునూరు దేశముఖ్‌లు... తండ్రి రాంచంద్రారెడ్డే క్రూరుడనుకుంటే, వాని కొడుకు బాబు దొర (జగన్మోహన్ రెడ్డి) మహాక్రూరుడు. కనిపించిన పడుచుపిల్లనల్లా పాడుచేస్తూ, ప్రజలను చిత్రహింసలు పెట్టిన ఆ నరరూప రాక్షసున్ని నా చేతులమీదుగా మట్టుబెట్టడం నా జీవితానికో తృప్తి" అంటూ ఆయన ఆనాటి ఘటనను వివరిస్తుంటే శరీరం రోమాంచితమయింది.

"దొరల అరాచకాల మీద జనం కోపంతో రగిలిపోతున్న రోజులవి. సాయుధ పోరాటం ఊపందుకుంది. గెరిల్లా దళాలు సమరోత్సాహంతో ప్రజాకంటకులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పల్లెపల్లెకు విస్తరించిన సంఘం అండతో ప్రజలు తిరుగబడుతున్నారు. అప్పటివరకూ ఆడిందే ఆటగా అరాచకాలు సాగించిన దొరలూ జాగీర్దార్లూ గడీలు దాటి బయటికి రావడానికే భయపడుతున్నరు. ఊర్లనొదిలి పట్టణాలకు పారిపోతున్నరు. అలాంటి రోజుల్లో 'బాబుదొర పారిపోతుండు' అనే వార్త మా దళానికి చేరింది. అర్ధరాత్రి ఒంటరిగా కచ్చడం కట్టుకుని బయలుదేరిన దొరోడు జనగాం రైల్వేస్టేషన్‌లో రైలెక్కి పట్నం పారిపోవాల నుకున్నడు. ఆ వార్త తెల్వంగనే గబ్బెట తిరుమల్‌రెడ్డి నాయ కత్వంలోని మా దళం రహస్యంగా జనగాంకు చేరుకుంది. ఆ నరహంతకున్ని ఎలాగైనా పట్టుకుని మట్టుబెట్టాలన్నది మా లక్ష్యం. కానీ ఆశ్చర్యంగా అప్పటికే ఎటుచూసినా జనంతో జనగాం కిటకిటలాడు తోంది. అంత జనాన్ని చూసి ఇక ఏ పోలీసూ మమ్మల్ని ఏం చేయలేదని నిర్ధారించుకున్నాం. అప్పటివరకూ రహస్యంగా ఉంచిన మా ఆయుధాలను బయటకు తీసి భుజాలకు ధరించాం. అది చూసి జనం జయజయధ్వానాలు చేశారు. ఇంతలో దొరోడు పోలీస్ స్టేషన్లోనే దాక్కున్నాడనే జాడ తెలిసింది. స్టేషన్ మీదికి దండెత్తాం. భయపడ్డ అమీనోడు వాన్ని దొడ్డిదారిన బయటికి తోలిండు. దూరంగా స్టేషన్ వెనుకవైపునుంచి చేతిలో పిస్తోలుతో పారిపోతూ దొరోడు నా కంటబడ్డడు. నేను వాని వెంటబడ్డ.. నా వెనుకే మా సాయుధ దళం.. రైల్వేస్టేషన్‌కు దూరంగా ఆగివుంది ఓ మాల్‌గాడీ. వంగ బడి దాని కిందంగ పట్టాలు దాటుతుండు.. వెనుకనుండి గల్లా పట్టి గుంజి ఈడ్చుకుంట రైల్వేస్టేషన్ పక్కనే ఉన్న మర్రిచెట్టుకింద పడేసిన. తుపాకీ మడమతో డొక్కలో ఒక్క గుద్దు గుద్దితే గెక్కుమని బొక్కబోర్ల పడ్డడు కొడుకు. రెండో దెబ్బ వేద్దామని తుపాకీ పైకి లేపిన... కానీ అప్పటికే అక్కడ కిక్కిరిసిన జనం నాకా అవకాశం ఇవ్వలేదు. ఒక్కసారిగా మీదబడి కుక్కను కొట్టినట్టు కొట్టబట్టిండ్రు. తుప్ప తుప్ప ఊంచుకుంట, చెప్పులతో కొడుతుంటే దొరోడు 'దూప దూప' అంటూ ఆయాసపడుతుండు. అదిగో అప్పుడొచ్చింది మా వదిన పూలమ్మ... మహా అందగత్తె. దొరోడు ఎన్నిసార్లు చెరబట్టాలని చూసినా ఆమె వాడి చేతికి చిక్కలే.. భర్తను సాయుధ పోరాటానికి పంపింది. కొడుకును కొరియర్‌గా మార్చింది. ఆమె సాయుధ దళాలకు అన్నం పెట్టే అమ్మయింది. ఇంటినే ఓ పోరాట కేంద్రంగా మార్చింది. కక్ష గట్టిన దొరోడు ఆ కుటుంబాన్ని ఎన్ని చిత్రహింసలు పెట్టినా ఆమె వాడికి లొంగలే. కానీ, గుండెల్లో ఎంత బాధను మోసిందో ఏమో.. కండ్లల్లో నీళ్లతోపాటే నిప్పులూ కురిపిస్తూ సివంగిలా దూసుకొచ్చింది. చేతికి చిక్కిన దొరోడి గుండెలమీద కాలు పెట్టి, బిగ్గరగా మాట్లాడటం మొదలుపెట్టింది...

'మనలను నరకయాతనలు పెట్టిన వీడు ఈ రోజు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండు. జీవిగంజి కోసం అల్లాడుతుండు. వీనికి నేను జీవిగంజి పోస్తున్నా.. మీరందరూ నాకు కొడుకుల్లాంటోళ్లే.. నేను మీ అమ్మలాంటిదాన్ని.. మీరెవరూ ఏమనుకోవద్దు బిడ్డా...' అంటూ బోరున ఏడుస్తూ అందరూ చూస్తుండగానే వాడి నోట్లో మూత్రం పోసి, ఎడమ కాలితో మొహం మీద ఒక తన్ను తన్ని పక్కకు జరిగింది. అంతే.. కట్టలు తెగిన ఆవేశంతో జనం వాన్ని అక్కడికక్కడే తొక్కితొక్కి చంపిండ్రు." అని చెపుతూ కంటనీరు బెట్టుకున్నాడు. ఈ భావోద్వేగపూరితమైన సన్నివేశం మా గుండెల్ని కదిలించింది. ఓ నూటా ఆరేళ్ల జీవధార తన చరిత్రను కన్నీరుగా మార్చి మా దోసిట్లో పోస్తోందా అన్న భావన కలిగించింది.

నాటి ఆ చారిత్రక రైతాంగ పోరాటంలో సాయుధులై పోరాడిన వారిలో మిగిలివున్న ఒకే ఒక్కడు కామ్రేడ్ దర్మానాయక్. సంఘం నేతృత్వంలో వందల ఎకరాలు తన చేతులమీదుగా పంచినా తనకంటూ గుంటెడు భూమిని తీసుకోలేదు. పదహారేండ్లు గ్రామసర్పంచ్‌గా కొనసాగినా ఒక్క రూపాయి వెనకేసుకోలేదు. అందుకు ఆయనలో రవ్వంత కూడా బాధలేదు. పార్టీ ప్రమాణాలకు కట్టుబడి బతికానని గర్వపడతాడు. సుందరయ్య నాకు ఆదర్శమంటాడు. సుందరయ్య ప్రస్తావన రాగానే ఆయనలో ఓ అనిర్వచనీయమైన ఆనందాన్ని చూశాం.. ఆ మహానేతను తొలిసారి కలిసిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ..

"మేమొకరోజు మా స్థావరంలో సేదదీరుతుండగా కొరియరొచ్చి ఓ చీటీ ఇచ్చిపోయిండు. అది చదివి.. 'రేపు రాత్రి జనరల్ బాడీ మీటింగ్. సుందరయ్య వస్తుండట. మనమీరోజు రాత్రి బయలుదేరి రేపు రాత్రికల్లా ఎర్రగొల్లపాలెం చేరుకోవాలె' అన్నడు మా దళ కమాండర్ తిరుమల్‌రెడ్డి. ఒక్క తిరుమల్ రెడ్డి తప్ప, మాలో ఎవరమూ సుందరయ్య పేరు వినడమేగాని చూసింది లేదు. ఆయనను చూడాలని, మాట్లాడాలని ఎప్పటినుంచో కోరిక. ఇన్నాళ్లకు ఆ కోరిక తీరబోతుందన్న సంతోషంతో రాత్రి పన్నెండు గొట్టంగ బయలుదేరినం. ఎలుగు రాకముందే ఆ ఊరొడ్డుకు చేరుకుని ఏనెగుండ్ల మధ్య మోదుగుచెట్లల్ల మకామేసినం. ఎగిలి వారుతుండంగ ఓ నలుగురు ఆడోళ్లు గంపల్లో మాకు రెండుపూటలకూ సరిపడా బువ్వదెచ్చి ఇచ్చిపోయిండ్రు. తిని అక్కడే సేదదీరుతూ కొరియర్ కోసం ఎదురుచూస్తున్నం. రాత్రి తొమ్మిది గొట్టంగ వచ్చిండు కొరియర్. ఆయన వెంట ఓ గంట నడిచి పదింటికల్లా గుండ్లగుట్ట మీదికి చేరుకున్నం. ఎన్నెల ఎలుగుల్లో ఆ గుట్ట ఎండికొండలెక్కున్నది. అది ఎర్రగొల్లపాలెం, మరిగడి, మండేల్ గూడ అనే మూడు గ్రామాల సరిహద్దు. చుట్టూ దట్టమైన అడివి. మధ్యలో గుట్ట. గుట్ట మీద విశాలమైన మైదానమసొంటి స్థలం. ఆ స్థలం నడుమ ఓ ఎత్తైన గుండు. ఆ గుండు మీద నిలుచుంటే ఒక్క సెంట్రీతో నాలుగు దిక్కుల పహారా కాయొచ్చు. అప్పటికే ఆ గుండు మీద ఓ సెంట్రీ కామ్రేడ్ డ్యూటీలో ఉండు. మాకంటే ముందే అక్కడికి వందమంది దాకా చేరుకుండ్రు. చూస్తుండగానే ఆ సంఖ్య నాలుగొందలు దాటింది. ఆయుధాలతో సహా అంతమందిని ఒక్కచోట చూస్తుంటే నాలో నెత్తురు ఉప్పొంగింది. జనగాం తాలూకా గెరిల్లా దళాలన్నీ అక్కడే ఉన్నయి. అందరం పలకరింపులు, సమాలోచనల్లో మునిగివుండగా 'సుందరయ్య వస్తుండు' అంటూ సెంట్రీ తన చేతిని పడమటి దిక్కుకు చూపించిండు. నాలుగొందల తలలు ఒకేసారి ఆ ఒక్క దిక్కుకు తిరిగినయి. ఎనిమిదొందల కండ్లు ఒక్కని కోసం ఎదురు చూస్తున్నయి. దూరంగా పొదలు కదులుతున్నయి కానీ మనిషి జాడలేదు. అట్లా ఓ పదినిమిషాలు గడిచినంక ఆ కదులుతున్న పొదల్లోంచి బయటికొచ్చిండో మనిషి... ఖాకీ నెక్కరు, ఖాకీ అంగి, ఓ భుజాన గొంగడి, ఇంకో భుజాన తుపాకీ, వీపున భారీ సంచీ, వళ్లంతా ముల్లకంపలు చీరిన గాయాలతో అచ్చం మాలెక్కనే ఉన్నడు సుందరయ్య" అని చెపుతూ దర్మానాయక్ ఎంత మురిసిపోయాడో..!

> అందరం పలకరింపులు, సమాలోచనల్లో మునిగివుండగా 'సుందరయ్య వస్తుండు' అంటూ సెంట్రీ తన చేతిని పడమటి దిక్కుకు చూపించిండు. నాలుగొందల తలలు ఒకేసారి ఆ ఒక్క దిక్కుకు తిరిగినయి. ఎనిమిదొందల కండ్లు ఒక్కని కోసం ఎదురు చూస్తున్నయి. దూరంగా పొదలు కదులుతున్నయి కానీ మనిషి జాడలేదు. అట్లా ఓ పదినిమిషాలు గడిచినంక ఆ కదులుతున్న పొదల్లోంచి బయటికొచ్చిండో మనిషి... ఖాకీ నెక్కరు, ఖాకీ అంగి, ఓ భుజాన గొంగడి, ఇంకో భుజాన తుపాకీ, వీపున భారీ సంచీ, వళ్లంతా ముల్లకంపలు చీరిన గాయాలతో అచ్చం మాలెక్కనే ఉన్నడు సుందరయ్య'' అని చెపుతూ దర్మానాయక్ ఎంత మురిసిపోయాడో..!


అన్నీ ఇక్కడ ప్రస్తావించడం సాధ్యం కాదుగానీ... దేశానికి స్వాతంత్ర్యం రావడం, యూనియన్ సైన్యాల ప్రవేశం, మారిన పరిస్థితుల్లో గెరిల్లా ఎత్తుగడలూ వ్యూహాల్లో మార్పులు చేర్పుల గురించి ఆ రోజు సుందరయ్య చెప్పిన అనేక విషయాలు మాకు కళ్లకు కట్టినట్టు చెప్పాడు. సాయుధపోరాటం గురించి చెపుతున్నప్పుడు అతని మాటలు ఒకసారి గాలిలో తేలివచ్చే గానంలా ఉంటాయి. మరోసారి నెత్తుటి ధారలా ఉంటాయి. ఇంకోసారి తుపాకీ గర్జనలా ఉంటాయి. ఎలావున్నా అంతిమంగా అవి చరిత్రను దృశ్యమానం చేస్తాయి. మన మెదడులో పదునైన ఆలోచనలకు ప్రాణం పోస్తాయి.

> ధర్మాపురం పడమటి తండా ఓ తెల్లవారు జామున కన్న కల ధర్మానాయక్. ఆ కల నిజమై కడవెండి కొండల్లో నడకనేర్చి, పాలకుర్తి దారుల్లో సంఘమై నినదించి ఒక మహోన్నత పోరాటానికి, చరిత్రకూ నేడు ప్రతినిధిగా నిలబడి ఉన్నాడు దర్మానాయక్. తనను మొదటిసారి కలిసిప్పుడు ఆయనకు నూరేళ్లు. ఇప్పుడు నూటా ఆరేళ్లు. అప్పటికీ ఇప్పటికీ ఆయన ఒంట్లో బలం తగ్గిందేగానీ ఆలోచనల్లో పదును తగ్గలేదు. ఆయన తన తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలను ఒక్కొక్కటిగా వివరిస్తుంటే మా కళ్లు చెమ్మగిల్లి, వళ్లు జలదరించిన సందర్భాలు అనేకం.

దర్మానాయక్ ఆరితేరిన గెరిల్లా యోధుడు. తుపాకి కాల్చడంలో ఆతనిది గొప్ప నేర్పు. ఒకేఒక గుండుతో లక్ష్యాన్ని ఛేదించాలంటే ఆ ప్రాంతంలో ఏ దళానికైనా దర్మానాయక్ కావాల్సిందే. కార్యమేదైనా కఠోర దీక్షతో పూర్తి చేసే సాహసి అతడు. జైలుగోడలపై జెండా ఎగరేయాలంటే ఎంత సాహసం కావాలి? చేతి గోళ్లతో చెరసాలను ఛేదించబూనాడంటే ఎంతటి దీక్ష కావాలి? యూనియన్ సైన్యాల ప్రవేశం తరువాత ఆయన అరెస్టయ్యాడు. జాల్నా జైలులో ఖైదీగా ఉన్న సమయమది. తేదీ అక్టోబర్ 1, 1949. చైనాలో విప్లవం విజయ వంతమైన సందర్భం. గుర్తుగా జైలులో జెండా ఎగరేయాలి. ఎలా? తోటి ఖైదీలతో కలిసి ఓ తెల్లగుడ్డను ఎర్రమట్టిలో ముంచి, సున్నంతో సుత్తీకొడవలి గీసి అర్ధరాత్రి జైలు బురుజుపై ఎగరేశాడు. తెల్లవారే సరికి ఎగురుతున్న ఎర్రజెండాను చూసిన జైలు అధికారులు కోపంతో రగిలిపోయారు. ఈ పని ఎవరిదని అడిగితే నిజాన్ని నిర్భయంగా ఒప్పుకున్నాడు. ఆ పైన వీపుపై లాఠీల మోతమోగినా భరించాడేగానీ క్షమించమని మాత్రం అడగలేదు. ఇలాంటిదే మరో ఘటన.. ఓ అర్ధరాత్రి డ్యూటీలో ఉన్న సెంట్రీకి ఆయనను బంధించిన జైలుగది గోడను చీల్చుకుంటూ ఓ సన్నని వెలుగురేఖ కనిపించింది. అనుమాన మొచ్చి గదిలోకొచ్చి చూస్తే... ఎన్నిరోజుల నుంచి గీకుతుండో ఆ గోడను.. ఎటూ మూర వెడల్పుతో నెర్రెలుబారి చిల్లులుపడి కూలి పోవటానికి సిద్ధంగా ఉంది. ఆ చిల్లుల్లోంచి కనిపించిన గుడ్డి దీపపు వెలుగే ఆయనను పట్టించింది. ఆ పనికి అతని చేతిగోళ్లు, కట్టెపుల్లలే పనిముట్లయ్యాయంటే నమ్మగలమా? కానీ నమ్మితీరాలి. ఆ పైన పోలీసులు అతడిని నిలువెల్లా సంకెళ్లతో బంధించి ఓ నేలమాళిగలో పడేశారు. మరో ప్రఖ్యాత సాయుధపోరాటయోధుడూ, ఆ సమయంలో దర్మానాయక్ సహచర ఖైదీ అయిన నల్లా నర్సింహులు స్వయంగా తన ఆత్మకథలో నమోదుచేసిన ఘటన ఇది. ఇలా చెప్పుకుంటూ పోతే దర్మానాయక్ బతుకంతా ఓ సాహసాల ఊరేగింపే...

నిత్యం కష్టాలు వెంటాడుతున్నా జీవితం చివరి అంచుల దాకా కమ్యూనిజాన్నే శ్వాసిస్తూ.... ఓ అరుణపతాకంలా భాసిల్లగలవారు ఎవరుంటారు..? దర్మానాయక్‌లాంటి వీరయోధులు తప్ప. దర్మా నాయక్ ఓ నూటా ఆరేళ్ల చారిత్రక అద్భుతం. వెన్నెలలా నవ్వుతాడు. వేకువలా వెలుగుతాడు. కదిలిస్తే చాలు.. కురవడానికి సిద్ధంగా ఉన్న మేఘంలా ఉంటాడు. ఉత్తేజభరితమైన తన జ్ఞాపకాలతో మనలను ఉర్రూతలూగిస్తాడు. అతనితో మాట్లాడుతున్నంత సేపూ ఓ యుద్ధంతో సంభాషించినట్టే అనిపించింది.

> నాటి ఆ చారిత్రక రైతాంగ పోరాటంలో సాయుధులై పోరాడిన వారిలో మిగిలివున్న ఒకే ఒక్కడు కామ్రేడ్ దర్మానాయక్. సంఘం నేతృత్వంలో వందల ఎకరాలు తన చేతులమీదుగా పంచినా తనకంటూ గుంటెడు భూమిని తీసుకోలేదు. పద హారేండ్లు గ్రామసర్పంచ్‌గా కొనసాగినా ఒక్కరూపాయి వెనకేసుకోలేదు. అందుకు ఆయనలో రవ్వంత కూడా బాధలేదు. పార్టీ ప్రమాణాలకు కట్టుబడి బతికానని గర్వపడతాడు. సుందరయ్య నాకు ఆదర్శమంటాడు. సుందరయ్య ప్రస్తావన రాగానే ఆయనలో ఓ అనిర్వచనీయమైన ఆనందాన్ని చూశాం..



వేతనజీవులకు ఆరోగ్యసేవలు అందని ద్రాక్షేనా?



అంకం నరేష్
6301650324

పాలనా రథానికి ఉద్యోగ, ఉపాధ్యాయులే ప్రగతి చక్రాలు. వారిని భద్రతగా చూసుకోవాల్సిన బాధ్యత పాలకులదే. కానీ అనాదిగా ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏ ప్రభుత్వం కూడా సరైన వైద్యసేవలందించడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉచిత వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కు అక్రమాల జబ్బు సోకి మరుగున పడింది. గత మూడేండ్లుగా ఈ పథకం కింద వైద్య సేవల కోసం వెళ్లే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు కొన్ని ఆస్పత్రులు వైద్యమందించడానికి నిరాకరిస్తున్నాయి. దానికి కారణం, గత కొంతకాలంగా ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి రూ.వందల కోట్ల వరకు బకాయిలు ఉండటం. దీంతో ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఈ పథకం పట్ల నిరాసక్తతను చూపుతున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగమంటే కుటుంబానికే ఓ భరోసా. కానీ పాలకుల విధానాలు, మారుతున్న ధోరణుల కారణంగా ఉద్యోగం కత్తిమీద సాములా మారింది. జిల్లాల పునర్విభజన తర్వాత ఉద్యోగులపై పని భారం పెరిగింది. నలుగురు చేయాల్సిన పని ఒక్కరే చేయాల్సి వస్తున్నది. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలో గత దశాబ్దకాలంగా కొత్త నియామకాలు చేపట్టలేదు. దీనివల్ల సెలవులు తీసుకోకుండా రాత్రింబవళ్లూ నిరంతరాయంగా పని చేయడం వల్ల ఒత్తిడి పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అధిక రక్తపోటు, గుండెజబ్బు, మధుమేహం, దృష్టిలోపం వంటి రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా నలభై ఏండ్లు దాటిన ఉద్యోగులు అనారోగ్యంతో సతమతమవుతున్నారు.

స్వాంతన చేకూర్చని రీయింబర్స్‌మెంట్


ఉమ్మడి రాష్ట్రంలో 1972 నుంచి అమలవుతున్న సమీకృత వైద్య సహాయ నిబంధనలకు అనుగుణంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమలుల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లు డబ్బులు చెల్లించి వైద్యం పొంది చికిత్స అనంతరం బిల్లులందజేస్తే నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. మొదట ఉద్యోగులు, పెన్షనర్లకు అమలు చేసిన ఈ పథకాన్ని 2005 మార్చి నుంచి ఉత్తర్వు నెంబర్ 74 ద్వారా ఉపాధ్యాయులకు వర్తింపజేసింది. కానీ పథకం ఉద్యోగులకు స్వాంతన చేకూర్చలేకపోయింది. ఆస్పత్రుల నుంచి బిల్లులు పొందడం తర్వాత వాటిని సమర్పించడం, బిల్లులు మంజూరు కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం నెలల తరబడి ఎదురు చూడడం ఇబ్బందికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల మంజూరు కోసం తోటి ఉద్యోగులు అధికారులకు లంచాలు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురైంది. ఉద్యోగులు వైద్య చికిత్సల కోసం వచ్చిన మొత్తం డబ్బులు కాకుండా అందులో సగం వరకే ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గుండె జబ్బులు, నరాలు, మెదడు సంబంధిత శాస్త్ర చికిత్సలు, డెంటల్ చికిత్సలకు కుటుంబాలకు ఎంత ఖర్చయినా రూ.2లక్షల వరకే పరిమితి ఉండటంతో ఉచిత వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయి.

భరోసానివ్వని ఈహెచ్‌ఎస్

రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు గత తొమ్మిదేళ్లుగా గత ప్రభుత్వం అమలు పరిచిన ఈ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సరైన ఆరోగ్య భరోసా ఇవ్వలేకపోతున్నది. ఈ పథకం కింద ప్రవేశపెట్టిన హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత చికిత్సలు పొందే వీలున్నా కూడా ప్రయివేటు ఆస్పత్రుల నిర్వాకం వల్ల ఉద్యోగులు సరైన వైద్యం పొందలేకపోతున్నారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు తమకు లాభం కలిగించే ట్రీట్‌మెంట్ మాత్రమే ఈహెచ్‌ఎస్ కింద అందిస్తున్నాయి. ఏ ఆస్పత్రిలో ఏయే చికిత్సలు చేస్తున్నారనే అంశంపై అవగాహన లేక లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రాథమికంగా ఓ.పి స్థాయిలో చూపించుకునేందుకు ఆయా జిల్లాలో 14 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసినా సరైన వైద్య పరికరాలు, యంత్రాలు లేవు. మందులందక కొరత కూడా తీవ్రంగానేవుంది. రాష్ట్రంలో ఈ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయల బకాయి పడింది. బకాయిలు చెల్లించకపోవడంతో కార్పొరేట్ ఆస్పత్రులు హెల్త్ కార్డులను అనుమతించడం లేదు. ఈహెచ్‌ఎస్ సరిగా అమలుకాక, దానికి సమాంతరంగా మెడికల్ రీయింబర్స్ మెంట్‌ను అమలు చేస్తున్నప్పటికీ అది కూడా అంతంత మాత్రమే వైద్యసేవలందిస్తోందని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యరూపం దాల్చని పథకం!

ప్రస్తుతం రాష్ట్రంలో 3.19 లక్షల ఉద్యోగులు, 1.09 లక్షలు ఉపాధ్యాయులు,2.50 లక్షల పెన్షనర్లు, వీరిపై ఆధారపడిన 15 లక్షల మంది కుటుంబ సభ్యులున్నారు. వీరందరికీ ఆరోగ్య కార్డుల ద్వారా కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యమందించుటకు ప్రభుత్వానికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు చెప్పాయి. ఆ దిశగా ముందుకు కూడా సాగుతున్నాయి. గత ప్రభుత్వం అక్టోబర్ 2023లో 186 జీవో ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఈ ఆరోగ్య పథకం కార్యరూపం దాల్చలేదు. మూల వేతనంలో 1-2 శాతం చందా రూపంలో



ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు ఉద్యోగ సంఘాలు గతంలోనే సంసిద్ధత ప్రకటించాయి. కావున ఉద్యోగ ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీగా వ్యవహరిస్తున్న నూతన ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. సంఘాలు కోరినట్టు ఉద్యోగుల జీతాల నుండి కొంత శాతం ప్రీమియం రూపంలో వసూలు చేసి వచ్చిన మొత్తం నగదుకు, అంతే మొత్తం నగదును ప్రభుత్వం ఇస్తూ ఒక ట్రస్టు ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలందిస్తే బాగుంటుంది. ఈ ట్రస్టు ద్వారా ఉద్యోగ ఉపాధ్యాయులకు నాణ్యమైన వైద్య సేవలందించడానికి ఒక ఐఏఎస్ అధికారి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తే పర్యవేక్షణ కూడా సులభమవుతుంది. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తే వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారు. నీతి నిజాయితీతో ప్రజలకు సేవలందిస్తారు.

జాబ్ మేళాలతో యువతకు ఉద్యోగావకాశాలు

- మెగా జాబ్ మేళాకు విశేష స్పందన
- పోటీకి ముందే వేలాదిమంది యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తున్నాం
- ఎమ్మెల్సీగా గెలిస్తే యువతకకు స్కిల్, నాలెడ్జి సెంటర్‌తోపాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు
- పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆశీర్వదించండి
- లక్ష్ ఫౌండేషన్ చైర్మెన్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ముస్తాక్ అలీ
- లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు
- కరీంనగర్‌లో మెగా జాబ్ మేళాకు 35 ఎమ్ఎన్‌సీ కంపెనీలు
- హాజరైన వేలాది మంది నిరుద్యోగులు, 400మందికి ఉద్యోగాలు

యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా లక్ష్ ఫౌండేషన్ చైర్మన్, అడ్వకేట్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ముస్తాక్ అలీ ముందుకు సాగుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే పార్క్‌లో మంగళవారం లక్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "రోజ్‌గార్ కరీంనగర్" పేరిట నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు వేలాది మంది నిరుద్యోగులు హాజరుకాగా 35కి పైగా ఎమ్మెన్సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలది మందికిపైగా యువతి యువకులకు ఉద్యోగాలు కల్పించాయి. ప్రధానంగా మహిళలకు వర్క్‌ఫ్రం హోం ఉద్యోగాలు కూడా కల్పించారు. రానున్న కరీంనగర్ నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న నేపథ్యంలో గెలిచాక అది చేస్తా.. ఇది చేస్తా అని చెప్పడం సరికాదని మనం ఎంటో ముందే పట్టభద్రులకు తెలిసి విధంగా కనీ వినీ ఎరుగనిరీతిలో ఒకే రోజు 35కంపెనీలు తీసుకొచ్చి వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించామని, త్వరలోనే అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మెగా జాబ్ మేళాలు పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిండమే లక్ష్యంగా లక్ష పౌండేషన్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నట్లు జాబ్ మేళా సందరర్భంగా నవతెలంగాణతో ముచ్చటించారు.

- నవతెలంగాణ, కరీంనగర్



కరీంనగర్ : జాబ్ మేళాను ప్రారంభిస్తున్న డాక్టర్ ముస్తాక్ అలీ



నవతెలంగాణ : మేగా జాబ్ మేళా ఎందుకు నిర్వహించారు?

డాక్టర్ ఎండి ముస్తాక్ అలీ : లక్ష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎంతో మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నతంగా ఎదిగారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలవడానికి చాలామంది చాలా చెప్పారు. అవన్నీ ఎమ్మెల్సీగా గెలిచాక వారు చెప్పిన వాటిలో 20శాతం హామీలు కూడా అమలు చేయలేకపోయారు. నేను అలా కాదు ఎమ్మెల్సీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడే పట్టభద్రులకు ఏమైనా చేయాలని ఆలోచనతోనే పట్టభద్రుల్లో చాలా మంది నిరుద్యోగులున్నారు. వారి జీవితాల్లో ముందుగా వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతోనే ఈ మెగా జాబ్ మేళా ఏర్పాటుచేశాం. విశేష స్పందనరావడం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో నిజామాబాద్, సిద్దిపేట, ఆదిలాబాద్‌లో కూడా మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తాం వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పిస్తాం. నేను మాటల మనిషిని కాదు..చేతల్లో చూపిస్తా.. కార్పొరేట్ ఉద్యోగ అవకాశాలను స్థానిక యువతకు అందించడం కోసం టెక్ మహీంద్రా, గూగుల్‌వాకో, జెన్‌పాక్ట్, వంటి 35కి పైగా ఎమ్మెన్సీ కంపెనీలను తీసుకువచ్చాం. ఈ కార్యక్రమం ద్వారా యువత ప్రముఖ కంపెనీలతో నేరుగా కనెక్ట్ అయ్యే వేదికగా మారింది. నిరుద్యోగ సమస్యల పరిష్కారం పట్ల అంకితభావం ఉంది.

నవతెలంగాణ : మీ గురించి..?

డాక్టర్ ఎండి ముస్తాక్ అలీ : మా తండ్రి మహ్మద్ షౌకత్ అలీ తల్లి హాజర్ హున్నీసా బేగంకు ఆగస్టు 19, 1992లో జన్మించాను. ప్రాథమిక విద్యను వాణినికేతన్, వింద్యావలి పాఠశాలలో చదవుకున్నాను. ఇంటర్ నారాయణలో ఇంజనీరింగ్ జేఎన్‌టీయు హెచ్(ఎస్‌సీఐటీ) బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాను. శాతవాహన యూనవర్సిటీ పరిధిలో న్యాయ శాస్త్ర పట్టా పొందాను.

నవతెలంగాణ : లక్ష్ ఫౌండేషన్ ఎలా పుట్టుకొచ్చింది..?

డాక్టర్ ఎండి ముస్తాక్ అలీ : 2021లో సమాజ సేవ చేయాలనే ఆలోచనతో 2021లో లక్ష ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. స్థాపించిన ఏడాదిలోనే పేదలకు బెడ్‌షీట్ల పంపిణీ, ప్రతి ఏడాది ప్రతి తరగతికి ముగ్గురికి ఉచితంగా విద్యను అందిస్తున్నాం. ప్రతి ఏడాది సుమారు 50మందికి ఉచిత విద్య అందిస్తున్నారు. అన్నదానాలు చేశాం. పేదలకు, సామాజిక సేవచేయడం సంతృప్తినిచ్చాయి. అందుకే సామాజిక సేవతో పాటు రాజకీయంగా పట్టభద్రులకు మరింత సేవచేయాలని మంచి ఉద్దేశ్యంతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నాను.

నవతెలంగాణ : విద్యారంగంలో మీరు చేసిన కృషి..?

డా.ఎండి.ముస్తాక్ అలీ : విద్యారంగంలో చేసిన విశేష కృషి సేవలకుగాను 2018-19లో దుబాయ్‌లో ఇన్నోవేషన్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డు అందుకున్నాను. అలాగే బెస్ట్ ఎడ్యూప్రినర్ ఇయర్ అవార్డును సైతం అందుకున్నాను. 2015లో బెస్ట్ స్కూల్ ఆఫ్ ద ఇయర్ అవార్డును అందుకున్నాను. ఢిల్లీలో ఎడ్యుకేషనల్ ఐకాన్ అవార్డును డిల్లీలో అందుకోవడంతో నా బాధ్యత మరింత పెరిగింది.

నవతెలంగాణ : ఉద్యోగసాధనకు ఉద్యోగార్థులకు ఎలాంటి నైపుణ్యాలుండాలి?

డాక్టర్ ఎండి ముస్తాక్ అలీ : ఉద్యోగార్థులకు కేవలం సబ్జెక్టు పరిజ్ఞానం ఉంటే సరిపోదు.. లోకజ్ఞానంతోపాటు కొన్ని నైపుణ్యాలూ అవసరం. డిజిటల్ యుగంలో సాంకేతికపరమైన నైపుణ్యాల్లేకపోతే కెరీర్‌లో ఒక్క అడుగు కూడా ముందుకెళ్లలేం. మార్పులకనుగుణంగా కొత్త కోర్సులు, టూల్స్ నేర్చుకుంటూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలి. నిర్ణయాలు తీసుకోవడంలో చురుగ్గా వ్యవహరిస్తూ గత అనుభవాల్ని దృష్టిలో ఉంచుకొని ఆచీతూచి వ్యవహరించగలిగే శైలి మేలు చేస్తుంది. నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ, ప్రతి పనినీ అందరికంటే భిన్నంగా చేయగలిగే వారికే సంస్థలు ప్రాధాన్యమిస్తుంటాయి.

నవతెలంగాణ : ఎమ్మెల్సీగా గెలిస్తే పట్టభద్రులకు ఎం చేస్తారు?

డాక్టర్ ఎండి ముస్తాక్ అలీ : అందరిలా నేను మాటల మనిషిని కాదు.. ఇప్పటికే ఈ జాబ్ మేళాతో ముందుకు వచ్చినప్పుడే పట్టభద్రులు అర్థం చేసుకున్నారు. నేనే మాటల మనిషని కాదని చేతల మనిషినని.. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సమయంలోనే వేలాది మందికి ఉద్యోగవకాశాలు కల్పించడం లక్ష్యంగా పనిచేస్తున్నాను. ఎమ్మెల్సీగా ఆశీర్వదిస్తే జిల్లా కో స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్‌ను తీసుకొచ్చి ఉద్యోగార్థులకు కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించి వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం లక్ష్యం.

జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించినవారికి నియామక పత్రాలు అందజేస్తున్న ముస్తాక్ అలీ





జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

పిరమైన కాయగూరలు

- భారీ వర్షాలతో దిగుమతులపై తీవ్ర ప్రభావం
- ఎక్కడో పండించే చోట దెబ్బతింటే ఇక్కడ ధరల మంట
- కొండంత వినియోగానికి.. ఇక్కడ గోరంతనే సేద్యంకాగా..
- రోజువారీగా ఆంధ్రా నుంచే వేలాది క్వింటాళ్ల రాక..
- నిత్యావసర సరుకులు, పట్టని మాంసం ధరలు పిరమే



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు అవసరమైన కాయగూరలు స్థానికంగా పండించాలంటే కనీసం 25వేల ఎకరాల్లో సాగు చేయాలి.. అలాంటిది ఏటా వానాకాలం 4వేల నుంచి 5వేల ఎకరాల సేద్యమూ దాటడం లేదు. 90శాతంమేర ఇతర రాష్ట్రాల నుంచి వేలాది క్వింటాళ్ల దిగుమతి అయితే తప్ప జిల్లా అవసరాలు తీరడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడో కూరగాయలు పండించే చోట భారీ వర్షాలు పంటదిబ్బతీస్తే.. అక్కడి నుంచి సరిపడా దిగుమతుల్లేక ఇక్కడ ధరల మంట పుడుతోంది. వానాకాలంలో అగ్గువకు దొరకాల్సిన కాయగూరలు అగ్గిదూకే పరిస్థితికి వచ్చింది.

కొండంత వినియోగానికి.. ఇక్కడ గోరంతనే సేద్యం

కరీంనగర్‌లో 8వేల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 6వేలు, రాజన్న సిరిసిల్లలో 3500, పెద్దపల్లిలో 4500 ఎకరాల్లో సాగు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న దాదాపు 40లక్షల జనాభాకు సరిపడా కావాలంటే 22వేల ఎకరాల్లో ఏడాదిలో మూడు సీజన్లలో (సీజన్‌కు 8వేల ఎకరాల్లో) సాగు చేస్తే 90శాతం ఇక్కడి వాటినే వినియోగించుకోవచ్చునని, దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఉండదని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. వానకాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 5వేల ఎకరాలకు మించి సాగు కావడం లేదు. యాసంగిలో 5500 ఎకరాలు, ఎండాకాలంలో అయితే కేవలం 1500 ఎకరాల్లోనే సాగవుతోంది. కేవలం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే స్థానికంగా పండించిన కూరగాయలు కొంత మేర మార్కెట్‌లో అందుబాటులో ఉంటుండగా మిగిలిన మాసాల్లో దిగుమతి అవుతున్నాయి.

దిగుమతులపై భారీ వర్షాల ప్రభావం

ఉమ్మడి జిల్లాకు ఎక్కువగా ఆంధ్రాలోని చిత్తూరు, అనంతపురం, కర్నాటకలోని చింతామణి, కోలార్, భాగ్యపల్లి, మహారాష్ట్రలోని నాసిక్ సహా రాష్ట్ర సరిహద్దు జిల్లా ఖమ్మం, ఆపైన ఆంధ్రాలోని పలు ప్రాంతాలు నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ప్రధానంగా పక్కనే ఉన్న సిద్దిపేట జిల్లాలోని వంటిమామిడి సహా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూరగాయలు పెద్దఎత్తున ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు మార్కెట్‌కు చేరుతుంటాయి. అందులోనూ టమాటా, మిర్చి, బీరకాయ, కూర అలిచింత, కాకరకాయ, కొతిమీర, పూదీన, క్యాప్సికమ్, క్యాబేజీ, మెంతి, క్యారెట్లు అక్కడి నుంచే వస్తుంటాయి. ఇంకా కేరళ, కర్నాటకలోని బెంగళూరు మార్కెట్ వంటి పక్క రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వయా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రోజువారీగా లారీలు, డీసీఎం వ్యాన్లలో దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఆయా పంటలు సాగై ఉమ్మడి జిల్లాకు దిగుమతి అయ్యే ప్రాంతాల్లోనే భారీ వర్షాలు కుదిపేస్తున్నాయి. అక్కడి పంటలసాగునూ దిబ్బతీశాయి. ఫలితంగా హైదరాబాద్ లాంటి మహానగరాలకే ఎక్కువగా కాయగూరల లోడ్ వెళుతుండగా.. అక్కడి నుంచి వయా ఉమ్మడి కరీంనగర్‌జిల్లాకు సరిపడా రావడం లేదు. దీంతో మార్కెట్‌లో దళారులు, మారుబేరం చేసుకునే వాళ్లకు చేరే సరికే కాయగూర ఏదైనా కిలో రూ.30 నుంచి రూ.50పైనే పలుకుతోంది. ఇక వినియోగదారుడికి చేరే సరికి రూ.50పైనే చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు రోజుకు 15టన్నులవరకు టమాట అవసరం కాగా.. ఇప్పుడు 8టన్నులకుమించి రావడం లేదని టమాట వ్యాపారి 'నవతెలంగాణ'తో చెప్పారు. ఇదే పరిస్థితి ప్రతికాయగూర దిగుమతిలోనూ ఉందని పేర్కొన్నాడు.

మార్కెట్‌లో ధరల మోత...

సాధారణంగా మార్కెట్‌లో దిగుమతి చేసుకున్న చోట పలికిన ధరనే వినియోగదారుడిపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా అగ్గువరకు దొరకాల్సిన ఈ కాలంలో ప్రస్తుతం కిలో చొప్పున పచ్చిమిర్చి రూ.120, టమాట రూ.60, వంకాయ రూ.40, బెండకాయ రూ.50, గోరుచిక్కుడు రూ.80, దొండకాయ రూ.70, ఆలుగడ్డ రూ.60, ఆకుకూరలు రూ.70 నుంచి రూ.వంద పలుకుతున్నాయి. కాయగూరల ధరలే ఇలా ఉంటే వర్షాల ప్రభావం పౌల్ట్రీపైనా పడింది. దీంతో శ్రావణమాసం, ప్రస్తుతం వినాయకచవితి ఉన్నా... చికెన్ ధర కిలో రూ.200లకు తక్కువ దిగడం లేదు. ఇక మేక, గొర్రెపోతు మాంసం కిలో రూ.800 నుంచి 900 మధ్యనే ఉంటోంది. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువుల్లో పుష్కలంగా లభిస్తున్న చేపల ధరలూ ఏమాత్రం తీసిపోకుండా వేసవి ధరలే కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ ట్రావెల్స్‌లో టాక్సీ కార్లు ఉపయోగించాలి

ఆల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవి



నవతెలంగాణ-కరీంనగర్ : ప్రభుత్వ కార్యాలయాలు ట్రావెల్స్‌లలో టాక్సీ కార్లు ఉపయోగించాలని ఆల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ట్రావెల్స్ లలో నిబంధనల ప్రకారం టాక్సీ కార్లు కిరాయిలకు ఉపయోగించాలని మంగళవారం నగరంలోని స్థానిక గీతా భవన్ చౌరస్తా వద్ద కరీంనగర్ జిల్లా పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ..ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వ అధికారులే బంధువులు, టాక్సీ కార్లు ఓనర్ల పేర్లపై బినామీ పేర్లతో వాహనాలు నడుపుతున్నారని ఆరోపించారు. రూ.33వేలు బిల్లులు తీసుకుంటున్నారని, పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ట్రావెల్స్‌లో టాక్సీ కార్లు ప్రజలకు అవసరాల నిమిత్తం శుభకార్యాలకు, విహారయాత్రలకు, ప్రభుత్వ కార్యాలయాలకు నిమిత్తం ట్యాక్సీ కార్లు (ఎల్లో ప్లేట్) వాహనాలు కిరాయిలకు పంపాలని కోరారు. లేని యెడల ట్రావెల్స్, రవాణా శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్శెట్టి శశి కుమార్, నూనిగంటి రాజు, అనంతోజు రమేష్, కోడు ప్రభాకర్, పొట్ల ప్రవీణ్, మునుగు వీరస్వామి, ఎలా మల్లేశం, దయ్యాల శ్రీనివాస్, పున్నం రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్వీజేసీ కళాశాలలో కంటి వైద్య పరీక్షలు



నవతెలంగాణ-కరీంనగర్: నగరంలోని స్థానిక శ్రీవెంకటేశ్వర బాలికల జానియర్ కళాశాలలో శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెసాలిటీ వారు ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగించి కళాశాలలోని బాలికలకు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కళాశాల చైర్మెన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి



నవతెలంగాణ-కరీంనగర్ : శాతవాహన యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, యూనివర్సిటీ నాయకులు రాష్ట్ర కార్య సమితి సభ్యులు జెల్లపెల్లి అంజన్న డిమాండ్ చేశారు. శాతవాహన యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న బోధన బోధనేతర సిబ్బంది నియమించాలని, ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో అవకతవకలపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ నియమించాలని, నూతన, వృత్తి కోర్సులను ప్రవేశపెట్టి పీహెచ్‌డీ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీని ముట్టడించారు. అనంతరం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్, యూనివర్సిటీ నాయకులు రాష్ట్ర కార్య సమితి సభ్యులు జెల్లపెల్లి అంజన్న మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విద్యాశాఖకు మంత్రిని నియమించాలని, శాతవాహన యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ నియమించి, నూతన కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. విభాగ్ కన్వీనర్ అజయ్, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, జిల్లా కన్వీనర్లు పూసాల విష్ణు, మాడవేణి సునీల్, బండి రాజశేఖర్, సామలపల్లి ప్రశాంత్, నగర కార్యదర్శులు భామండ్ల నందు, రాజు, సిద్ధార్థ, వరుణ్, హాస్టల్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, ఓమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుదాం

- స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని బీజేపీకి దేశ భక్తులమని చెప్పుకునే హక్కు లేదు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవరెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్ : సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రతిమ మల్టీప్లెక్స్ వద్ద గల చిట్యాల (చాకలి)ఐలమ్మ విగ్రహానికి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వారి నుండి స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా తెలంగాణలో నైజాం నవాబులు పరిపాలించారని, దేశ్ ముఖ్ లు, భూస్వాములు జాగిరిదారులు, తెలంగాణ ప్రజలను చిత్రహింసలు గురి చేశారన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలందరినీ ఐక్యం చేసి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముందుండి ఉద్యమాన్ని నడిపిన వారిలో కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ పేద ప్రజలు ఐక్యం చేసి ఉద్యమాన్ని నడిపారని, కమ్యూనిస్టు జెండా చేత పట్టి భీమ్ రెడ్డి నరసింహారెడ్డి సహకారంతో పేదలను ఏకం చేసి, కర్రలు, ఒడిసెల పట్టి నైజాం నవాబులను ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు ఎర్రజెండా పట్టిన వారేనన్నారు. బాంచన్ దొర నీ కాల్మొక్త అనే వెట్టి చాకిరీ నుండి, దొర ఏందీ రో... వాడి పీకుడేందిరో.. అని తిరగబడేలా ప్రజానీకాన్ని ఐక్యం చేసిన మహనీయులు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతంగా పోరాట అమరులు అనభేరి ప్రభాకర్ రావు, దొడ్డి కొమురయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, భీమ్ రెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మల స్ఫూర్తితో నేడు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం కొనసాగించాలన్నారు. నగరంలోని అన్ని విగ్రహాలను సుందరీకరణ చేసి, వాటర్ ఫౌంటేషన్ ఏర్పాటుచేసి తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని విస్మరించారని, ఇలాంటి వివక్షత తగదని హెచ్చరించారు. ఈ రోజు దేశభక్తులమని చెప్పుకుంటన్న బీజేపీ నాయకులు అసలు స్వాతంత్ర ఉద్యమంలోగాని, వీర తెలంగాణ సాయుధ పోరాటంలోగాని పాల్గొన లేదన్నారు. భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనకపోగా బ్రిటిష్ వారికి తొత్తులుగా మారి భారత ప్రజలను హింసించారన్నారు. బీజేపీ నాయకులు దేశభక్తులు కాదని, పక్కా దేశద్రోహులన్నారు. నాటి స్వతంత్ర పోరాటా చరిత్రను వక్రీకరిస్తూ అసలైన దేశభక్తులం తామేనని జబ్బులు చరుసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హిందుత్వం ముసుగులో దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలను కుల వివక్షత తో గుళ్లల్లోకి రానివ్వలేదని, సమానత్వానికి దూరంగా, అణచివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసం చేసిందని గుర్తు చేశారు. భారతదేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు అన్నిటిని కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తూ దేశ సంపదను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేకతను పక్కతోవ పట్టించడానికి వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని కులాల మధ్య మతాల మధ్య యుద్ధం లాగా చిత్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. వాస్తవంగా తెలంగాణ ప్రజలను నైజం నవాబు కొత్తగా మారిన ఇసునూరి రామచంద్రారెడ్డి హిందూవు అయి ఉండి హిందువులనే చిత్రహింసలు పెట్టి చంపారని, ముస్లింగా ఉన్న షేక్ బందగి,ఉస్మెల్లా ఖాన్ నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడారని అందుకని ఇది కులాల మధ్య మతాల మధ్య జరిగిన పోరాటం కాదని, మట్టి మనుషులు జరిపిన గట్టి పోరాటమని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నాటి సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం,జి.బీమా సాహెబ్,జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్,శీలం అశోక్ ,డి.నరేష్ పటేల్, నాయకులు పున్నం రవి, కాంపెల్లి అరవింద్,గజ్జల శ్రీకాంత్, రోహిత్, దండు నరసింహులు పాల్గొన్నారు.

తెలంగాణ తెగువకు చిరునామా ఐలమ్మ

నవతెలంగాణ - రామడుగు : తెలంగాణ తెగువకు చిరునామాగా నిలిచిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని శివగంగ మడేల్ రజక సంఘం గోపాలరావుపేట అధ్యక్షుడు పైండ్ల హనుమంతు అన్నారు. ఈ మేరకు ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలు గోపాలరావుపేట గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ - జమ్మికుంట : పట్టణంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మున్సిపల్ చైర్మెన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఇల్లందకుంట : మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం మండల అధ్యక్షులు రావుల ఎల్లయ్య ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట పిఎసిఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, మాజీ ఎంపీటీసీ పెద్ది కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం : మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు తాటిచెర్ల తిరుపతి ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ పర్యవేక్షకులు రాజేందర్ రెడ్డి హాజరై రజక సంఘం నాయకులతో కలిసి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

నవతెలంగాణ - హుజురాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ముందు ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద 39వ వర్ధంతి వేడుకలను పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంధే రాధిక కమిషనర్ సమ్మయ్య కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు భూమి, భుక్తిని అందించేందుకు చాకలి ఐలమ్మ పోరాడారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రామారపు వెంకటేష్ అన్నారు. మంగళవారం హుజురాబాద్ మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బోడ్డు రాజు పాల్గొన్నారు.

వీర వనిత చిట్యాల (చాకలి) ఐలమ్మ..

నవతెలంగాణ-కరీంనగర్ : నిజాం పరిపాలనలో పటేల్, పట్వారి, దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా, వీరోచితంగా పోరాడిన వీర వనిత చిట్యాల (చాకలి) ఐలమ్మ అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకట స్వామి కొనియాడారు. మంగళవారం ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని స్థానిక ప్రతిమ మల్టీప్లెక్స్ చౌరస్తాలో గల ఐలమ్మ విగ్రహానికి మర్రి వెంకట స్వామి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, నాయకులు తిప్పారపు సత్యనారాయణ చారి, నల్లగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



జమ్మికుంట: ఐలమ్మ విగ్రహానికి నివాళు లర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్





పిల్లలు మానసిక ఒత్తిడిని తట్టుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

నవతెలంగాణ-జగిత్యాల

పిల్లలు మానసిక ఒత్తిడిని అధిగమించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఫర్ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ డాక్టర్ అర్చన అన్నారు. కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఫర్ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ డాక్టర్ అర్చన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మహత్య ప్రవృత్తి ఎందుకు వస్తుందని, పిల్లలలో హార్మోనల్ పెరుగుదల వల్ల శరీరంలో కలిగే మార్పులు వాటి వలన కలిగే ఒత్తిడి ని అధిగమించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకొని చక్కగా చదువుకొని జీవితంలో పైకి రావాలన్నారు. మానసిక పరివర్తనకు యోగ, ధ్యానం చాలా ముఖ్యం అని పిల్లలందరు వారి దైనందిన జీవితంలో అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగ సుధారాణి, సీనియర్ టీచర్లు రవీందర్, ఆరోగ్య విద్యాబోధకులు తరాల శంకర్, సూపర్‌వైజర్ శ్యామ్ సుందర్, ఏఎన్ఎమ్స్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు ఉచిత వ్యాక్సినేషన్

నవతెలంగాణ-ఎండపల్లి



వ్యాక్సిన్‌లు వేస్తున్న పశువైద్యాధికారి

ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో మంగళవారం గొర్రెలు, మేకలకు ఉచిత పిపిఆర్ వ్యాక్సినేషన్ చేశారు. 153 గొర్రెలకు 36 మేకలకు టీకాలు వేసినట్టు పశు వైద్యులు తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే వ్యాక్సినేషన్లను సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీ ప్రియ, వైద్య సిబ్బంది నాగరాజు రాజేందర్, కుమార్, నవీన్, రామ్‌కుమార్, నారాయణ, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జగిత్యాల

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల మండలం కల్లెడ ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పనపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి టెస్టులు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, పిహెచ్‌సి పరిధిలోని వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి తహసీల్దార్‌గా రవీందర్ బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల తహసీల్దార్‌గా రవీందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెగడపల్లిలో తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాస్ బదిలీపై మెట్‌పల్లి వెళ్లగా ఆసిఫాబాద్ జిల్లాలో పని చేసిన రవీందర్ బదిలీపై పెగడపల్లికి వచ్చారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల పట్టణ 7వ వార్డుకు చెందిన లక్ష్మయ్యకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.60వేల విలువగల చెక్కును జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అందజేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన సోషల్ మీడియా కో కన్వీనర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి సోషల్ మీడియా కో కన్వీనర్ కట్ట మనోజ్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛన్ని అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు వారితో పాటు తిమ్మాపూర్ మాజీ ఉపసర్పంచ్ సల్ల సునీల్, ఆవుల రజినీకాంత్, కలిసిన వారిలో ఉన్నారు.

విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి




సభ్యత్వం రసీదును ఇస్తున్న తపస్ నాయకులు

నవతెలంగాణ-రాయికల్

రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావులు కోరారు. మంగళవారం మండలంలోని కిష్టంపేట, అల్లీపూర్, ఆలూరు, ఉప్పుమడుగు కస్తూర్బా విద్యాలయం, తదితర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదును చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ 317 జీ.ఓ ఉపాధ్యాయులను వెంటనే తమ జిల్లాలకు పంపాలని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి బీఈడీ, డిఎడ్ చేసిన సెకండరీ గ్రేడ్ వారితో కామన్ సీనియారిటీతో భర్తీ చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, కేజీబీవీ పాఠశాలలో పని చేసే వారికి పే స్కేల్ అమలు చేయాలని, సాధారణ సెలవుల సంఖ్య పెంచాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వెంటనే బదిలీలు చేపట్టాలని పెండిగ్‌లో ఉన్న నాలుగు డీ.ఏలకు వెంటనే జీ.ఓ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెరుకు మహేశ్వర శర్మ, యస్ గంగాధర్ కస్తూర్బా యస్.ఓ శోభారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన నర్సరీలను పరిశీలించిన డీఎఫ్ఓ

నవతెలంగాణ-మల్లాపూర్



పరిశీలిస్తున్న అధికారులు

మండల కేంద్రంలోని వన నర్సరీలను జగిత్యాల డీఎఫ్ఓ రవి ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నర్సరీలో పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. ఇక్కడ రాయికల్ రేంజ్ ఆఫీసర్ భూమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, బీట్ ఆఫీసర్ మహమ్మద్ వసీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాన కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ-ఎండపల్లి



పరామర్శిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలోని సాన జయాకర్ అంజయ్య మారుతి తల్లి మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. వారి వెంట సినీ నిర్మాత సాన యాదిరెడ్డి, సింహాచలం జగన్, రాజారాంపల్లె మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం, ఏలేటి చంద్రారెడ్డి, పొన్నం తిరుపతి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వనం రమణయ్య ఉన్నారు.

బీటీ రోడ్డు పనులపై నిర్లక్ష్యం?

- గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు
- నెల రోజుల క్రితం టెండర్ దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్
- ప్రారంభం కాని పనులు





నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గత ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా పనులు మొదలు కాలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రస్తుత ఉన్న బీటీ రోడ్డు గుంతలు మారి వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్తెకపల్లి నుంచి ఎర్రపూర్, డబ్బా మీదుగా వర్షకొండ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గీత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కోటి 40 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. నెల రోజుల క్రితం ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. కానీ పనులు మొదలు పెట్టలేదు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బీటీ రోడ్డు గుంతలుగా మారింది.

రోడ్డుపై బీటీ కోతకు గురై గుంతలుపడి కంకర తేలింది. మోకాళ్లలోతు గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో రోడ్డు మార్గంగుండా వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా సంబంధిత అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే రోడ్ల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నెల క్రితమే టెండర్ దక్కించుకున్నారు..

బీటీ రోడ్డు నిర్మాణానికి ఒక కోటి నలభై లక్షలు మంజూరైనది వాస్తవ మేనని.ఆ పనులకు నెల రోజుల క్రితం కాంట్రాక్టర్ టెండర్ దక్కించు కున్నారు. త్వరలోనే పనులు మొదలు పెడతారని చెప్పారు.

-ఏఈ అరుణ, పంచాయతీరాజ్

బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు మంజూరు



సత్తెకపల్లి నుంచి డబ్బా వర్షకొండ బీటీ రోడ్డు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని నిధులు మంజూరు అయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టకపోవడం చాలా బాధాకరం. బీటీ రోడ్డు పూర్తిగా గుంతల మయమై ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఇటిప్పటికైనా దృష్టి సారించి పనులు వేగవంతంగా జరగాలని కోరారు.

- పుప్పాల నర్సయ్య, డబ్బా మాజీ సర్పంచ్

గర్భిణులు, బాలింతలలో రక్త హీనతను నివారించి పోషణ స్థాయిని పెంపొందించాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

నవతెలంగాణ- పెగడపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

5 సంవత్సరాల పిల్లల్లో పోషణను, గర్భిణులు, బాలింతలలో రక్త హీనతను నివారించి పోషణ స్థాయిని పెంపొందించాలని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం పెగడపల్లి మండల పరిధిలోని నామాపూర్ గ్రామంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల్లో లోప పోషణను, నివారించడానికి పోషణ మాసం అనే ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో మండల స్థాయిలో ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలందరికీ అవగహన కల్పించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తులు, బరువులు నెలవారీగా క్రమం తప్పకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని కూడా అందరూ వినియోగించుకోవాలని సూచించారు. పిల్లకు పోషణ భి పాడాయి భి' అనే కార్యక్రమం ద్వారా పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యతో పాటు, పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా ప్రభుత్వంచే గుర్తింపు పొందినందున, దీని కోసం కోసం పిల్లలకు ప్రత్యేకమైన పాఠ్యాంశాలను రూపొందించినట్టు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు సుధన్, జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి.నరేష్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అధికారులు, గ్రామ, మండల ఉద్యోగ సిబ్బంది, సిడిపివో, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

నవతెలంగాణ-జగిత్యాల



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

తెలంగాణ సాయుధ పోరాటంలో బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా వెనుకబడిన తరగతి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాటి తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ అని కొనియాడారు. బహుజన ఆత్మగౌరవానికి ఆమె ప్రతీక అని, నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని ఆత్మగౌరవాన్ని హక్కుల కోసం ఐలమ్మ చేసిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తి, కృషిని కొనియడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, కలెక్టరేట్ ఏఓ. హన్మంతరావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ పాల్గొన్నారు.

మేడిపల్లి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి మండల రజక సంఘం నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు చెలిమెల నరసయ్య కార్యదర్శి వేములవాడ నారాయణ, సంయుక్త కార్యదర్శి వేములవాడ గంగారాజం ,కోశాధికారి రాయించు భీమయ్య కార్యవర్గ సభ్యులు వేములవాడ శేఖర్, రాజేష్. వేములవాడ శంకర్ పాల్గొన్నారు.

రాయికల్: వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి గొప్పదని పట్టణ రజక సంఘం నాయకులు అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నాయకులు కె.భూమయ్య, బి.గంగాధర్, బి.శ్రీను,ఎం.రాజు, ఎం.వెంకటేష్, కె.రమేష్, జె.నగేష్, బి.గంగాధర్, కె.సాయిలు, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న రజక సంఘం నాయకులు

మెట్‌పల్లి : పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రజక సంఘాల నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ రజక సంఘాల నాయకులు వన్నెల శశి,కలికోట వేణు, పిప్పెర రాజ్ కుమార్, వన్నెల సాయిలు, దొడ్డిపట్ల శ్రీనివాస్, సభ్యులు అంజయ్య లక్ష్మణ్, అంసయ్య, లక్ష్మీ నరసయ్య, భీమిడి గంగారం ,బుచ్చయ్య, శ్రీనివాస్ , రాజేందర్, భూమయ్య ,అశోక్, రాజయ్య, రాజ మురళి ,రాజేష్ ,లక్ష్మణ్, రాజేశ్వర్ ,సాయిలు ,నరసయ్య, రవి ,నరేష్ ,శేఖర్ పలువురు పాల్గొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యల నివారణ పిల్లల బాధ్యత

సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



వృద్ధుల ఆత్మహత్యల నివారణ వారి పిల్లల సామాజిక బాధ్యత అని, అన్ని మతాలు ఆత్మహత్యలను మహాపాతకంగా పేర్కొం టున్నాయని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. తమ సంపదలను, ఆస్తులను పిల్లలకు ఇచ్చే తల్లిదండ్రులైన వృద్ధులను కొంత కాలం తర్వాత స్వంత ఇళ్ల నుంచి వెళ్లగొట్టడం, లేదా వృద్ధుల సంరక్షణ గృహాల్లో, అనాథ శరణాలయాల్లో నెట్టడంతో మానసిక హింసకు గురవుతున్నారన్నారు. వైద్య చికిత్స ఖర్చులకు వైద్య బీమా ప్రణాళికలు లేకపోవడంతో పిల్లల నిరాదరణకు గురైన వృద్ధులైన తల్లిదండ్రులు తమ ఆత్మహత్యలే శరణ్యం అని నమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధుల్లో మనోబలం పెంచి ఆత్మహత్యలు నివారించేందుకు ప్రతి ఏటా తమ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నా ఎన్నారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్ముల ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి.సి.హన్మంత్‌రెడ్డి, ఎండి యాకూబ్, సీనియర్ న్యాయవాది సతీష్‌రాజ్, సింగం గంగాధర్, కే.సత్యనారాయణ, దేవేందర్‌రావు, నారాయణ, పబ్బా శివానందం, బి.రాజేశ్వర్, పి.నర్సింగారావు, పద్మ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీ చేస్తా మీ ఆశీస్సులు కావాలి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల



పట్టభద్రులు ఎమ్మెల్సీగా పోటీ చేస్తా మీ ఆశీస్సులు కావాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను జిల్లా బిడ్డగా చిన్నగా మొదలైన నా ప్రస్థానం 34 ఏళ్లుగా సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతుందన్నారు. శాసన మండలిలో వాయిస్ వినిపిస్తా అని, ఏ పార్టీకి సంబంధం లేకుండా ఎన్రోల్ మెంట్ స్టార్ట్ చేస్తామన్నారు. రాజకీయలకు అతీతంగా విద్యావ్యవస్థను నడుపుతున్నానని, ఉత్తర తెలంగాణకు గర్వ కారణంగా ఇవాళ అల్ఫోర్స్ విద్యా సంస్థలు తీర్చిదిద్దానన్నారు. కేజీ నుంచి పీజీ వరకు తనకు పూర్తి స్థాయిలో అవగాహన ఉందని, ఏ పార్టీతో ప్రస్తుతం సంబంధం లేకుండా ఉన్నానని తెలిపారు. అవసరం అయితే ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేయాలని అనుకుంటున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆశీస్సులు తీసుకున్నానని, ఏ పార్టీతో ప్రస్తుతం సంబంధం లేకుండా ఉన్నానని తెలిపారు. అందరికి ఉపయోగ పడే కార్యక్రమాలు చేపడుతూ రాజకీయ వేత్తగా రావాలని అనుకుంటున్నట్టు చెప్పారు. రాజకీయంలోకి వచ్చినా కూడా విద్యావ్యవస్థను వదిలే ప్రసక్తి లేదన్నారు. భవిష్యత్‌లో అల్ఫోర్స్ విద్యా సంస్థలు యధావిధిగా కొనసాగిస్తాయన్నారు. రెండు రంగాల్లో డ్యూయల్ రోల్ పోషిస్తూ సక్సెస్ అవుతా అని తెలిపారు.

మధ్యాహ్న భోజనం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

టోకెన్ సమ్మెలో భాగంగా జగిత్యాల కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సుతారి రాములు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, కొన్నేండ్లుగా నిరసనలు, ధర్నాలు, దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన రూ.10వేల వేతనం చెల్లించే విధంగా జీవో విడుదల చేయాలన్నారు. కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న మెనూ చార్జీలు సరిపోవడం లేదని మెను చార్జీలు రూ. 25లకు పెంచాలని, అదే విధంగా గ్యాసు, వంట సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేసే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎండీ ముక్రం, హనుమంతు వెన్న మహేష్ దేవదాస్, కిరణ్ కుమార్, సరస్వతి, శారద, లక్ష్మి, జమున పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం

నవతెలంగాణ-రాయికల్



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు పట్టణంలోని బాలుర పాఠశాల ఆవరణలో చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తహసిల్దార్ అబ్దుల్ ఖయ్యూం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో నిరు పేదలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ శిబిరంలో 265 మందికి కంటి పరీక్షలు చేయగా,84 మందికి కంటి ఆపరేషన్ కోసం రోగులను గుర్తించగా 44 మందికి ఉచిత కంటి ఆపరేషన్ నిమిత్తం హాస్పిటల్‌కు రిఫర్ చేసి ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించారు.లయన్స్ క్లబ్ ద్వారా 1913 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని క్లబ్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు మచ్చ శేఖర్,వైద్యులు డాక్టర్ ఉదయ్‌కుమార్, సబీర్ మహమ్మద్, ప్రభాకర్, లయన్స్ క్లబ్ మాజీ డీసీలు మ్యాకల రమేష్, బత్తిని భూమయ్య, కాటిపెల్లి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్,కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షులు కుర్మా సుదర్శన్‌రెడ్డి, కనపర్తి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ సభ్యులు ఎద్దండి దివాకర్, దాసరి గంగాధర్, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్, గ్రామీణ వైద్యులు ప్రవీణ్,ఉప్పుల నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ జగిత్యాల టౌన్

జగిత్యాల పట్టణ 9వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అన్వర్ అలీ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శిం చారు. అనంతరం జగిత్యాల పట్టణానికి చెందిన ముసిపట్ల ఆంజ నేయులు ఆర్టీసీ రిటైర్డు కండక్టర్ అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే 16వ వార్డుకు చెందిన చెంద్రపల్క చిన్న పద్మభూషణ్ గుండె పోటుతో మరణించగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి వెంట నాయకులు అడువల లక్ష్మణ్, జనగ ణమన గంగాధర్, చందా విద్యాసాగర్, వేణు, కౌన్సిలర్ శ్రీలత రామ్మోహన్‌రావు, నాయకులు, కొలగని సత్యం, ముసిపట్ల రాజేందర్, లక్ష్మి నారాయణ, కస్తూరి రాకేష్ తదితరులు ఉన్నారు.

మయూరం కాపాడిన కుమ్మరిపల్లి రైతు, అటవీ శాఖ సిబ్బంది



నేమలిని పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-వెల్గటూర్

మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలోని సత్యనారాయణ అనే రైతు తన పొలంలో నీరు తాగుతున్న మయూరాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఎగరలేక ఇబ్బంది పడుతున్న పక్షిని చూసి వెంటనే అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ ఆమెర్ అలీకి సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న అధికారులు మయూరం కాళ్ళు, రెక్కలను పరిశీలించి, వెటర్నరీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెటర్నరీ డాక్టర్లు మయూరానికి ప్రథమ చికిత్స అందించి, తర్వాత నేరెల్లలోని అడవిలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ మాటా డుతూ.. వన్యప్రాణులను కాపాడటం మనందరి బాధ్యత అని, సమాచారం అందించి రైతును అభినందించారు. ఈ సంఘటన మనల్ని పర్యావరణం గురించి మరింత ఆలోచించేలా చేస్తుందని సయ్యద్ ఆమెర్ అలీ అన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ - మెట్‌పల్లి

ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ అంగరి రమేష్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు మంగళవారం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సిబ్బంది రవళి, పిల్లి రాణి, ప్రధానోపాధ్యాయులు యస్. రవీందర్, ఉపాధ్యాయులు నర్సయ్య, విజయకుమార్, జగన్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్

నవతెలంగాణ - మెట్‌పల్లి

మెట్‌పల్లి మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ చేసిన బదిలీల్లో వెల్గటూర్ తహసీల్దార్ పని చేస్తున్న ఆయన మెట్‌పల్లికి బదిలీ అయ్యారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

రాజన్న సిరిసిల్ల

బుధవారం | సెప్టెంబర్ 11, 2024 | www.navatelangana.com

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి : హెల్త్ సూపర్‌వైజర్ వెంకటాచారి



నవ తెలంగాణ, ముస్తాబాద్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ హెల్త్ సూపర్‌వైజర్ వెంకటాచారి అన్నారు. ఆయన ముస్తాబాద్‌లోని శివకేశవ ఆలయాల వద్ద నిర్వహించిన హెల్త్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. వాతావరణం మార్పుల వల్ల జ్వరాలు, జలుబులు, దగ్గులు లాంటివి కామన్‌గా వస్తుంటాయని ఎవరు గాబురా పడవద్దని మలేరియా, డెంగీ, లాంటి జ్వరాలు ఏమైనా వస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చూపెట్టుకుంటే కావాల్సిన మందులు కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రేణుక, ఆశ వర్కర్లు దేవిక, రేణుక, వక్కుల గ్రామస్తులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన

నవతెలంగాణ-ముస్తాబాద్



మండల కేంద్రంలోని చిప్పలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు కాంగ్రెస్ పార్టీ రైతులను రుణమాఫీ పేరిట మోసం చేస్తుందని అందుకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని ప్రకటించి నప్పటికిని కేవలం 30 శాతం రైతులకు మాత్రమే పూర్తిగా రుణమాఫీ జరిగిందని మిగతా 70 శాతం రైతులకు రుణమాఫీ జరగలేదని రైతులను ఇలా మోసం చేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యూత్ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, మాజీ సర్పంచ్ తాడేపు ఎల్లం, యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ ఎంపీసీ వైస్ చైర్మన్ కొమ్మెట రాజమల్లు, ఎండీ. జహంగీర్, వంగూరి దిలీప్, పోతారం సతీష్, మల్లారెడ్డి, దేవరాజు, నాయకులు హనుమయ్య, పాల్గొన్నారు.

మా సంఘం స్థలం మాకు ఇప్పించండి..

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మహిళలు

నవతెలంగాణ-ముస్తాబాద్



మండలంలోని పోతుగల్ గ్రామంలో ప్రియాంకగాంధీ మహిళా సంక్షేమ సంఘం సభ్యులకు చెందిన 0-04 గుంటల భూమి ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఖబ్జా చేశారని వెంటనే మా సంఘం స్థలమును మాకు ఇప్పించాలని ఆ సంఘం మహిళా సభ్యులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామంలోని సర్వే నెంబర్ 113/3లో 1-03 గుంటల భూమి ఉండేదిని, దానిలో నుండే 0-12 గుంటల భూమి అప్పటి సర్పంచ్ వెన్నమనేని నారాయణరావు బడికి, మహిళ సంఘ భవనంకు కేటాయించారన్నారు. ఆ స్థలంలో బడి, మహిళా భవనాలు 30 సంవత్సరాల క్రితమే నిర్మాణం జరగాయని, ఇప్పుడు మహిళ భవనంకు చుట్టు ప్రహరీ గోడ కు ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధుల నుండి 3 లక్షలురూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభిస్తే, ఈ స్థలంను ఖబ్జా చేసిన వ్యక్తులు అడ్డు పడుతున్నారని రెవెన్యూ అధికారులు సహకరించి మా స్థలం మాకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక గాంధీ మహిళ సంక్షేమ సంఘం సభ్యులు మినుప భారతవ్వ, కేసుగాని పోషవ్వ, పేరుమని లీలావ్వ, కొండని ఎల్లవ్వ,లక్ష్మి,సర్వని లక్ష్మి,కేసుగాని లస్మవ్వ, పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ సిరిసిల్ల టౌన్



విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవోకి వినతి అందజేశారు.జిల్లాలోని ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. ఇలా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్,కోడం వెంకటేష్, శ్రీనివాస్, కొలనూరు కరుణాకర్,సంపత్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 11 నుండి 17 తేదీ వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.పోరాట వారోత్సవాల్లో ప్రజలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత : సీఐ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చందుర్తి



సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మర్రిగడ్డ ఎల్లమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన గుర్తించవచ్చని తెలిపారు.

రౌడీ షీటర్‌లను ప్రతిరోజు తనిఖీ చేయాలి

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ-సిరిసిల్ల

రౌడీ షీటర్ లను ప్రతిరోజు పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పనిసరి తనిఖీ చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను, స్టేషన్ పరిధిలో నమో దు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, రికార్డులు, స్టేషన్ రికార్డ్‌లు తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకొని డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత సూచించారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో గణేశ్ ఉత్సవాలు ప్రజలు శాంతియుతంగా వాతావరణంలో జరిగేలా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాలను అధికారులు, సిబ్బంది తరచు సందర్శించాలని, మండపాల నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే చిన్న స్పీకర్లను వినియోగించు కోవాలని, మండపాల్లో, శోభాయాత్ర సమయంలో డిజే ఏర్పాటుకు అనుమతి లేదని వివరించి చెప్పాలని ఆదేశించారు.ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ కృష్ణ సిబ్బంది ఉన్నారు.



సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వస్త్ర పరిశ్రమ జేఏసీ పోరాట ఫలితమే కార్మికులకు ఉపాధి

తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేష్

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్



వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ పోరాట ఫలితంగానే పవర్‌లూం కార్మికులకు ఉపాధి లభించనుందని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేష్ అన్నారు. మంగళవారం బీవైనగర్ అమృతలాల్ శుక్లా కార్మిక భవనంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన చేనేత సభలో సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల ఉపాధి నిమిత్తం కోటి 30 లక్షల చీరలు దాదాపు 8 కోట్ల పైచిలుకు మీటర్ల ఆర్డర్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమన్నారు. సీఎం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందించాలని, స్థానిక ఎంపీ బండి సంజయ్ స్పందించి కేంద్ర ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున ఆర్డర్లు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలన్నారు. వస్త్ర పరిశ్రమకు కరెంట్ సబ్సిడీ అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, నక్క దేవదాస్ బెజుగం సురేష్, స్వర్గం శేఖర్, బింగి సంపత్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

హైదరాబాద్‌లో జరిగిన చేనేత సభలో సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు ఉపాధి నిమిత్తం చీరల ఆర్డర్లను ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ సభ్యులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక గణేష్ నగర్ చౌరస్తా నుండి కొండ లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఆదిశీను, కేకే మహేందర్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షులు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి మండల రాజు, చేర్యాల అశోక్, కార్యదర్శులు ఆడేపు సాగర్, పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కోనరావుపేట

వైద్యం చేయించుకోవాలంటే డబ్బులు లేక ఓ నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోనరావుపేట మండలంలోని శివంగలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మక్కా పెల్లి పోశయ్య (75) అనే వృద్ధుడు సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు... గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గత కొన్ని రోజులుగా కడుపునొప్పుతో బాధపడుతూ వైద్యం చేయించుకోవాలంటే డబ్బులు లేక మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య లచ్చవ్వ, కొడుకు పర్శరాములు, కూతురు ఉన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- 25 గ్రాముల బంగారం స్వాధీనం
- వెల్లడించిన వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

నవతెలంగాణ-వేములవాడ రూరల్

దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు.మంగళవారం వేములవాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించించారు. ఏఎస్పీ మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామం రాజానగర్‌కి చెందిన శ్రీరాముల శ్రీనివాస్ తన ఇంటి పునరుద్ధరణలో భాగంగా తన ఇంటికి కలర్ వేయడానికి వేములవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు నందెల్లి అనిల్ కుమార్, సయ్యద్ అఫ్రోజ్‌లను కలసికలర్ వేయడానికి ఒప్పదం చేసుకున్నారని తెలిపారు. గత నెలరోజులుగా ఇంటికి కలర్ వేస్తుండగా ఆదివారం రోజు శ్రీనివాస్ తన భార్య కలిసి బెజ్జంకి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో వున్న హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవడంతో అనుమానంతో ఇల్లు అంత వెతకగా బ్యాగ్ కనిపించలేదు. బ్యాగ్‌లో 25 గ్రాముల బంగారం ఎవరో గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్ళినట్టుగా గుర్తించి వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఎస్.ఐ మారుతి, సిబ్బందితో టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా ఇంటికి కొద్ది దూరంలో బ్యాగ్ కనిపించగా, బ్యాగ్‌పై కలర్ మరకలు ఉండగా ఇల్లుకు కలర్ వేయడానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులను రాజనగర్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం తామే చేసినట్టుగా ఒప్పుకున్నట్లుగా ఆమె తెలిపారు. వారి వద్ద నుండి 25గ్రాముల బంగారం సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. 24 గంటల్లో దొంగతనం కేసును చేధించిన వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్,ఎస్.ఐ మారుతి, సిబ్బంది తిరుపతి, శంకర్, యాకూబ్, రాజశేఖర్, వెంకటేష్‌లను ఏఎస్పీ అభినందించారు.



చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



తంగళ్ళపల్లిలో...

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ అని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కోడం రమణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం చాకలి (చిట్యాల) ఐలమ్మ 39 వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ తంగళ్ళపల్లి మండల కమిటీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సంబంధంలేని మతోన్మాతులకు మాట్లాడే హక్కు లేదన్నారు. చాకలి ఐలమ్మ పోరాట వారసత్వాన్ని ప్రజలందరూ అందిపుచ్చుకోవాలని,ఆమె ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్నల్దాస్ గణేష్, కూచన శంకర్, పెద్దూరి తిరుపతి, మచ్చ శ్రీనివాస్, నర్సింగం, ఆనందం నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిరిసిల్లటౌన్

తెలంగాణ సాయుధ పోరాటం యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందాం కళ అన్నారు. రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐలమ్మ వీరనారి, ధీర వనితగా చరిత్ర పుటల్లో నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సిరిసిల్ల రజక సంఘం అధ్యక్షులు దండు శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్,జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య,పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

తెలంగాణ రాష్ట్రంలో పుట్టిన వీరవనిత, ధీరవనిత చాకలి ఐలమ్మ ఆమె నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్యలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం అధ్యక్షులు కంచర్ల నర్సింలు ఆధ్వర్యంలో 39వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలు సమాజంలో మేలుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తోట ఆగయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలలో పుట్టి పోరాటాలు చేసి తెలం గాణ రాష్ట్ర ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. వనజ కుమారి మాట్లాడు తూ భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం, రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని ఎందరో పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సింగిల్ విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బీజేపీ రాష్ట్ర నాయకులు కంచర్ల పర్శరాములు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలూరి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, మెండే శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై వ్యతిరేకంగా పోరాడిన ఘనత చాకలి ఐలమ్మదని కొనియాడారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 10 నుండి 17 వరకు తెలంగాణ విలీన వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుంద న్నారు. 17వతేదిన జిల్లాకేంద్రంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగు తుందని తెలంగాణ సాయుధ పోరాట విలీన వారోత్స వాలలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, జవ్వాజి విమల, సూరం పద్మ, మిట్టపెల్లి రాజమల్లు, అన్నల్దాస్ గణేష్, నక్క దేవదాస్, పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముస్తాబాద్

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల చాకలి ఐలమ్మ విగ్రహానికి మండల అధ్యక్షుడు పుల్లూరి శ్రీనివాస్, సహకార సంఘం డైరెక్టర్ అంజిరెడ్డి, నాయకులు రజక సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రజక సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు అక్కరాజు పరుశరాములు, సుద్దాల దేవయ్య, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కోనరావుపేట



సిరిసిల్ల టౌన్‌లో...

చాకలి ఐలమ్మ పోరాడినయోధురాలు అని జిల్లా ఐద్వా నాయకురాలు విమల అన్నారు మంగళవారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు రజాకార్లతో పోరాటం చేసిన మహిళ యోధురాలు చాకలి ఐలమ్మ అని ప్రతి మహిళ ఆమె స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవరకొండ నరసింహచారి , రజక సంఘం మండల గ్రామ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చందుర్తి

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అని పలువురు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసిందని అన్నారు. ఈ కార్యక్ర మంలో పలువురు రాజకీయ నాయకులు,రాజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షులు లోకుర్తి పెద్ద దేవయ్య అధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పొన్నం హన్మండ్లు, ప్రధాన కార్యదర్శి చింతల తానం శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ-కోనరావుపేట



ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యాలయ ఆవరణ, తరగతి గదులు, కిచెన్, తదితర వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాలుర, బాలికల డార్మేటరీ, తరగతి గదుల్లో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లు తక్కువగా ఉన్నాయని వెంటనే రెండు టాయిలెట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎంపీడీఓను ఆదేశించారు. గ్రామం నుంచి విద్యాలయం వరకు రోడ్ సరిగా లేదని రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు తరగతులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా పాఠాలు బోధించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాగం, తహసీల్దార్ విజయ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

గిద్దె గళం గద్దర్ అవార్డు అందుకున్న దేవయ్యకు సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సెస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు, కళాకా రుడు ఏరుపుల దేవయ్య గిద్దె గళం గద్దర్ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ ఏరుపుల దేవయ్య ఎంప్లాయిస్ యూనియన్ నాయకు డిగా, కళాకారునిగా మంచి గుర్తింపు పొంది వారం రోజుల క్రితం గిద్దె గళం గద్దర్ అవార్డు అందుకున్నారు. కళాకారు నిగా రాణించి మరిన్ని అవార్డులు అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జట్పీడీసీ సభ్యులు ఏలూరి రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మిరిశెట్టి తిరుపతి, మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండాడి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూడిది రాజేందర్, బందారి బాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-కోనరావుపేట

నేరాలు నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు సోమవారం కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో కమ్యూనిటీ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట ఎస్సై శేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాద బాధితులకు గడువులోగా సాయం అందాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ-సిరిసిల్ల



రోడ్డు ప్రమాద బాధితులకు గడువులో గా సాయం అందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. హిట్ అండ్ రన్ అంశంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్, ఆయా శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులకు నిర్ణయించిన గడువులోగా రెవెన్యూ, పోలీస్ అధికారుల నివేదిక ప్రకారం పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి రూ. రెండు లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కోర్టు గైడ్లైన్స్ ప్రకారం కేసుల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఎం హెచ్ఓ వసంత రావు, డీటీఓ లక్ష్మణ్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఘన్ శ్యామ్ ఓజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా లింగార్చన

నవతెలంగాణ-వేములవాడ



వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించు కొని వేములవాడ పట్టణంలోని 18వ వార్డులో రాక్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి వద్ద మహాలింగార్చన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలందరూ పాడిపంటలతో సంతోషంగా ఉండాలని భక్తులు స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొండ పావని నరసయ్య, రాజేష్, మనీష్, మహేందర్, మని సాయి, పాల్గొన్నారు.

విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-వీర్నపల్లి



జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం విద్యాసంస్థలకు అనుగుణంగా బస్సులు నడిపించాలని సిరిసిల్ల డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపెల్లి మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సులు రాకపోవడం విద్యార్థులు వారి క్లాసులు మిస్ అవుతున్నారని పాఠశాలల అనుగుణంగా బస్సులు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు సౌకర్యం కల్పించిన డీఎంకు కృతజ్ఞతలు

వీర్నపల్లి మండలం ప్రజలు, ప్రయాణికుల,విద్యార్థుల కోసం సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట, గర్జనపల్లి మీదుగా మర్రిమడ్లకు వరకు మంగళవారం అదనపు బస్సు నడిపించడంతో ప్రజలు డీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్ విద్యార్థులకు ప్రజలకు ఇబ్బందులలో ప్రయాణం చేస్తున్నారని తెలుపగానే స్పందించి అదనపు బస్సు వేసిన డిపో మేనేజర్ ప్రకాష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్



పట్టణంలోని స్థానిక నారాయణ స్కూల్‌లో పోక్సో చట్టంపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ పోక్సో చట్టం ఉల్లంఘిస్తే పడే శిక్షలు గురించి ఆయన వివరించారు.18 ఏళ్ల లోపు బాల, బాలికల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ జోన్ నారాయణ పాఠశాల ఏజీఎం చైతన్య రావు, ఆర్ఐ సత్యం రావు, జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ ఆర్ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకం, రైతు రుణమాఫీ, గృహజ్యోతి, తదితర పథకాలపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బుర్రలక్ష్మి, కళాకారులు ఎడమల శ్రీదర్ రెడ్డి రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్షరాములు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
పెద్దపల్లి
బుధవారం | సెప్టెంబర్ 11, 2024 | www.navatelangana.com

సమస్యలపై అదనపు కలెక్టర్, నగర కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-గోదావరిఖని:
సమస్యలపై అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ జె.అరుణశ్రీ, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్‌కు ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ ఎంఎ.గౌస్, కోకన్వీనర్ మద్దెల దినేష్‌లు వినతి పత్రాన్ని అందజేశారు. రామగుండం నగర పాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో 2020లో అప్పటి నగర పాలక సంస్థ కమిషనర్ మంచి ఉద్దేశ్యంతో కార్మికుల భద్రత కోసం, కార్మికుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సొసైటీ గ్రూప్‌ను కొంతమంది వారి స్వార్థం కొరకు వాడుకొని కార్మికుల కోసమేనన్న గ్రూప్‌ను ఓ సూపర్‌వైజర్ అధికార పార్టీ అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సొసైటీ గ్రూప్ లెక్కలు చెప్పకుండా, కార్మికులను వేధిస్తూ, నానారకాలుగా ఇబ్బందులు పెడుతున్నాడని, ఆ సూపర్‌వైజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, వారికి ప్రమాద బీమా 20 లక్షల రూపాయలు ప్రకటించాలని ఈ వినతి ద్వారా కోరారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం
రాష్ట్ర కార్యదర్శిగా కందుల సదాశివ

నవతెలంగాణ-ఓదెల




ఓదెల మండలం కనగర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా డైరెక్టర్ కందుల సదాశివుని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కందుల సదాశివ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. 2001 నుండి మలిదశ తెలంగాణ ఉద్యమంలో 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు తనవంతుగా తెలంగాణ ఉద్యమంలో పోరాడనని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని మార్కండేయకాలనీలోని మార్కండేయ శివాలయం, కళ్యాణ మండపం శాశ్వత సంక్షేమ ట్రస్ట్ అధ్యక్షులు పోరండ్ల ఆనందం, ప్రధాన కార్యదర్శి మంచికట్ల వెంకటస్వామి2024-2027కు మార్కండేయ శివాలయ ఉత్సవ కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా మంచికట్ల బిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా బండారి రాజమల్లు, కోశాధికారిగా గద్దం రవిగౌడ్‌లను నియమించారు. అదేవిధంగా ముఖ్య సలహాదారులుగా గుండ రాజు, కొండి లక్ష్మీపతిలను, కార్యవర్గ సభ్యులుగా కానుగంటి నారాయణ, కుంట రామన్న, తాటిపాముల రాజేష్, గుండేటి సతీష్, లెక్కల రాజిరెడ్డి, తోకల మల్లయ్య, బత్తుల నారాయణ, బోయిన కొమురయ్య, దొడ్డి ఎల్లయ్య, రాజేందర్, రాపెల్లి సాంబమూర్తి, జొన్నల రవీందర్, శీలారం తిరుపతి, మాటేటి సతీష్, బొద్దుల వేణు, వీరారెడ్డి, శ్రీనివాస్,నాగపురి రమేష్, రాజమౌళి, కిషన్‌లను నియమించారు. అధ్యక్షులుగా ఎన్నికైన మంచికట్ల బిక్షపతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మళ్లీ తనను ట్రస్ట్ అధ్యక్షునిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులందరూ ఉత్సవ కమిటీకి సహకరించాలని కోరారు.

10 వసంతాలు పూర్తి చేసుకున్న
వైఎఫ్ఎస్ వరసిద్ధి వినాయక మండపం

నవతెలంగాణ-మంథని



మంథని పట్టణంలో శ్రీ సీలేశ్వర,సిద్దేశ్వర దేవాలయం ఆవరణలో యూత్ ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల భాగంగా నెలకొల్పుతున్న వినాయక మండపంలో వరసిద్ధి వినాయక విగ్రహం10 వసంతాలు పూర్తి చేసుకుని రికార్డు సృష్టిస్తుంది.2013 నుండి పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు 10 సంవత్సరాల నుండి అత్యంత వైభవంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రులను వారి మిత్రబృందంతో ఉత్సాహంగా ప్రతి ఏటా జరుపుతున్నారు. మంథనిలో వెలసిన వినాయక గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెలిసిన వరసిద్ధి వినాయక విగ్రహం కనువిందు చేస్తోంది. పది వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి, ప్రతిరోజు నిత్యం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలతో గణనాథున్ని కొలుస్తున్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నవతెలంగాణ-గోదావరిఖని:



నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శ్రీధర్ యాదవ్ జన్మదిన వేడుకలను గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎండిహెచ్ డబ్ల్యూఎస్ బాలల సంరక్షణ కేంద్రంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు మొలుగూరి మహేష్ ఆధ్వర్యంలో, రామగుండంలోని తబిత ఆశ్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి నాయకులు నాగుల శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వారు కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. ఎండిహెచ్‌డ బ్ల్యూఎస్‌లో పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. తబితాలో పిల్లలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు చెన్నూరి నాగరాజు, పొడిశెట్టి మణిదీప్, అరక సాయి యాదవ్, ఆరెపల్లి రమేష్, చింత స్వరణ్, సుందిళ్ల సూర్య మహదేవ్, కుమ్మరి నాగార్జున, అక్కపెల్లి చంద్రశేఖర్ ఆజాద్, సుందిళ్ల సూర్య మహదేవ్, బండ గోపిచంద్, ఎర్రోళ్ల భరత్, మహేష్, బాలల సంరక్షణ కేంద్ర నిర్వాహకులు పోచంపల్లి రాజయ్య, తబిత ఆశ్రమ నిర్వాహకులు వీరెందర్ తదితరులున్నారు. అదేవిధంగా ఎన్టీపీసీ పికె రామయ్యకాలనీకి చెందిన నిరుపేద మహిళకు పెద్దపల్లి జిల్లా నాయకులు చెన్నూరి నాగరాజు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుళ్లపల్లి రాజ్‌కుమార్, ఎండి.ఫారూఖ్, ముజాహిద్, పుష్పా జగత్, హేమ, సబితా తదితరులున్నారు.

మత్తు నుంచి శాశ్వత విముక్తి కలిగేలా చికిత్స

- పన్నుల వసూలు మరింత మెరుగు పర్చుకోవాలి
- అనుమతి లేని నిర్మాణాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- రామగుండంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-గోదావరిఖని:
మత్తు పదార్థాలకు బానిసనిలైన వారికి 15 రోజుల పాటు ప్రత్యేకంగా చికిత్స చేసి ఆ మత్తు నుంచి శాశ్వత విముక్తి కలిగేలా చికిత్స అందించడం జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మత్తు పదార్థాలకు బానిసైనా వారికి విముక్తి కలిగించేందుకు ఏర్పాటు చేసిన 10 పడకల డీ అడిక్షన్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం నగర కార్పొరేషన్ పరిధిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి విస్తృతంగా పర్యటించారు. రామగుం డంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రికార్డులను పరిశీలించారు. భవిత సెంటర్‌ను కలెక్టర్ సందర్శించి దివ్యాంగ పిల్లలకు అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. గోదావరిఖనిలోని జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన 10 పడకల డీ అడిక్షన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించి, అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామగుండం పురపాలక కార్యాలయంలో టీయూఎఫ్ఐడిసి ద్వారా 100 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు, అమృత్ 2.0 క్రింద చేపట్టిన పనుల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో ప్రారంభమైన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలక సంస్థ పన్నుల వసూలు మరింత మెరుగు పర్చుకో వాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రామగుండం మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, సీఈ శివానంద, గోదావరిఖని జనరల్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సిడిపీఓ అలేఖ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమిష్టి కృషి

- సింగరేణి ఆర్జీ 1 జీఎం డి.లలిత్ కుమార్
- ఇప్పటి వరకు 87శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి యాజమాన్యం ఆర్జీ-1 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయడం జరుగుతుందని జీఎం డి.లలిత్ కుమార్ అన్నారు. మంగళవారం సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో బొగ్గు ఉత్పత్తి వివరాలను ఆయన వెల్లడించారు. ఏప్రిల్ 01, 2024 నుంచి సెప్టెంబర్ 09, 2024 వరకు 20,49,620 టన్నులకు గాను 17,92,185 టన్నులతో 87శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. వార్షికంగా 49,40,000 టన్నుల లక్ష్యానికిగాను ఇప్పటివరకు 36.3శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా ఇప్పటి వరకు 278,52,605 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 255,10,863 టన్నులతో 96శాతం సాధించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 720,00,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి నిర్దేశించుకోగా, ఇప్పటివరకు 35.4శాతం తీసినట్లు పేర్కొన్నారు. మరింత సమిష్టిగా పని చేస్తూ ఆర్జీ-1 ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేలా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఉద్యోగులను జీఎం కోరారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్ రావు, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, పర్సనల్ మెనేజర్ రవీందర్ రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి బాయి, క్వాలిటీ అధికారి సాయి ప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పీవో హనుమంత రావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సింగరేణి ఆర్జీ-1 జీఎం డి.లలిత్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆలస్యం వల్ల గుర్తింపు పత్రం జారీలో జాప్యం

నవతెలంగాణ-గోదావరిఖని:
రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆలస్యం వల్ల గుర్తింపు పత్రం ఏఐటీయూసీకి ఇవ్వడంలో జాప్యం జరిగిందని, గుర్తింపు పత్రం హోదాలో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఎనిమిది నెలల తర్వాత యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంతో సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏఐటీయూసీ సెంట్రల్ ఆఫీస్ బేరర్సు సమక్షంలో గుర్తింపు పత్రాన్ని కేంద్ర కార్మిక శాఖా డిప్యూటీ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు, సింగరేణి సి అండ్ ఎండి బలరాం నాయక్ ల చేతుల మీదుగా తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఎనిమిది నెలలు ఆలస్యం వల్ల కొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయూసీపై అవగాహన లేని విధంగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలస్యం ఐనా రెండు సంవత్సరాల కాలపరిమితి ఉన్నా కార్మికుల సమస్యలను, పరిష్కరించేందుకు జీఎం, డైరెక్టర్, సీఎండీ లెవెల్‌లో జరిగే పీరియాడికల్ స్ట్రక్చర్, జేసీసీ సమావేశాల్లో మాట్లాడి అగ్రిమెంట్ చేసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎంఎ.గౌస్, ఎం.చక్రపాణి, సిర్ర మల్లికార్జున్, రామగిరి అంకుల్, పెరుమాండ్ల రమేష్ గౌడ్, కెక్కెర్ల శ్రీకాంత్, నంది సరేష్, ఊరడి అంజయ్య, పెర్క రమేష్, మాహాంకాళి ప్రసాద్, కన్నం లక్ష్మి నారాయణ, బుర్ర భాస్కర్, తాళ్ళపెల్లి మల్లయ్య, చంద్రయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

విద్యార్థులకు షీటీంపై అవగాహన

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
రామగుండం సీపీ ఆదేశాల మేరకు పెద్ద పెల్లి, రంగపల్లి లోని మైనార్టీ జూని యర్ కళాశాల విద్యార్థులకు షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించా రు. షీటీం ఇన్‌చార్జ్ ఏఎస్ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల భద్రత ఆన్లైన్ మోసాలు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్‌కు డయల్ తెలపాలన్నారు.



12, 13న అడవీ శ్రీరాంపూర్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-ముత్తారం:



ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామంలో ఈనెల 12న మండల వైద్యాధికారి డాక్టర్ అమ రేందర్‌రావు ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరుగు తుందని, ఈనెల 13 శుక్రవారం రోజున ఆయుష్ శాఖ డాక్టర్ అరుణ ఆధ్వ ర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, అడవీ శ్రీరాంపూర్ మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతుపై దాడి చేసిన ఎరువుల దుకాణం నిర్వహకుడు

నవతెలంగాణ-ముత్తారం:



గాయపడ్డ శ్రీనివాస్

ముత్తారం మండలం శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పరికిపండ్ల విద్యాసాగర్ అనే ఎరువుల దుకాణం నిర్వహకుడు అదే గ్రామానికి చెందిన రైతు నిమ్మతి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డాడు. పంట పొలాలకై రైతు నిమ్మతి శ్రీనివాస్ ఎరువులను ఎరువుల దుకాణం నిర్వహకుడు పరికిపండ్ల విద్యాసాగర్ వద్ద ఉద్దెర తీసుకున్నాడు.అయితే డబ్బులు చెల్లించాలని శ్రీనివాస్‌ను పరికిపండ్ల విద్యా సాగర్ పలుమార్లు కోరగా, డబ్బులు ఇవ్వకుండా దాట వేస్తున్నాడని ఆగ్రహానికి గురైన విద్యా సాగర్ శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు అతన్ని హుటాహుటిన మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దపల్లి



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నూతన అధ్యక్షులుగా నియమితులైన బి. మహేష్ కుమార్ గౌడ్‌ని మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వాటర్స్‌లో పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణారావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య పై ప్రత్యేక శ్రద్ధ
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



ప్రత్యేక అవసరాలు గల పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సంబంధిత అధికారులతో భవిత సెంటర్ల నిర్వహణపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విజయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు భవిత కేంద్రాలకు వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండల కేంద్రంలోని ఐఈఆర్‌పిలను మండలాల వారీగా సమీక్షించి వారి కేంద్రం పరిధిలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు బోధనా పరికరాలు లేక బోధన కుంటు పడుతుందని గమనించిన కలెక్టర్ తన సొంత నిధుల నుంచి జిల్లాలోని 3 భవిత సెంటర్ల కు, 14 ఈ.ఆర్‌సిలకు ఒక్కొక్క దానికి 30 వేల రూపాయలు ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేశారు. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలందరికీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టు అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సహిత విద్యా సమన్వయకర్త అజీమ్ దుబీర్, ఏదో డి.శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై దాడి
పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-కోల్‌సిటీ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

క్వింటాలున్నర రేషన్ బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విలేకరి ముసుగులో ఓ వ్యక్తి రేషన్ డీలర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి గోదావరిఖనిలోని విఠల్‌నగర్‌లో చేటుచేసుకుంది. ఈ ఘటనపై గోదావరిఖనిలోని డీలర్లు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడిని నిరసిస్తూ మంగళవారం ఉదయం రామగుండం పరిధిలోని రేషన్ డీలర్లంతా నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనధికారిక విలేకరులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి నేరుగా కలెక్టరేట్ లో ఫిర్యాదు చేసేందుకు జిల్లా కేంద్రం పెద్దపల్లికి డీలర్లంతా తరలివెళ్లారు. బాధితుల వివరాల మేరకు..గోదావరిఖని విఠల్‌నగర్‌లోని రేషన్ దుకాణం నెం.3612030కు చెందిన డీలర్ శివనాత్రి సురేష్ సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో వినియోగదారులకు బియ్యం పంపిణీ చేస్తుండగా కొత్తపల్లి శివచరణ్ అక్కడికి చేరుకొని తాను రిపోర్టర్‌నని బెదిరించి క్వింటాలున్నర బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనికి డీలర్ సురేష్ ఒప్పుకోకపోవడంతో వినియోగదారులంతా చూస్తుండ గానే సురేష్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సురేష్‌కు గాయాలుకాగా వెంటనే గోదావరిఖనిలోని కొంతమంది డీలర్లతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక వీర వనిత చాకలి ఐలమ్మ

అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్



పెద్దపల్లిలో...

నవతెలంగాణ-పెద్దపల్లి
తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రత్యేకగా వీరవనిత చాకలి ఐలమ్మ నిలుస్తుందని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచి పోయారని, అటువంటి వీరవనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ కుమార్, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మంథనిలో...

నవతెలంగాణ-మంథని
రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచన మేరకు స్థానిక క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ-సురేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్,ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధ్వర్యంలో
తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, స్వరాష్ట్ర సాధన స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంథని రజక సంఘం నాయకులు మంగళవారం వేరువేరుగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రజక సంఘం నేతలు సైతం ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేర్వేరుగా జరిగిన ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, పట్టణాధ్యక్షులు బత్తుల సత్యనారాయణ, కౌన్సిలర్ కాయితి సమ్మయ్య,నాయకులు వేముల లక్ష్మయ్య, మంథని లక్ష్మణ్,గొబ్బూరి వంశీ, పాల్గొన్నారు.



గోదావరిఖనిలో...

నవతెలంగాణ-గోదావరిఖని:
ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా రజక సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్ ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు హాజరై చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆత్మగౌరవానికి ప్రతీక, తెగింపుకు నిలువెత్తు నిదర్శనం, రజాకారులను, విసునూరు దొరలను ఎదిరించి కొట్లాడి వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు కార్పొరేటర్ బొంతల రాజేష్, 44వ డివిజన్ కార్పొరేటర్ ముస్తఫా, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దీటి బాలరాజు, పూసల లింగమూర్తి, గూడేపు రామచందర్ తదితరులున్నారు.

మంత్రి పొన్నంపై విమర్శలు సరికాదు


మాట్లాడుతున్న అంజన్‌కుమార్

నవతెలంగాణ-భగత్‌నగర్

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు సరికాదని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. మంగళశారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంజన కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మేయర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో పుట్టి, పెరిగి, పార్లమెంట్ సభ్యుడిగా ఈ నగరానికి ఎంతో సేవ చేశారని చెప్పారు. మాతా శిశు ఆసుపత్రి, రీజినల్ పాస్‌పోర్ట్ కేంద్రం, తిరుపతి రైలు సర్వీసు, ఎఫ్ఎం రేడియో స్టేషన్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. రాష్ట్ర మంత్రి అంటే ఏమిటో తెలియని మేయర్‌కు కనీస అవగాహన లేదని విమర్శించారు. సమావేశంలో కార్పొరేటర్ సిహెచ్ బుచ్చిరెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, గంట శ్రీనివాస్ ,మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-కరీంనగర్


సన్మానిస్తున్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు గ్రహీత సోషియాలజీ డిపార్ట్మెంట్ హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతికి శాతవాహన యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జఫర్ జారీ మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న పద్మావతికి అవార్డు రావడం శాతవాహన యూని వర్సిటీకి గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు, వివిధ డిపార్ట్మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో వెలిచాల పూజలు

నవతెలంగాణ-భగత్‌నగర్



కరీంనగర్ పట్టణంలోని పలు వినాయక మండపాలను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్ల మెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తీగలగుట్టపల్లి, సరస్వతి నగర్, విద్యారణ్యపురి రోడ్ నెంబర్ వన్, శాస్త్రి రోడ్డు, ప్రకాశం గంజ్ టవర్ సర్కిల్, బోయవాడ, భగత్ నగర్ సర్కిల్, కిసాన్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. మండపాల నిర్వాహకులు నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

కరీంనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్


సమావేశంలో మాట్లాడుతున్న చల్లహరిశంకర్

నవతెలంగాణ - కరీంనగర్

బీఆర్ఎస్ బెట్ డేటెడ్ పార్టీ అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో నుంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్, 60లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ అన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 39 సీట్లు సాధించిందని, బీజేపీ ఎన్ని సీట్లు గెలిచిందో గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ అంటేనే ఇటు కాంగ్రెస్‌కు, అటు బిజెపికి వణుకు పుడుతోందన్నారు. బిజెపిలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉండి తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో తెలుపాలని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్, బిజెపి నాయకులను గ్రామాల్లోకి రావద్దంటూ నో ఎంట్రీ బోర్డులు పెట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కాంగ్రెస్ పాలకులు మైండ్ గేమ్‌తో 9 నెలల విలువైన కాలాన్ని వృధా చేశారరన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్, నగర మైనార్టీ ప్రధాన కార్యదర్శి వాజిద్, బీఆర్ఎస్ నగర యూత్ ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయి కృష్ణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రామడుగు ఎస్ఐకి గౌడ సంఘం సన్మానం


బదిలీపై వెళ్లిన గురుకుల ఉపాధ్యాయురాలు సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ - రామడుగు

రామడుగు నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వి.శేఖర్‌ను మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఎస్ఐని మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గోనెపల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడు అనుపురం రాజయ్య, మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్, గౌడ సంఘం డైరెక్టర్లు పూరెల్ల తిరుపతి, పూరెల్ల శ్రీకాంత్, సభ్యులు పంజాల శ్రీనివాస్, అనుపురం తిరుపతి, గోనేపెల్లి లచ్చయ్య, అనుపురం రాయమల్లు, అనుపురం రాజేశం, అనుపురం శంకర్, పూరెల్ల తిరుపతి, అనుపురం పరశురాం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ - చొప్పదండి

పట్టణంలోని సాంఘిక సంక్షేమ, బాలికల గురుకుల కళాశాలలోని ఉపాధ్యాయ సిబ్బంది బదిలీపై వెళ్లగా ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్, గురుకుల సిబ్బంది పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి, వైస్ ప్రిన్సిపల్ పద్మజ అలివేలు దీప్తి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సం భోజి శేఖర్, ప్రధాన కార్యదర్శి కొత్తూరి సుధాకర్, కోశాధికారి లంక అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు విజయ గురుకుల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

చొప్పదండి సీఐ ఆర్ ప్రకాష్ గౌడ్



నవతెలంగాణ - చొప్పదండి

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, నిర్వహించుకోవాలని చొప్పదండి సీఐ ఆర్ ప్రకాష్ గౌడ్ సూచించారు. చొప్పదండి పట్టణంలోని పోలీస్ స్టేషన్లో, మంగళవారం గణేష్ మండప నిర్వాహకులకు ఉత్సవాలను, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని చొప్పదండి సీఐ ఆర్ ప్రకాష్ గౌడ్, ఎస్సై జి అనూష ఆధ్వర్యంలో, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గణేష్ మండపానికి దగ్గరలో, విద్యుత్ సరఫరా వైర్లు ఉంటాయని, వర్షం పడుతున్నప్పుడు ఇనుప పైపులు మండపానికి ఉంటే, కరెంట్ షాక్ కొడుతుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు, నిర్వహించుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను ఊరేగింపుగా, తీసుకు వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్లు, తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కాల్వలు, చెరువుల వద్ద నిమజ్జనం చేసేటప్పుడు, తగు జాగ్రత్తలను పాటిస్తూ ప్రమాదాలు, జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు

జిల్లా మత్స్య కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, శేఖర్

నవతెలంగాణ - చొప్పదండి


సన్మానిస్తున్న మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా చొప్పదండి మండల కేంద్రానికి చెందిన పిట్టల వెంకటేష్, నూనె శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మత్స్య కారులు, మత్స్య కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్లో జరిగిన జిల్లా జనరల్ బాడీ ఎలక్షన్‌లో ఎన్నికై నట్టుగా తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు, మత్స్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పిట్టల వెంకటేష్, నూనె శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి ముదిరాజ్ సంఘం మత్స్యకారులు, తమ చెరువులు, కుంటలు కబ్జాలకు గురవుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన హైడ్రాను, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేసేలా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణను కోరారు. ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేష్, శేఖర్‌లు మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘాన్ని మరింత బలోపేతం చేసి, మత్స్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, తమ నియామకానికి సహకరించిన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణకు, జిల్లాలోని మత్స్యకారులు, కార్మికులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిట్టల సంపత్, ఘన వేణి లచ్చయ్య, తామర మల్లేశం, నరసయ్య, బీనవేని మల్లేశం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిధులు తేనప్పుడు.. సమీక్షలు ఎందుకు?

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా కరీంనగర్‌కు కేటాయించిన నిధులు శూన్యం
- కరీంనగర్ అభివృద్ధికి 100 కోట్లు మంజూరు చేసి... సీఎం అస్యూరెన్స్ నిధులు విడుదల చేయండి
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మేయర్ యాదగిరి సునీల్‌రావు మండిపాటు

నవతెలంగాణ - కరీంనగర్


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

నిధులు తీసుకురానప్పుడు సమీక్షలు ఎందుకని రావణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ మేయర్ సునీల్ రావ్ మండిపడ్డారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పరిపాలనలో కరీంనగర్ నగరపాలక సంస్థలో జరిగిన అభివృద్ధి... ఇప్పుడు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్ మంత్రినా.. సిద్దిపేట మంత్రినా స్పష్టం చేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు గడుస్తున్నా.. నగరపాలక సంస్థకు ఒక్క రూపాయి అయినా నిధులు మంజూరు చేశారా చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పేది కరీంనగర్ పేరు.... చేసేది మాత్రం శూన్యం అని మండి పడ్డారు. 3 నెలల క్రితం పాలకవర్గానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారని, సమీక్షా సమావేశం తర్వాత నగరపాలక సంస్థకు ఏదైనా ప్రయోజనం కలిగిందా... అని ప్రశ్నించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ అభివృద్ధికి నిధులు తేవడం మీకు చేత కాకపోతే... సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడం మానుకోవాలని మండి పడ్డారు. సీఎం అస్యూరెన్స్ నిధులు విడుదల చేయక... కాంట్రాక్టర్లు పని చేయడం మానేశారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థలో జరిగిన అభివృద్ధి ఇప్పుడు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. నగరపాలక సంస్థకు రూ.100కోట్ల నిధులు మంజూరు చేసి.. సీఎం అస్యూరెన్స్ నిధుల బిల్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాటి మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ సహకారంతో నగరానికి స్మార్ట్ సిటీ హోదా వచ్చిందన్నారు. వెయ్యి కోట్ల నిధులు మంజూరైనా ఇప్పటి వరకు దాదాపు రూ.800కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. అంతే కాకుండా గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేకంగా సీఎం అస్యూరెన్స్ కింద రూ.347కోట్లు, అమృత్ పథకం కింద రూ.132కోట్లు, నగర అభివృద్ధి కోసం మరో రూ.147కోట్లు ఇలా దాదాపు రూ.600కోట్లకు పైగా నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరిగాయి. నగరపాలక సంస్థలో జరిగిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తున్నాయన్నారు. నాడు ప్రత్యేక నిధులు తెచ్చి నగరపాలక సంస్థను అభివృద్ధి చేసిన ఘనత గంగుల కమలాకర్, వినోద్ కుమార్‌లదే అన్నారు.

ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ పకడ్బందీగా అమలు చేయాలి

ఎంపీడీవో జనార్దన్ రెడ్డి పిలుపు

నవతెలంగాణ - గంగాధర :


సమావేశానికి హాజరైన గ్రామ కార్యదర్శులు

మండలంలో ఈ నెల 13వ తేదీన విడుదల చేసే ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను గ్రామ కార్యదర్శులు పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గంగాధర మండల పరిషత్ సమావేశ భవనంలో జీపీ ఓటర్ల జాబితా డ్రాప్ పబ్లికేషన్‌పై నిర్వహించిన గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఓటర్ల జాబితాను అనుసరించి గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాలు తయారు చేశామన్నారు. మండలంలోని 296పోలీంగ్ స్టేషన్లు, వార్డులు ఉన్నాయని, వీటి పరిధిలో డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాలని సూచించారు. గ్రామ గ్రామాన వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను పబ్లికేషన్ చేయాలని తద్వారా ఓటర్లు జాబితాలను చూసుకొని అభ్యంత రాలు వ్యక్తం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో 33 గ్రామాల్లోని గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రహదారిపై చెట్ల తొలగింపు

పోతిరెడ్డిపల్లి గ్రామవాసి ఉడుత కుమార్‌కు అభినందనల వెల్లువ

నవతెలంగాణ - వీణవంక :



మండలంలోని పోతిరెడ్డిపల్లి, జమ్మికుంట ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలతో చెట్లు రోడ్డుపైకి రాగా, అదే గ్రామానికి చెందిన ఉడుత కుమార్ తన సొంత ఖర్చులతో కూలీలను పెట్టి చెట్లను తొలగించి, శుభ్రం చేశాడు. రోడ్లపైన పలు చెట్లు విరిగిపోయి ప్రధాన రహదారిపైనే పడిపోవడంతో వాటిని తీసేవారు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గ్రామంలో పరిపాలన కొనసాగిస్తున్న సరైన దృష్టి సారించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే మాదిరిగా ఈదురు గాలులకు విరిగిన చెట్లు ఎక్కడపడితే అక్కడే ఉండిపోయాయి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని పని చేయవలసిన నాయకులు పట్టించుకోవడం లేదు. ఉడుత కుమార్ ముందుకు వచ్చి తన సొంత ఖర్చుతో శుభ్రం చేయించాడు. ఈ కార్యక్రమంలో రాపర్తి నాగర్జున, రాపర్తి అనిల్, తాళ్లపల్లి రాకేష్, నాగపురి అరవింద్, మునిగల రాజు, రామంచ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉటూరు సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం

నవతెలంగాణ - మానకొండూర్

మండలంలోని ఉటూరు సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన్ గోదాంతోపాటు పెట్రోల్ బంక్‌ను కరీంనగర్ కేడీసీసీ అధ్యక్షులు కొండూరు రవీందర్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్ లో 24 గంటల సేవలు అందుబా టులో ఉంటాయని తెలిపారు. రైతులు అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు సొసైటీ అధ్యక్షులు ముద్దసాని ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు సతీష్, సీఈ ఓ స్వామి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - మానకొండూర్

ముఖ్యమంత్రి సహాయ నిది పథకం కింద మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైనచెక్కులను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మత్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ గౌడ్, దూలం దేవేంద్ర, వీరస్వామి గౌడ్, అంజిత్ రావ్, రెమిడి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, కుమార్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలతో గేదె మృత్యువాత

నవతెలంగాణ- వీణవంక:

మండలంలోని బేతిగల్ గ్రామంలో మడ్డి ప్రవీణ్ అనే రైతుకు చెందిన పాడి గేదె వర్షాలకు సోమవారం రాత్రి మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం ఇటీవల ఏకదాటిగా కురిసిన వర్షాలకు గేదె ఒక్కసారిగా కుప్పకూలిందని, వెంటనే వెళ్లి చూసే సరికి మృత్యువాత పడిందని బాధితుడు వాపోయాడు. రెండు రోజుల్లో గేదె ఈనేదని రూ.50వేల నష్టం వాటిల్లిందని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి,వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ - గంగాధర :

గంగాధర మండలం పత్తికుంటపల్లి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడీఏ ప్రియదర్శిని, ఏవో శ్రీనివాస్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామంలో ఏ మేరకు ఎన్ని ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయనే విషయం తెలుసుకోవడానికి వీలుగా పంట పొలాలను తిరిగి పరిశీలించారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు సేకరించారు. అనంతరం రుణమాఫీలో భాగంగా జరుగుతున్న ఫ్యామిలీ గ్రూపింగ్ కార్యక్రమంలో పాల్గొని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-మల్యాల


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్యాల మండలంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జగిత్యాల ఆర్డీఓతో కలిసి జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులతో పాటు క్లాస్ రూమ్‌లో కూర్చుని టీచర్ బోధనను విద్యార్థులు మన్నన చేసుకునే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిం చాలన్నారు. అనంతరం రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పాఠశాల ఆవరణ, చుట్టూ పరిసరాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పోలింగ్ సెంటర్‌గా ఏర్పాటు చేయుటకు తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట ఆర్డీఓ మధు సుధన్, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాధికారులు పాల్గొన్నారు.

పిరాయింపుపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్‌కు లేదు

నవతెలంగాణ- భగత్‌నగర్

పార్టీ పిరాయింపులపై మాట్లాడే నైతికత బీఆర్ఎస్‌కు లేదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొరివి వేణుగోపాల్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ తెలంగాణలో రాజకీయాలను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కోర్టు తీర్పును అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. గతంలో కాంగ్రెస్, సీపీఐ, వైసీపీ, టీడీపీ నాయకులను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుందని అవన్నీ దాచిపెట్టి ఇప్పుడు పిరాయింపులపై మాట్లాడడం సరికాదని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులపై హై కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, రాజకీయ పార్టీలకు అతీతంగా, రాజ్యాంగ బద్ధంగా స్పీకర్ వ్యవహరించవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోయినపల్లి చంద్రయ్య, బాపూరెడ్డి, నల్లాల శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

డెయిరీ కాలుష్యాన్ని నియంత్రించాలి

16వ డివిజన్ ప్రజల వినతి

నవతెలంగాణ-కరీంనగర్



కరీంనగర్ డెయిరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు దాని పరిసర ప్రాంతాల్లోని భూమిలో కలువడం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని 16వ డివిజన్ వాసులు నగర పాలక సంస్థ అధికారులకు మంగళ వారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డెయిరీ నుంచి వెలువడే కాలుష్యం వలన ఆరోగ్య సమస్యలు, చర్మ వ్యాధులు వస్తున్నాయని పేర్కొన్నారు. కాలుష్యం కారణంగా ఆ ప్రాంతంలోని బోరు నీళ్ల టి.డి.ఎస్ 2000గా (ప్రమాద స్థాయిలో) మారిందని వాపోయారు. బోరు నీళ్ల తాగునీటి అవసరానికి వాడుకోవడానికి ఏమాత్రం అనువుగా లేవని, డైరీ నుంచి వెలువడే వ్యర్థాల నుంచి విపరీతమైన దుర్వాసన వెలువడు తుందని తెలిపారు. ఆ దుర్వాసన పద్మానగర్ మొదలుకొని దాదాపు రెండవ టౌన్ పోలీసు స్టేషన్ వరకు వ్యాపించి, జనాలకు శ్వాస తీసుకోవడం కూడా కష్ట మౌతోందని వాపోయారు. దీంతో పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అంతే కాకుండా డైయిరీ చిమ్నీ నుంచి దట్టమైన పొగలు వస్తున్నాయని, ఆ పొగ వెలువడిన బూడిద గాలిలో కలిసి అన్ని దిశల్లో ప్రయాణించి ఇళ్ళ స్లాబుల పైన పేరుకుపోతోందని వివరించారు. దీంతో శ్వాసకోశ ఆరోగ్య సమస్యలు అస్తమా ఊపిరితిత్తుల సమస్యలు చిన్నపిల్లలలో అధికంగా వస్తున్నాయని వాపోయారు. మా సమస్యలపై తక్షణం స్పందించి డైయిరీ నుంచి వెలువడే వ్యర్థాలు భూమిలో, నీటిలో, గాలిలో కలవకుండా, అలాగే డైయిరీ నుంచి వస్తున్న దుర్వాసనను సైతం నియంత్రించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని తద్వారా, మా ఆరోగ్యాలు కాపాడాలని కోరారు.

అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మల్యాల

అక్రమ కట్టడాలపై చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా మత్స్యకార సమాఖ్య సంఘాల చైర్మెన్ పల్లికొండ ప్రవీణ్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లాలో చెరువులను, కుంటలను కాపాడాలని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మల్యాల మండలం చెరువులో అక్రమ కట్టడాలు చేస్తూ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా కడుతున్న వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. జగిత్యాల జిల్లాలో చాలా చెరువులు కుంటలు కనుమరుగైనవని, వాటిపై ఇరిగేషన్ డిపార్మెంట్, ఎంఆర్వో డిపార్మెంట్ కలిసి ప్రతి మండలానికి నలుగురు చొప్పున సర్వేయర్లు పెడుతూ చెరువులు, కుంటలను ఎఫ్టిఎల్‌ను బౌండరీ ఏర్పాటు చేస్తూ చెరువు పరిరక్షణకు అధికారులు తమ వంతుగా తోడ్పడాలని అన్నారు. అలాగే అక్రమ కట్టడాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్యాల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పోస్టల్ ఎస్పీ శివాజీ

నవతెలంగాణ-కరీంనగర్

ప్రభుత్వ గుర్తింపు పొందిన హై స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు పోస్టల్‌శాఖ స్కాలర్‌షిప్స్ అందిస్తుందని, ఇందుకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శివాజీ తెలిపారు. దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన పథకం కింద ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ.6000 చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేస్తారని తెలిపారు. ప్రతి మూడు నెలలకొక మారు రూ.1,500ల చొప్పున అర్హులైన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందుతుందని వివరించారు. ప్రతి తరగతిలో ఉత్తమ అకడెమిక్ రికార్డు ఉన్న పది మంది విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆయా హై స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీలోగా సమీప పోస్టాఫీసు లేదా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

12 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్స్ స్వాధీనం

నవతెలంగాణ- జగిత్యాలటౌన్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

అక్రమంగా గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. పూడూరు గ్రామానికి చెందిన ఎడమలపల్లి సాయికుమార్, తుడుం సాయి తేజ, కందుల అరుణ్, గౌరాపూర్‌కు చెందిన ఎడపల్లి సాకేత్‌తో పాటు ధరూర్‌కు చెందిన పాల రాజ్ కుమార్ నిందితులు ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు నుంచి 16 కేజీల గంజాయి రూ. 43 వేలకు తీసుకువచ్చి అధిక రేట్లకు జగిత్యాల జిల్లాలో అమ్ముతున్నారు. వారిని కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామం శివారులో జాతీయ రహదారి పక్కన ఐదుగురిని పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి 12 కేజీల గంజాయితో పాటు 5 సెల్ ఫోన్లు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన జగిత్యాల డీఎస్పీ రఘు చందర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ ఎస్పీ అభినందించారు.

సంఘ అభివృద్ధికి రైతులందరూ కృషి చేయాలి

నవతెలంగాణ - తిమ్మాపూర్

సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంకును రైతులందరూ సద్వినియోగం చేసుకొని సంఘ అభివృద్ధికి కృషి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పోరండ్ల గ్రామంలోనీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావుతో కలిసి ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ పునః ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి స్వామి రెడ్డి, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో మహిళా పోరాటాలు

- ఐద్వా ఉపాధ్యక్షులు కేఎన్ ఆశాలత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీరనారి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో మహిళా పోరాటాలు ఉధృతంగా నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఎన్ ఆశాలత తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐలమ్మ స్మారక భవనం(ఐద్వా రాష్ట్ర కార్యాలయం)లో ఐలమ్మ 39వ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని గుర్తు చేశారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, రజాకార్లను గడగడ లాడించిన ఆ పోరాటంలో ఐలమ్మ పాత్ర చరిత్ర పుటల్లో చెరిగిపోని ముద్ర వేసిందని తెలిపారు. ఆమె పోరాట స్ఫూర్తితో మహిళా పోరాటాలు నిర్వహించాలన్నారు. కుల, మతాలకతీతంగా ప్రజలు సాగించిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి హిందూ, ముస్లిం ఐక్యతను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలను, దౌర్జన్యాలను ఎదురించిన వీరనారి ఐలమ్మ తెగువ మరవలేనిదని తెలిపారు. ఐలమ్మ త్యాగాలు, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరాలకు తెలియజేయడానికి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవిత, అంజయ్య, కరాటే మాస్టర్ సుబ్రమణ్యం, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యేలు

- సభ్యత్వ నమోదుకు కిషన్‌రెడ్డి నుంచి అందని ఆహ్వానం
- ఆర్థిక సంఘానికి రికమండేషన్స్ అందజేతలో కనిపించని ఎమ్మెల్యేలు
- బీజేపీ ఆఫీసులో ఎల్పీనేతకు గది కేటాయించని వైనం
- పాత నేతలకే అధిక ప్రాధాన్యం.. కొత్తోళ్లకు దూరం దూరం
- కిషన్‌రెడ్డి వ్యవహార శైలిపై పార్టీ శ్రేణుల గుర్రు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవానికి బీజేపీ ఎమ్మెల్యేలకు ఆహ్వానం ఎందుకు అందలేదు? 16వ ఆర్థిక సంఘానికి రికమండేషన్స్ లెటర్ సమర్పించేందుకు ఒక్క ఎమ్మెల్యే కూడా ఎందుకెళ్లలేదు? ఎమ్మెల్యేగా గెలిచి పది నెలలు కావొస్తున్నా పార్టీలో వారికి ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు? బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి గదినెందుకు కేటాయించలేదు? ఎమ్మెల్యేలు ప్రెస్‌మీట్లు పెట్టడానికి కూడా సవాలక్ష ఆంక్షలెందుకు? ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న నేతలకు ప్రాధాన్యం ఎందుకు ఇవ్వడం లేదు? వారు రాజకీయంగా మీడియాలో ఫోకస్ అవుతే తమ మనుగడ సాగదనే ఆలోచనలో పాత కాపులు పడ్డారా? అందుకనే ఎమ్మెల్యేలను దూరం దూరం పెడుతున్నారా? ఈ ప్రశ్నలన్నింటి లోతుల్లోకెళ్లి పరిశీలిస్తే ఎమ్మెల్యేలకు, బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి చాలా గ్యాప్ ఏర్పడిందనీ, ఆధిపత్యపోరు నడుస్తున్నదని స్పష్టంగా అర్థమవుతున్నది. జాతీయ నాయకత్వాన్ని ప్రభావితం చేసేస్థాయిలో ఉన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఒకరిద్దరు కీలకనేతలు పాతనేతలకు అధికప్రాధాన్యం ఇస్తూ కొత్తవారిని కావాలనే దూరం పెడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

వరుసగా వారం రోజులుగా బీజేపీలో జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీలోని అంతర్గత విభేదాలను ఎత్తిచూపుతున్నాయి. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవానికి కిషన్‌రెడ్డి ఆహ్వానం పంపలేదనే విమర్శ ఆ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తున్నది. వరద ప్రాంతాల్లో పర్యటించే బృందాల్లో కూడా తమకు సరైన ప్రాధాన్యత కల్పించలేదనీ, ఒక్క బృందానికి కూడా నాయకత్వం వహించే అవకాశం కల్పించలేదు. బీజేపీ ఎమ్మెల్యేలమంతా బృందంగా కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పర్యటిస్తామన్న ప్రతిపాదననూ రాష్ట్ర నాయకత్వం తిరస్కరించినట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలో 16 ఆర్థిక సంఘం పర్యటనలో అన్ని పార్టీలూ తమ అభిప్రాయాలను, రికమండేషన్స్‌ను ఎమ్మెల్యేల ద్వారా కమిటీ ముందుపెట్టాయి. బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందాన్ని పంపింది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం దానికి భిన్నంగా ఈటల రాజేందర్‌తో పాటు ప్రకాశ్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లును పంపింది. అందులో బీజేపీ ఎల్పీనేతగానీ, ఒక్క ఎమ్మెల్యేగానీ లేకపోవడం గమనార్హం. దీన్ని ఎమ్మెల్యేలు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ నుంచి అసెంబ్లీలో పార్టీలైన్, ప్రజాసమస్యలను ప్రస్తావించే తమకు ఒక కమిటీకి రికమండేషన్స్ ఇచ్చే స్థాయి లేదా? అని ఆ పార్టీ ఎమ్మెల్యేలు లోలోన కుములిపోతున్నారు. వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో కిషన్‌రెడ్డి తీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. తాము మీడియా ముందు ఫోకస్ అయితే తమకు పార్టీలో ఎక్కడ ప్రాధాన్యం తగ్గుతుందో అన్న భయం సీనియర్ నేతల్లో ఉందనే విమర్శ ఆ పార్టీ శ్రేణుల్లోనే ఉంది. సోషల్‌మీడియా వేదికగా రాష్ట్ర నాయకత్వం తీరుపై ఆ పార్టీ శ్రేణులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్పీ నేతకు రూమేది?

బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు గెలిచారు. ఎల్పీ నేత ఎంపిక విషయంలో రాష్ట్ర నేతల ఆటంకాలు, కొర్రీల నేపథ్యంలో జాతీయ నాయకత్వం సాగదీసి..సాగదీసి.. ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి చివరకు అప్పగించింది. ఏ పార్టీ ఆఫీసులోనైనా ఎల్పీనేతగా ఉండే వారికి కనీసం ఒక గదిని కేటాయించడం ఆనవాయితీ. ఈ విషయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం కనీస మర్యాద పాటించలేదు. దీనిని బట్టే కిషన్‌రెడ్డికి, ఎమ్మెల్యేల మధ్య వైర్యం తీవ్ర స్థాయికి చేరిందని అర్థమవుతున్నది. అందులో భాగంగానే బీజేపీలోని పాతకాపులకు ఆయన అధిక ప్రాధాన్యం ఇస్తూ పోతున్నారనీ, ఎమ్మెల్యేలు ఎక్కడ కూడా ఫోకస్ కాకుండా జాగ్రత్త పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

మరోవైపు ఎమ్మెల్యేలు ప్రెస్‌మీట్ పెట్టాలన్నా రాష్ట్ర నాయకత్వం ఆంక్షలు పెడుతున్నట్టు తెలిసింది. ప్రజాక్షేత్రంలో గెలిచి వచ్చిన తమకు రాష్ట్రకార్యాలయంలో పాతుకుపోయిన వారు అడుగడుగునా అడ్డుపడుతుండటాన్ని ఎమ్మెల్యేలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యేలు మొక్కుబడిగా వచ్చివెళ్తూ తమ పనితాము చేసుకుంటున్నారనే చర్చ నడుస్తున్నది. ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకత్వం మధ్య ఈ కలహాల కాపురం ఎంత కాలం నడుస్తుంది? ఎటు వైపు దారితీస్తుంది? చివరకు ఆ పార్టీలోనే ఎమ్మెల్యేలు ఉంటారా? లేదా? అనేది ముందుముందు చూడాల్సిందే.

వడ్డీరేట్లు తగ్గించుకోండి



- ఆర్టీసీ అప్పులు రూ.6,322 కోట్లు
- మహాలక్ష్మితో పెరిగిన ఓఆర్
- సర్కారు రీయింబర్స్‌మెంట్‌తో ఆర్థిక పరిపుష్టి
- కొత్త బస్సుల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ : టీజీఎస్ఆర్టీసీపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"అవసరాల కోసం ఆర్టీసీ చేసిన అప్పులపై వడ్డీరేట్లు అధికంగా ఉన్నాయి. తక్షణం వాటిని తగ్గించుకొనే ప్రయత్నం జరగాలి. బ్యాంకర్లతో మాట్లాడండి. రుణాలను రీ షెడ్యూల్ చేయమని కోరండి. కుదరకుంటే ఎవరు తక్కువ రేటుకు రుణాలు ఇస్తే, వారికి అప్పుల్ని బదిలీ చేసి, సంస్థపై ఆర్థికభారం తగ్గించండి" అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆర్టీసీ అధికారుల్ని ఆదేశించారు. మంగళవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సంస్థ ఆర్థిక స్థితిగతులు, అవసరాలు, అప్పులు, మహాలక్ష్మి స్కీం అమలు, కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు వంటి పలు అంశాలను వివరించారు. వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా (పీఎఫ్) నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలతో సహా మొత్తం రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్టు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మహాలక్ష్మి పథకం అమలవుతున్న తీరుపై వివరాలు అడిగారు. ఇప్పటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారనీ, దీనివల్ల వారికి రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయనీ, 7,292 బస్సుల్లో మహాలక్ష్మి స్కీం అమలవుతున్నదని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తర్వాత వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు వస్తున్న మహిళల సంఖ్య పెరుగుతున్నదని అధికారులు పలు ఉదాహరణలతో వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సంస్థపై రుణభారం తగ్గించేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేటుకు అనుగుణంగా ప్రభుత్వం చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ కమిటీలు పునరుద్ధరించండి
రవాణామంత్రి ఆదేశం-ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

ఆర్టీసీలో చట్టబద్ధంగా ఏర్పాటైన కార్మిక సంఘాల కార్యకలాపాలను పునరుద్ధరించాలని కోరుతున్న విషయం తెలిసిందే. కానీ దానికి భిన్నంగా వెల్ఫేర్ కమిటీలను పునరుద్ధరించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేషీ నుంచి జులై 9వ తేదీ ఆర్టీసీ యాజమాన్యానికి లేఖ రాసారు. ఆర్టీసీలోని అన్ని యూనిట్లలో కొత్త ఎంప్లాయీ వెల్ఫేర్ బోర్డుల్ని కొత్త సభ్యులతో నామినేట్ చేయాలని కోరుతూ మంత్రి ఓఎస్డీ డీ వేణు ఆ లేఖను ఆర్టీసీ యాజమాన్యానికి రాసారు. దీని ఆధారంగా ఆర్టీసీ యాజమాన్యం ఈనెల 5వ తేదీన వెల్ఫేర్ బోర్డుల నాలుగేండ్ల కాలపరిమితి ముగిసినందున, వాటి స్థానంలో కొత్తవారిని నియమించి, ఆ వివరాలను ఈనెల 10వ తేదీలోపు పంపాలని సర్క్యులర్ (01/EWB/863(1)2024-HR) జారీ చేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సర్క్యులర్ ప్రకారం ఆయా డిపో మేనేజర్లు కొత్త వెల్ఫేర్ కమిటీల్లోని సభ్యుల వివరాలను ప్రధాన కార్యాలయానికి పంపినట్టు సమాచారం. ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డుల పునరుద్ధరణకు అనుకూలంగా ఉండటంతో సీఎం సమీక్షా సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగలేదని తెలిసింది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆర్టీసీలో కార్మిక సంఘాలను రద్దు చేసి, వెల్ఫేర్ కమిటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీన్ని అప్పట్లో కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకి వస్తే, వెల్ఫేర్ కమిటీలు రద్దు చేసి, కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పేర్కొంది. కానీ సీఎం సమీక్షలో దాని ఊసే లేకపోవడం, వెల్ఫేర్ బోర్డుల్ని పునరుద్ధరించాలని స్వయంగా రవాణామంత్రి యాజమాన్యానికి లేఖ రాయడం, ఆ మేరకు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిర్ణయాన్ని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు, టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు పీ కమాల్‌రెడ్డి, మర్రి నరేందర్ తదితరులు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేసి, సంస్థలో కార్మిక సంఘాల కార్యకలాపాలను అనుమతించాలని కోరారు.

గణేష్ విగ్రహాల నిమజ్జనంపై ధిక్కార పిటిషన్ కొట్టివేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహాల నిమజ్జనం విషయంలో 2021లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలు కావడం లేదంటూ దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌ను ప్రత్యేక డివిజన్ బెంచ్ కొట్టివేసింది. నిమజ్జనం 2022, 2023 సంవత్సరాల్లో కూడా జరిగిందనీ, మూడో ఏడాది వచ్చి ధిక్కారణ పిటిషన్ వేయడమేంటని పిటిషనర్‌ను ప్రశ్నించింది. మూడేండ్లుగా ఆలస్యంగా కోర్టు ధిక్కార పిటిషన్ వేస్తే విచారణ చేపట్టి అనుమతించి ఉత్తర్వులు ఇవ్వబోమని స్పష్టం చేసింది.

పిటిషనర్ కావాలంటే వేరుగా మరో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని హితవు చెప్పింది. కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలుకు ముందు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిజమజ్జనం చేస్తున్న ఫొటోలు, వీడియోలు తీసి సంబంధిత అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని అడిగింది. అధికారులకు ఫిర్యాదుల తర్వాత కూడా చర్యలు లేకపోతే కోర్టులో ధిక్కార పిటిషన్ వేయాలనే విషయం ఒక లాయర్‌గా మీకు తెలియదా? వ్యక్తిగత హోదాలో పిటిషన్ వేసిన న్యాయవాది మామిడి వేణుగోపాల్‌ను ప్రశ్నించింది. అన్ని కారణాలను లోతుగా పరిశీలించాకే పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ టి. వినోద్‌కుమార్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పు చెప్పింది. 2021 సెప్టెంబర్ 9న ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకే నిమజ్జనం జరగాలి. పర్యావరణ హితమైన విగ్రహాలనే హుస్సేన్‌సాగర్‌లో నిజమ్జనం చేయాలి. పీవోపీ విగ్రహాన్ని జీహెచ్ఎంసీ చేసిన చిన్న పాంట్లలో నిమజ్జనం చేయాలి. ప్రత్యేకమైన కృత్రిమ కుంటల్లోనే చేయాలి. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేసిన కేసులో వెలువడిన ఉత్తర్వులను అమలు చేయాలని తీర్పు చెప్పింది.

ఇదే సమయంలో పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం లేదనీ, తయారీదార్లపై చర్యలు తీసుకోరాదని అధికారులను ఆదేశించింది. గతేడాది హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం కోసం 17 క్రేన్లు పెడితే ఇప్పుడు 33 క్రేన్లు పెట్టారు. వీటి వల్ల ట్యాంక్ బండ్‌కు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. పివోపీ విగ్రహాలను నిమజ్జనం చేస్తే పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుంది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదు. కాబట్టి కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలని పిటిషన్ చేసిన వాదనను తోసిపుచ్చింది

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేయండి: హైకోర్టు

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పనపై సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వేషన్ల కల్పన కోసం అధ్యయనం చేయాలని సూచించింది. ఆ తర్వాత అమలుకు తీసుకునే అంశంపై నివేదికను మూడు నెలల్లోగా తమకు ఇవ్వాలని ఆదేశించింది. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 5ను సవాల్ చేస్తూ బీసీ నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, దాసోజు శ్రవణ్ కుమార్, ఎర్రా సత్యనారాయణ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. అధ్యయనం చేసేందుకు మూడు నెలల గడువు కావాలని ప్రభుత్వం చెప్పడంతో అందుకు అనుమతిచ్చింది. విచారణను వాయిదా వేసింది.

కోఠి మహిళావర్సిటీకి ఐలమ్మ పేరు

- శ్వేత ఐలమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తాం.. : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రవీంద్రభారతిలో ఐలమ్మ నృత్యరూపకం ప్రదర్శన



నవతెలంగాణ-కల్చరల్

తెలంగాణ మహిళా స్ఫూర్తి చిట్యాల ఐలమ్మ పేరును కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయానికి పెట్టాలని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు భూమి హక్కు కావాలని నాటి దొరలు, భూస్వాములకు ఎదురు నిలిచి పోరాడిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో తదనంతర కాలంలో ప్రధాని ఇందిర గాంధీ భూ సంస్కరణలు తెచ్చారని చెప్పారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం రాష్ట్ర సంగీత నాటక అకాడమీ, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు అలేఖ్య పుంజాల తన శిష్య బృందంతో చాకలి ఐలమ్మ నృత్య రూపకం ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదలు, బహుజనుల పక్షం నిలబడుతుందని చెప్పారు. దొరల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాల భూములు పేదలకు చెందాలని ఐలమ్మ పోరాటం చేశారని అన్నారు. పేదల భూములను గత ప్రభుత్వం ధరణి పేరిట గుంజుకునే దుర్మార్గపు ఆలోచన చేసిందన్నారు. దాంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఐలమ్మ ముని మనుమరాలు శ్వేత ఐలమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తామని హామీ ఇచ్చారు. శ్వేత ఐలమ్మ మాట్లాడుతూ.. పోరాట యోధురాలు ఐలమ్మను ప్రభుత్వం గుర్తించటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మహిళా ఐలమ్మలా నిర్భయంగా ఉండాలన్నారు. నాట్య గురువు అలేఖ్య మాట్లాడుతూ.. తాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సలహాతో ఐలమ్మ నృత్య రూపకం తీసుకొన్నానని తెలిపారు. రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమం నిర్వహణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, సారయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఐలమ్మ నృత్య రూపకం స్ఫూర్తి వంతం

ప్రముఖ గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించిన చాకలి ఐలమ్మ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అలేఖ్య చాకలి ఐలమ్మగా.. ఆ ఆవేదన, హావభావాలు ప్రతిభావంతంగా ప్రదర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దొరలు, భూస్వాములతో పాటు నైజాం పాలనకు వ్యతిరేకంగా జరగ్గా కమ్యూనిస్టులు ఈ పోరాటంలో ప్రధాన భూమిక పోషించారు. ఎర్ర జెండా లేకుంటే సమగ్రత రాదు. ఏమైనప్పటికీ కొన్ని కథలకు మాత్రమే పరిమితమైన శాస్త్రీయ కూచిపూడి నాట్య ప్రక్రియకు ఆధునికత జోడించి సామాజిక అంశాలతో కాలానుగుణంగా మార్పు చెందడం శుభ పరిణామం. ఇందుకు శాస్త్రీయ నృత్యంలో ప్రతిభావంతురాలైన అలేఖ్య చరిత్ర కథను ఎన్నుకోవడం అభినందనీయం. అయితే, రూప రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ ప్రదర్శన చూడకుండానే మృతిచెందారు.

4 మెడికల్ కాలేజీలకు గ్రీన్ సిగ్నల్

- ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున ప్రవేశాలకు అనుమతి
- కేంద్రానికి, సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు : మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసిన 4 కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఆదేశించింది. ఇదే విషయాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం లేఖ పంపించింది. ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున మొత్తం 200 సీట్లు ఈ కాలేజీల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ములుగు, నర్సంపేట్, గద్వాల, నారాయణపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. మొత్తం 8 కాలేజీల్లో కలిపి 400 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రభుత్వ కాలేజీల్లోని మొత్తం సీట్ల సంఖ్య 4,090కి పెరిగింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సరి చేయడం ద్వారా నాలుగు కాలేజీలకు అనుమతిచ్చినట్టు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి, అనుమతిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భూపాలపల్లికి రైల్ లైన్ క్లియర్ ఎప్పుడో ?

కలగానే రామగుండం-మణుగూరు లైన్
సర్వేలకే పరిమితమైన అధికారులు



నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాకు రైల్ లైన్ క్లియర్ ఎప్పుడో అని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత సంవత్సరం భూపాలపల్లికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. కాజీపేట నుంచి భూపాలపల్లికి ట్రాక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నామని, ఇందుకు నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు రైల్వే లైన్ కోసం సర్వే పనులు ప్రారంభించింది. కానీ ఆచరణలో అమలు కాలేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

వరంగల్ నుంచి భూపాలపల్లికి రావాలంటే సుమారు 70కి.మీ బస్సులో ప్రయాణించాల్సిందే. రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రయాణం నరకయాతనే. రోజూ వందలాది మంది వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు భూపాలపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కాజీపేట నుంచి భూపాలపల్లికి రైల్వే లైన్ లేకపోవటంతో ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాదు.. బొగ్గు సరఫరాకు సైతం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైల్వేశాఖ.. కాజీపేట నుంచి భూపాలపల్లికి కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నట్టు గతేడాది కేంద్రం వెల్లడించింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రూ.1,152 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీని ఆధారంగా కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించనున్నారు. మొగుళ్లపల్లి, చిట్యాల, భూపాలపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఇది ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో భూసేకరణతో పాటు వాగులపై వంతెనలు, స్టేషన్ల నిర్మాణం తదితర వాటితో పాటు ట్రాక్‌కు మట్టి నమూనాలు సేకరించనున్నారు. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే 30 నుంచి 40 నిమిషాల్లో కాజీపేట నుంచి భూపాలపల్లికి చేరుకొనే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. హన్మకొండ, హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే వారికి కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

రామప్ప, మేడారానికి అనుసంధానం

భూపాలపల్లి మీదుగా నిర్మిస్తున్న రైల్వేను పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు అనుసంధానం అవుతున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరుకు వెళ్లే లైన్‌తో రామప్పకు కనెక్టివిటీ కానుంది. ఈ మేరకు రైల్వే శాఖ కూడా ప్రకటించింది. దీని కోసం గతంలోనే వెంకటాపూర్‌లో ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు. అదే విధంగా కాజీపేట-భూపాలపల్లి లైన్‌తో మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరను అనుసంధానం చేస్తున్నట్టు రైల్వేశాఖ అధికారులు ప్రకటించారు. రైలు ఆశలు పట్టా లెక్కుతుండటంతో భవిష్యత్తులో మరిన్ని కొత్త మార్గాలు ఏర్పడి భూపాలపల్లి పారిశ్రామిక అభివృద్ధికి, ములుగు పర్యాటక అభివృద్ధికి అడుగులు పడతాయని పలువురు సంతోషించారు. కానీ పనులు ఆలస్యం కావడంతో నిరాశలో ఉన్నారు.

రామగుండం-మణుగూరు సర్వే

భూపాలపల్లి జిల్లా కేంద్రం మీదుగా తొలుత కోల్‌రైల్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2023-24 బడ్జెట్‌లో ఈ మేరకు నిధులను కేటాయించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి మంథని, భూపాలపల్లి జిల్లా తాటిచర్ల, భూపాలపల్లి మీదుగా వెంకటాపూర్ (రామప్ప), తాడ్వాయి అడవుల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోపాల్‌రావుపేట మీదుగా మణుగూరు వరకు 198 కిలో మీటర్ల రైల్వే ట్రాక్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రైల్వేలైన్ నిర్మాణానికి ఫైనల్ లోకేషన్ సర్వే కోసం ప్రభుత్వం రూ.3,600 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలు సేకరించారు. ట్రాక్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ఉన్న మట్టి తట్టుకోగలదా..? అనే అంశాన్ని పరిశీలించారు. మట్టి నాణ్యతనుబట్టి ట్రాక్ నిర్మాణం చేయనున్నారు. రామగుండం నుంచి మణుగూరు వరకు గుర్తించిన పాయింట్లలో మట్టి నమూనాల సేకరణ చేపట్టారు. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు రవాణా సులభం కానుంది. ప్రస్తుతం భూపాలపల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుంచి రైలు ద్వారా హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దాంతో అధిక వ్యయంతోపాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు. ప్రతిపాదిత రామగుండం-మణుగూర్ లైన్ ఏర్పాటైతే ఎన్నో ఉపయోగాలు జరగనున్నాయి.

రవాణాను మెరుగుపరచాలి



- బందు సాయిలు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

జిల్లా ప్రజల ఆకాంక్షను ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన అవసరం ఉంది. రవాణాను మెరుగుపరచాలి. 2002 నుంచి 2004 వరకు బండారు దత్తాత్రేయ రైల్వే సహాయ మంత్రిగా ఉన్న సమయంలో రామగుండం- మణుగూరు రైల్వేలైన్ సర్వే జరిగింది. కానీ ఇప్పటి వరకు అతీగతీలేదు. ప్రధాని మోడీ సైతం పలుమార్లు హామీలు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఈ అంశాన్ని ప్రతిసారీ నాయకులు లేవనెత్తుతున్నారు తప్పితే పార్లమెంట్‌లో గళం ఎత్తడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి జిల్లాకు రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

బొగ్గు సరఫరాకు ఉపయోగం



- కంపేట రాజయ్య, సింగరేణి బ్రాంచి కార్యదర్శి ,భూపాలపల్లి

భూపాలపల్లికి రైల్వేలైన్ ప్రతిపాదించి ఏండ్లు గడుస్తోంది. కార్యరూపం దాలిస్తే బొగ్గు రవాణాతో పాటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. రామగుండం, భూపాలపల్లి, మణుగూరు రైల్వేలైన్ కోల్‌బెల్ట్ ప్రాంతంలో బొగ్గు రవాణా సులువవుతుంది. కార్మికులకు, ప్రజలకు ప్రయాణపరంగా ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రస్తుతం భూపాలపల్లిలోని కేటీపీపీ విద్యుత్ కేంద్రానికి రామగుండం, భూపాలపల్లితో ఇతర ప్రాంతాలకు ఎక్కువగా బొగ్గు రవాణా సాగుతోంది. రోజుకు వందల లారీల ద్వారా ఇక్కడి నుంచి ఉప్పల్‌కు బొగ్గు రవాణాకు ఇబ్బందవుతుంది. ఉప్పల్ వరకు లారీల ద్వారా రవాణా చేసి అక్కడి నుంచి గూడ్స్ రైల్ ద్వారా పంపిస్తున్నారు. రెండు రైల్వే లైన్లలో ఏ ఒక్కటి నెరవేరినా బొగ్గు రవాణాకు ఇబ్బందులు ఉండవు.

కరీంనగర్ నవతెలంగాణ మానవి 11
www.navatelangana.com
బుధవారం
11 సెప్టెంబరు 2024



శీతల్ దేవి... పరిచయం అవసరం లేని పేరు. తన కుడి కాలుతో విల్లును పైకెత్తి, కుడి భుజం సహకారంతో తీగను వెనక్కి లాగి, దవడ బలాన్ని ఉపయోగించి గురి పెట్టి బాణాన్ని వదులుతుంది. ఇటీవల పారిస్ పారాలింపిక్స్‌లో తన ప్రదర్శనతో కోట్లాది మంది గుండెల్లో చోటు సంపాదించుకుంది. రెండు చేతులు లేకపోయినా ఆత్మవిశ్వాసంతో కాళ్లతో బాణాలు సంధించి విశ్వక్రీడల్లో పతకం సాధించి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

చేతులు లేకున్నా గురి తప్పదు

ఇటీవలె ముగిసిన పారాలింపిక్స్‌కు వెళ్లక ముందు 'స్వర్ణం గెలవాలనే స్ఫూర్తితో ఉన్నా. నేను గెలిచిన పతకాలను చూసినప్పుడల్లా మరిన్ని గెలవాలనే స్ఫూర్తి కలుగుతుంది. నేను గెలవడం ఇప్పుడే మొదలుపెట్టాను' అని ఆమె అన్నారు. 'శీతల్ విలువిద్యను ఎంచుకోలేదు, విలువిద్యే ఆమెను ఎంచుకుంది' అని శీతల్ ఇద్దరు జాతీయ కోచ్‌లలో ఒకరైన అభిలాష చౌదరి చెప్పారు.

చేతులు లేకుండా పుట్టినా...

జమ్ము కాశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లాలో 2007, జనవరి 10న పుట్టింది శీతల్. పుట్టుకతోనే ఫోకోమెలియా అనే అరుదైన రుగ్మతతో పుట్టింది. అంటే రెండు చేతులు లేకుండానే పుట్టింది. ఓ చిన్న గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన శీతల్ 15 ఏండ్లు వచ్చే వరకు విల్లు, బాణం పట్టలేదు. 2019లో కిష్ట్వార్‌లో జరిగిన ఓ యువ కార్యక్రమానికి ఆమె హాజరయ్యింది. అక్కడ భారత సైన్యానికి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్స్‌చే ఆమె గుర్తించబడింది. ఫలితంగా ఆమె విద్యా, వైద్యానికి సైన్యం సహాయం అందించింది.

కాళ్లతోనే బాణం ఎక్కుపెట్టి

తెలిసిన వ్యక్తి సూచన మేరకు 2022లో ఆమె ఇంటికి దాదాపు 200 కి.మీ. దూరంలో ఉన్న కత్రాలోని మాతా వైష్ణోదేవి పుణ్యక్షేత్రం బోర్డ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ చూసేందుకు వెళ్లింది. ఆ తర్వాత శీతల్ జీవితం మారిపోయింది. అక్కడే ఆమె అభిలాష చౌదరి, మరో కోచ్ కుల్దీప్ వెద్వాన్‌లను కలుసుకున్నారు. శీతల్‌కు విలువిద్యను వెద్వాన్ పరిచయం చేశారు. శీతల్ వెంటనే కత్రా నగరంలోని శిక్షణ శిబిరానికి వెళ్లింది. ఆమె సంకల్పానికి కోచ్‌లు ఆశ్చర్యపోయ్యారు. శీతల్ కాళ్లు,శరీరం పైభాగంలోని బలాన్ని ఉపయోగించి బాణం సంధించడంపై కోచ్‌లు దృష్టి పెట్టారు. చివరికి విజయం సాధించారు.



ప్రయాణం ఇలా సాగింది

కోచ్‌లు మొదట ఆమెకు ప్రోస్తెటిక్స్(కృత్రిమ చెయ్యి)తో సహాయం చేయాలనుకున్నారు. అయితే ఆమె విషయంలో ఇది సాధ్యం కాదని వైద్యులు చెప్పారు. శీతల్‌కు తన కాళ్లను ఉపయోగించి చెట్లను ఎక్కడ ఎంతో ఇష్టమని తెలుసుకున్నారు. స్నేహితులతో కలిసి పాదాలతో రాయడం, చెట్లను ఎక్కడం వంటివి సాధన చేయడం వల్ల ఆమె పాదాలు ఎంతో బలంగా తయారయ్యాయి. కోచ్‌లకు ఇంతకు ముందు అవయవాలు లేని వ్యక్తికి విలువిద్యలో శిక్షణ ఇచ్చిన అనుభవం లేదు. అయినప్పటికీ మాట్ స్టట్జ్‌మాన్ గురించి కొంత పరిశోధన చేసి విలువిద్య కోసం కాళ్లను ఉపయోగించడంలో శిక్షణ ఇచ్చారు. అయితే ఆమెకు కొన్ని సందేహాలూ వచ్చాయి. 'ఇది నాకు అసాధ్యం అనుకున్నా. నా కాళ్లలో నొప్పిగా ఉండేది, అయినా ప్రయత్నించాను' అని ఆమె పంచుకున్నారు. అమెరికన్ ఆర్చర్ 'మాట్ స్టట్జ్‌మాన్' నుంచి శీతల్ ప్రేరణ పొందింది. ఆయన కస్టమైజ్ పరికరాన్ని ఉపయోగించి పాదాలతోనే గురిపెడతారు. శీతల్ కుటుంబం ఇలాంటి మెషీన్ కొనలేకపోయింది. దీంతో శీతల్ కోసం విల్లు తయారుచేసే బాధ్యత కోచ్ వెద్వాన్ తీసుకున్నారు. స్థానికంగా లభించే మెటీరియల్‌తో అక్కడే ఆమె శరీరానికి అనుగుణంగా దాన్ని తయారు చేయించారు. ఇందులో శరీరం పైభాగాన బిగించడానికి ఒక పట్టీ, బాణాన్ని వదలడంలో సాయపడేలా శీతల్ నోటితో పట్టుకోవడానికి ఒక చిన్న పరికరం ఉన్నాయి.

ఇద్దరు కోచ్‌లతో కలిసి

స్థిరమైన విలువిద్య టెక్నిక్ కోసం శీతల్ కేవలం తన కాళ్లను మాత్రమే ఉపయోగించకుండా మరో మార్గాన్ని కనుగొనడం కోచ్‌లకు ప్రధాన సవాలు. 'శీతల్‌కు బలమైన కాళ్లు ఉన్నాయి. కానీ షూట్ చేయడానికి ఆమె తన వీపును ఎలా ఉపయోగించవచ్చో మేం కనిపెట్టాలి' అని అన్నారు. ఆమె కాళ్లలో బలాన్ని బ్యాలెన్స్ చేసి, దాన్ని టెక్నికల్‌గా ఉపయోగించడానికి ప్లాన్ చేసినట్లు అభిలాష వివరించారు. ఇద్దరు కోచ్‌లతో కలిసి శీతల్ రోజువారి శిక్షణ మొదలుపెట్టారు. శీతల్ విల్లుకు బదులుగా రబ్బరు బ్యాండ్ ఉపయోగించి కేవలం 5 మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను గురిపెట్టడంతో శిక్షణ ప్రారంభించారు. నాలుగు నెలల్లోనే శీతల్ నిజమైన విల్లును ఉపయోగించడం ప్రారంభించింది. 50 మీటర్ల దూరం (కాంపౌండ్ ఓపెన్ కేటగిరీ పోటీ ప్రమాణం)లో లక్ష్యాలపై బాణం ఎక్కుపెట్టింది. శిక్షణ ప్రారంభించిన 11 నెలలలోపే 2022 ఆసియా పారా గేమ్స్‌లో మహిళల సమ్మేళనం విల్లులో పాల్గొంది. భారతదేశానికి రెండు బంగారు పతకాలను తెచ్చింది.



రెండేళ్ల నుంచి ఇంటికెళ్లలేదు

శీతల్ 2023లో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచింది. ఆమె ఫైనల్‌లో ఆరు సార్లు 10 చొప్పున పాయింట్లు సాధించింది. ఆ పోటీలలో ఒక్క షాట్‌లో ఆర్చర్ సాధించే గరిష్ఠ పాయింట్ల సంఖ్య 10. 'నేను తొమ్మిదికి షూట్ చేస్తే, తదుపరి షాట్‌లో దాన్ని పదికి ఎలా మార్చగలనని ఆలోచిస్తుంటాను' అని శీతల్ చెప్పింది. ఆమె కష్టపడి ఇంత దూరం రావడమే కాదు. ఈ దారిలో శీతల్ చాలా త్యాగాలు చేసింది. శిక్షణ కోసం రెండేండ్ల కిందట కత్రాకు వచ్చానని, అప్పటి నుంచి ఒక్కసారి కూడా ఇంటికి వెళ్లలేదని ఆమె పంచుకుంది. పారాలింపిక్స్ పతకంతో తీసుకొనే తిరిగి వెళ్లాలని ఆమె నిర్ణయించుకుంది.

అత్యుత్తమ ప్రదర్శన

2024 సమ్మర్ పారాలింపిక్స్‌లో మహిళల పారా ఆర్చరీలో పోటీ పడిన అతిపిన్న వయస్కురాలు శీతల్. ఆమె ఎలిమినేట్ అయినప్పుడు ప్రేక్షకులు నిరాశ చెందారు. ఆ సమయంలో ఆమెకు 3,12,000 మంది ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్లు ఉన్నారు. కానీ 2024 సమ్మర్ పారాలింపిక్స్‌లో రాకేష్ కుమార్‌తో కలిసి ఓపెన్ మిక్స్‌డ్ టీం కాంపౌండ్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకోవడం ద్వారా ఆమె ప్రేక్షకుల హృదయం గెలుచుకుంది. 'నేను ఎవరికీ పరిమితులు ఉండవనుకుంటాను. నీకు కావాల్సింది కోరుకోవడం అంటే దాని కోసం కష్టపడటమే. నేను చేయగలిగినప్పుడు ఎవరైనా చేయగలరు' అని ఆమె అంటుంది. 2023లో ఆమె ఆసియా పారాలింపిక్ కమిటీ నుండి ఉత్తమ యూత్ అథ్లెట్ అవార్డు, భారత ప్రభుత్వం నుండి అర్జున అవార్డును అందుకుంది.

నిమ్మరసం తాగితే..

నిమ్మరసం ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుంది. బరువు తగ్గడం మొదలు రోగనిరోధక శక్తి పెంపు వరకు ఎన్నో సమస్యలకు ఉపయోగపడుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం తాగితే బరువు తగ్గుతారు. అయితే నిమ్మరసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెప్పడంలో ఎంత నిజం ఉందో... కొందరిలో ఇది అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల కలిగే నష్టాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- అసిడిటీ సమస్యతో బాధపడుతున్న వారు నిమ్మ రసాన్ని తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల అసిడిటీ సమస్య మరింత వేధిస్తుందని అంటున్నారు.



- దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఉదయం నిమ్మరసాన్ని తీసుకోకూడదు. దంతాల సున్నితత్వం ఉన్న వ్యక్తులు, నిమ్మరసాన్ని తీసుకోకూడదు. పళ్లపై ఉండే ఎనామిల్ దెబ్బతింటుంది. దీనివల్ల దంతాలు బలహీనంగా మారే అవకాశం ఉంటుంది.
- నిమ్మకాయల్లో యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఎములక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- కిడ్నీ సమస్యలున్న వారు కూడా ఖాళీ కడుపుతో నిమ్మరసం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది కిడ్నీలపై ఒత్తిడి పెంచుతుంది. దీర్ఘకాలికంగా మూత్ర పిండాల సమస్యలతో బాధపడేవారికి నిమ్మరసంతో సైడ్ఎఫెక్ట్స్ ఉంటాయి.
- నోటి అల్సర్లతో బాధపడేవారికి కూడా నిమ్మరసం ప్రతికూల ప్రభావం చూపుతుంది. మౌత్ అల్సర్‌తో బాధపడేరు వారు నిమ్మరసం తీసుకోకూడదు. జిడ్డు చర్మానికి నిమ్మరసం మేలు చేస్తుంది.
- జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిమ్మరసంకు దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసంలోని యాసిడ్ కంటెంట్ కారణంగా కడుపులో మంటగా ఉంటుంది.

దిగ్గజ కంపెనీల నుంచి సెబీ చీఫ్‌కు ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మాధబి అగోరా ప్రయివేట్ లిమిటెడ్‌కు అక్రమ ఆదాయాలు సమకూరాయని సంచలన ఆరోపణలు చేసింది. సెబీ ఛైర్‌పర్సన్‌గా ఉంటూనే ఆమె ఉద్దేశపూర్వకంగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడ్డారని తెలిపింది. మాధబి 2017లో సెబీలో చేరగా.. 2022లో ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. 2019 నుంచి ఈ కంపెనీని తన భర్తే నిర్వహిస్తున్నారని మాధబి పేర్కొన్నప్పటికీ.. ఇప్పటికీ అందులో ఆమెకు వాటాలున్నాయని రిపోర్టులు వస్తున్నాయి.

"సెబీలో చేరిన తర్వాత తన సొంత అడ్వైజరీ కంపెనీ అగోరా కార్యకలాపాలు నిలిచిపోయినట్టు మాధబి తెలిపారు. కానీ ఆ సంస్థ సేవలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 2016-2024 మధ్య రూ.2.95కోట్ల మేర ఆదాయం పొందింది. ఈ కంపెనీకి మహీంద్రా అండ్ మహీంద్రా, డాక్టర్ రెడ్డీస్, పిడిలైట్, ఐసీఐసీఐ బ్యాంక్, విసు లీజింగ్ అండ్ ఫైనాన్స్, సెంబ్‌కార్ప్ వంటివి క్లయింట్‌లుగా ఉన్నాయి. ఒక్క మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ నుంచే ఆ కంపెనీకి రూ.2.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఇది కచ్చితంగా సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే. మహీంద్రా కంపెనీ నుంచి మాధబి భర్త దావల్ రూ.4.78కోట్ల మేర ఆదాయం పొందారు. మాధబి సెబీ బోర్డులో పూర్తి స్థాయి సభ్యురాలుగా ఉన్న సమయంలోనే ఆమె భర్త ఈ ఆదాయాన్ని అందుకున్నారు" అని కాంగ్రెస్ ఆరోపించింది. మాధబికి ముంబయిలో ఉన్న తన ప్రాపర్టీని సెబీ దర్యాప్తు చేస్తున్న ఓ సంస్థకు అద్దెకి ఇచ్చి.. లక్షల ఆదాయం పొందుతున్నారని ఇటీవల కాంగ్రెస్ వెల్లడించిన విషయం తెలిసిందే.

భూముల ధరల పెంపునకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

వివిధ దశల్లో కసరత్తు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంపుపై సర్కార్ సూచనలకు అనుగుణంగా మార్కెట్ వాల్యూ రివిజన్ కమిటీలు సగటున 50 నుంచి 60 శాతం పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. రాష్ట్రంలోని 143 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రూపొందించిన ప్రతిపాదనలను ఆమోదించి షెడ్యూల్ ప్రకారం కాకుండా ఆగస్టులో వాటిని కంప్యూటర్లకెక్కించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన వెంటనే అమలు చేసేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను రిజిస్ట్రేషన్ల శాఖ పూర్తి చేసింది. పెంపు షెడ్యూల్ కసరత్తు జరుగుతున్న సమయంలోనే రిజిస్ట్రేషన్ల శాఖకు కమిషనర్‌గా బుద్ధ ప్రకాష్ వచ్చారు. హైడ్రా దెబ్బకు రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గడం తదితర కారణాల వల్ల భూముల ధరల పెంపు నిర్ణయం వాయిదా పడింది.

బీఆర్ఎస్ హయాంలో రెండు సార్లు పెంపు

ధరలతోపాటు స్టాంపులు రిజిస్ట్రేషన్ ఫీజును సైతం రెండు సార్లు పెంచారు. 4 శాతం ఉన్న ఫీజు రెండు దఫాల పెరుగుదలతో ఏకంగా 7.5 శాతానికి చేరుకుంది. ఫలితంగా సర్కార్ ఖజానాకు రాబడి పెద్ద ఎత్తున పెరిగింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.12,372.73 కోట్లుగా ఉన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం ఏకంగా రూ.14,228 కోట్లకు పెరిగింది. ఒకే ఏడాదిలో దాదాపు రెండు వేల కోట్ల మేర రాబడి అదనంగా పెరిగింది. వాస్తవానికి ప్రతిఏడాది మార్కెట్ ధరలు సమీక్షించి సవరించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. కాని గత సర్కార్ ఎన్నడూ ఆ పని చేయలేదు. ఫలితంగా మార్కెట్లో పెరుగుతున్న ధరలకు సర్కార్ నిర్ణయించిన ధరలకు మధ్య వ్యత్యాసం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కార్ భూముల ధరల పెంపునకు జూన్ 6న నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

సుప్రీంకోర్టులో ఆరుగురు ఏఎస్‌జీల నియామకం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఆరుగురు సీనియర్ న్యాయవాదులను సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)లుగా నియమించింది. క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ (ఏసీసీ) వారి నియామకానికి ఆమోదం తెలిపింది. సర్వోన్నత న్యాయస్థానంలో అదనపు సొలిసిటర్ జనరల్‌లుగా నియమితులైన వారిలో ఎస్ ద్వారకనాథ్, అర్చన పాథక్ దేవె, సత్యదర్శి సంజయ్, బ్రిజేందర్ చాహర్, రాఘవేంద్ర పీ శంకర్, రాజ్‌కుమార్ భాస్కర్ థాకరే ఉన్నారు.

పోరాట గడ్డ పాలకుర్తి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రజా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన వీర తెలంగాణ వీధి నాటికను తిలకించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి మాట్లాడారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో అమెరికా నుంచి పాలకుర్తికి వచ్చామని తెలిపారు. రాబోయే తరాలకు ఐలమ్మ భూ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ భవన నిర్మాణానికి పాలకుర్తిలో ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. దొరలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన ఐలమ్మ పుట్టిన గడ్డకు ఎమ్మెల్యే కావడం ఆనందంగా ఉందన్నారు. పాలకుర్తి-చెన్నూరు రిజర్వాయర్ పనులను పూర్తి చేసి నియోజక వర్గంలోని 48 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పదేండ్లలో పాలకుర్తి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు. ప్రజా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన వీర తెలంగాణ వీధి నాటిక దృశ్యాలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని తలపించాయని తెలిపారు. కళా ప్రదర్శన చూసిన అనంతరం 1950లో ఉన్నామా 2024లో ఉన్నామా అనేలా ఉత్తేజాన్ని నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, రాపర్తి సోమయ్య, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్య నారా యణ, మాజీ ఎంపీపీలు గడ్డం యాకసోమయ్య, కారుబోతుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆమగనల్‌లో ఎంపీడీఓ



కుసుమ మాధురి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, దమ్మపేటలో ఎమ్మెల్యే జారే ఆదినారాణయ ఐలమ్మ చిత్ర పటానికి నివాళి అర్పించారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఐలమ్మ చిత్ర పటానికి పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దున్నేవానికి భూమి అనే నినాదం ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రజలు ఉద్యమించారని గుర్తుచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని ఏలూరు భవనంలో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి సంఘం జాతీయ నాయకులు మాచర్ల భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య భవనం నుంచి రిమ్స్ ఎదుట ఉన్న ఐలమ్మ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాలలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కృష్ణ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శంకర్‌పల్లి, మాడ్గుల మండలాల్లో వ్యకాస ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు పాల్గొని మాట్లాడారు. మెదక్ బహిరంగసభలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, జిల్లా కార్యదర్శి మల్లేష్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లోనూ నివాళులర్పించారు.

జేబులు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

హోం ట్యూషన్లు, ఆన్‌లైన్ క్లాసులు...ఇలా ప్రైవేటు కోచింగ్ పలు రూపాలు తీసుకుంటోంది. కోవిడ్ తర్వాత ఆన్‌లైన్ క్లాసుల ప్రాధాన్యత ఒక్కసారిగా పెరిగిపోయింది.

గ్రామీణ కుటుంబాల పైనే భారం అధికం

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలోని కుటుంబాల పైనే ఎక్కువ ఆర్థిక భారం పడుతోంది. 2011-12లో పట్టణ కుటుంబాలు తమ వార్షిక విద్యా బడ్జెట్‌లో 12.51 శాతం మొత్తాన్ని ప్రైవేటు కోచింగ్‌పై ఖర్చు చేశాయి. 2022-23లో అది 12.02 శాతానికి తగ్గింది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన కుటుంబాల ఖర్చు పెరిగింది. 2011-12లో గ్రామీణ కుటుంబాలు తమ వార్షిక వ్యయంలో సగటున 10.90 శాతం సొమ్మును ప్రైవేటు ట్యూషన్, కోచింగ్‌పై ఖర్చు చేయగా 2022-23 నాటికి అది 15.32 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఖరీదైన ప్రైవేటు ట్యూషన్లకు హాజరు కావడమే దీనికి కారణంగా కన్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంటే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసించడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు వారు ఖరీదైన ప్రైవేటు ట్యూషన్లను ఆశ్రయిస్తున్నారు. పైగా గ్రామీణ ప్రాంతాలలో కోచింగ్ కేంద్రాలు పెద్దగా అందుబాటులో ఉండవు. దీంతో వారు పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రవేశ పరీక్షలలో పెరుగుతున్నపోటీతత్వం కారణంగా గ్రామీణ విద్యార్థులు తప్పనిసరి పరిస్థితులలో పట్టణ కేంద్రాలకు వెళ్లి కోచింగ్ తీసుకుంటున్నారు. దీంతో కుటుంబాల పై అదనపు భారం పడుతోంది.

పెరుగుతున్న కోచింగ్ ఖర్చులు

సగటున సంవత్సరానికి రూ. 7,240.20 ఖర్చు చేసింది. అదే 2022-23 వచ్చే సరికి ఒక్కో కుటుంబం ఏడాదికి సగటున రూ.17,147.10 ఖర్చు పెట్టింది. ఆ సంవత్సరం లో గ్రామీణ, పట్టణ ప్రాంత కుటుంబాలు తమ వార్షిక విద్యా బడ్జెట్‌లో కోచింగ్, ట్యూషన్‌పై 13.53 శాతం సొమ్ము ఖర్చు చేశాయి. 2011-12తో పోలిస్తే ఇది 1.67 శాతం పాయింట్లు అధికం. కోచింగ్ తరగతులపై కుటుంబాలు పెడుతున్న ఖర్చు ఎలా పెరుగుతోందో ఈ గణాంకాలు చాటిచెబుతున్నాయి.

ఏం జరుగుతోంది?

చండీఘర్, మహారాష్ట్ర, గోవా,పుదుచ్చేరి, అస్సాం, ఢిల్లీ రాష్ట్రాలలో కోచింగ్‌పై ఖర్చు పెరుగుతోంది. జమ్మూకాశ్మీర్, లక్షద్వీప్, జార్ఖండ్, ఒడిషా, బీహార్, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పశ్చిమ బెంగాల్, త్రిపురలో ఈ వ్యయం మొత్తం విద్యా బడ్జెట్‌లో సగం దాటేయడం గమనార్హం. ఒడిషా, బీహార్‌లో సైతం ఇది 40 శాతంగా ఉంటోంది. ఈ ధోరణి దేశంలో విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు తెస్తోంది. క్రమేపీ 'షాడో' విద్యా వ్యవస్థ ఆవిర్భావానికి దారితీస్తోంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులు ఖాళీ చేస్తోంది. అంతిమంగా ఇది విష సంస్కృతికి కారణమవుతోంది.

అప్పుల్ని పునర్ వ్యవస్థీకరించండి

(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రభుత్వం ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. తెలంగాణకు తగినంత సహాయమందించండి, దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో మా వంతు బాధ్యతను నెరవేరుస్తామని ఆయన భరోసానిచ్చారు. ఫిస్కల్ ఫెడరలిజం బలోపేతానికి వీలుగా ఆర్థిక సంఘం, తెలంగాణకు తగిన మద్దతునివ్వాలని కోరారు. రాష్ట్రం, తమ ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఆ సంఘం సిఫారసులు ఉపయోగపడతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

భయం గుప్పెట్లో భద్రాచలం

(మొదటిపేజీ తరువాయి)

ఇంద్రకీలాద్రి అవుతుందేమోనన్న ఆందోళనలో ఏజెన్సీ వాసులు ఉన్నారు. పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నీరంతా గోదావరిలో కలుస్తుండ టంతో మంగళవారం ఉదయం నుంచి భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాజెక్ట్ అయిన శ్రీరామ్ సాగర్, కడెం, ఇంద్రావతి నుంచి లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా దండకారణ్యంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులు సైతం తమ ఉగ్ర ప్రతాపాన్ని చూపించడంతో భద్రాచలం వద్ద 47 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరింది. మంగళవారం సాయంత్రానికి రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. రాత్రికి 50 అడుగుల మేర చేరి తుది హెచ్చరికకు చేరువైలా ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. క్షణక్షణం గోదావరి పెరుగుతుండటంతో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

నీట మునిగిన స్నానాల ఘాట్

గోదావరి ప్రభావంతో స్నానాల ఘాటుతో పాటు నిమజ్జన ఘాటు సైతం నీటిలో మునిగిపోయాయి. రామయ్య దర్శనానికి వచ్చే యాత్రికులను గోదారి పరిసర ప్రాంతాల వద్దకు రానివ్వకుండా నిషేధాజ్ఞలు అధికారులు జారీచేశారు. పోలీసులు పహరా కాస్తున్నారు. గోదారమ్మ శాంతించకపోతే గణేష్ నిమజ్జనంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. గోదావరి వంతెన పై గాని కరకట్ట పరిసర ప్రాంతాల్లో గాని ఎటువంటి ఫొటోషూట్లు, సెల్ఫీ వీడియోలు తీయరాదని నిబంధన అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

మూడు రాష్ట్రాలకు నిలిచిపోయిన రాకపోకలు

గోదావరి వరద ప్రవాహంతో భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే జాతీయ రహదారిలో రాకపోకలు నిలిచాయి. భద్రాచలం నుంచి ఏపీలోని కూనవరం, వీఆర్ పురం, చింతూరుకు వెళ్లే రహదారి మురుమూరు, నందిగామ, గన్నవరం తదితర ప్రాంతాల్లో గోదారి నీరు రోడ్డుపై వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభావంతో భద్రాచలం నుంచి చర్లకు వెళ్లే రహదారి, తూరుబాక, కన్నాయిగూడెం వద్ద రాకపోకలను అధికారులు నిలిపివేస్తున్నారు. చింతూరు నుండి చట్టి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే జాతీయ రహదారి సైతం రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు భద్రాచలం, బూర్గంపాడు మీదుగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వెళ్లే రహదారిని గోదావరి నీరు చుట్టుముట్టింది.

ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనాలపై ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

గతంలో ఆదేశాలు జారీ చేసింది. ట్యాంక్ బండ్‌లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయకుండా చూడాలని జీహెచ్ఎంసీ, నగర పోలీస్ కమిషనర్, హెచ్ఎండీఏను ఆదేశించింది. అయినప్పటికీ ప్రతి ఏటా వేలాది విగ్రహాల నిమజ్జనం ట్యాంక్ బండ్‌లో జరుగుతూనే ఉంది.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని రేపు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు : సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బుధవారం నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశ వివరాలను మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 17 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పోరాట కేంద్రాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల్లో గురువారం ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పైన ఉన్న మఖ్దూం మొహినుద్దీన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, రావి నారాయణ రెడ్డి అమరవీరుల ట్రస్టు భవన్‌లో సభను నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 17న హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం ఉన్నందున తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ 21న రవీంద్ర భారతిలో నిర్వహిస్తామని వివరించారు.

పాలకుర్తిలో శౌర్యయాత్ర

కామ్రేడ్ చిట్యాల ఐలమ్మకు ఘన నివాళులు

పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు, సీపీఐ(ఎం) నేతలు, శ్రేణులు

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఐలమ్మ సెంటర్‌లో ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన వీర తెలంగాణ వీధి నాటిక ప్రజలను ఆకట్టుకుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో అశువులు బాసిన అమరుల యాదిలో ప్రజానాట్యమండలి శౌర్య యాత్ర కార్యక్రమంలో భాగంగా పాలకుర్తిలో ఈ ప్రదర్శనను నిర్వహించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల ఆగడాలు, ప్రజల తిరుగుబాటు దృశ్యాలను వీర తెలంగాణ వీధి నాటికలో కండ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. ఈ నాటిక ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రజలను భావోద్వేగానికి గురిచేసింది. 35 మంది కళాకారులతో వీధి నాటికను ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించారు. దొరగా వేల్పుల వెంకన్న, కరణంగా చంద్రమౌళి, దొడ్డి కొమరయ్య పాత్రలో వినయ్ కుమార్, ఐలమ్మ పాత్రలో విజయ, పెద్ద పాలేరుగా ప్రసాద్ అద్భుతంగా నటించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో కళా ప్రదర్శనలను తిలకించారు.

కళా ప్రదర్శనను వీక్షించిన అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజానాట్యమండలి కళాకారుల కళా ప్రదర్శన ద్వారా దొరల పెత్తనాన్ని, పేద ప్రజల తిరుగుబాటును వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రదర్శనను కనురెప్ప మూయకుండా వీక్షించామని, ఈ ప్రదర్శనతో ప్రజలు చైతన్యం కావాలని సూచించారు. వీధి నాటిక ప్రదర్శన అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులకు స్వచ్ఛందంగా విరాళాలు అందించి తమ ఆదరణను చూపారు. ప్రజలు కూడా విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్, ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ, సీపీఐ(ఎం) జనగామ జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, నాయకులు సింగారపు రమేష్, ఇతర నేతలు, శ్రేణులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నవచిత్రం

ఈటీవి విన్‌లో కమిటీ కుర్రోళ్ళు



నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. ఈ సినిమాకు యదు వంశీ దర్శకత్వం వహించారు.

ఆగస్ట్ 9న విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం ఈనెల 12నుంచి ఈటీవి విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా 'కమిటీ కుర్రోళ్ళు' టీమ్ ప్రీ స్ట్రీమింగ్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్‌గా నిర్వహించింది.

నిహారిక కొణిదెల మాట్లాడుతూ,'మా సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు మరోసారి థ్యాంక్స్. నా ఇండస్ట్రీ జర్నీ ఈటీవీ డీ జూనియర్స్ షోతో స్టార్ట్ చేశాను. ఈ సినిమా ఈటీవీలో రావడం మేము తీసుకున్న బెస్ట్ డెసిషన్. ఈనెల 12న ఈటీవి విన్‌లో మా సినిమా రిలీజ్ అవుతుంది. థియేటర్‌లో ఎలా అయితే పండగ, జాతరలా ఎంజాయ్ చేశారో, ఈటీవీ విన్‌లో కూడా చూసి అలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

ఆటలు

రింకూ సింగ్‌కు పిలుపు

- దులీప్ ట్రోఫీ జట్లలో మార్పులు

ముంబయి : దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్ ముంగిట భారత-ఎ, బి, సి,డి జట్లలో సెలక్షన్ కమిటీ పలు మార్పులు చేసింది. ఈ నెల 19 నుంచి చెన్నై చెపాక్ వేదికగా భారత్, బంగ్లాదేశ్ తొలి టెస్టు పోరు ఆరంభం కానుంది. తొలి టెస్టు కోసం టీమ్ ఇండియా క్రికెటర్లు సెప్టెంబర్ 12న చెన్నైలో శిక్షణ శిబిరం కోసం అక్కడికి చేరుకోనున్నారు. దీంతో దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్‌కు కొందరు క్రికెటర్లు అందుబాటులో ఉండటం లేదు. భారత జట్టుకు ఎంపికైన క్రికెటర్ల స్థానంలో ఇతర క్రికెటర్లకు అవకాశాలు కల్పించారు. ఈ మేరకు దులీప్ ట్రోఫీ జట్లలో మార్పులను బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉత్తర ప్రదేశ్ ఆటగాడు రింకూ సింగ్ దులీప్ ట్రోఫీలో ఆడనున్నాడు. ఇండియా-బి తరఫున రింకూ సింగ్ బరిలోకి దిగనున్నాడు. భారత టెస్టు జట్టుకు ఎంపికైన క్రికెటర్లలో యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ మినహా అందరూ చెన్నైలో శిక్షణ శిబిరానికి హాజరు కానున్నారు. శుభ్‌మన్ గిల్, కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్‌లు ఇండియా-ఎ జట్టు నుంచి టెస్టు జట్టుకు ఎంపిక కాగా.. వీరి స్థానంలో ప్రతమ్ సింగ్, అక్షయ్ వాడ్కర్, షేక్ రషీద్, షామ్స్ ములాని, అకిబ్ ఖాన్‌లు ఎంపికయ్యారు. ఇండియా-ఎ సారథ్య పగ్గాలు మయాంక్ అగర్వాల్ తీసుకోనున్నాడు. పేసర్ కావేరప్ప ఇండియా-ఎ జట్టు నుంచి ఇండియా-డి జట్టుకు మారనున్నాడు.

యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, యశ్ దయాల్‌ల స్థానంలో ఇండియా-బి జట్టుకు సూయాశ్ ప్రభుదేశాయ్, హిమాన్షు మంత్రి, రింకూ సింగ్‌లు ఎంపికయ్యారు. యశస్వి, పంత్, యశ్ టెస్టు జట్టుకు ఎంపికైన సంగతి తెలిసిందే. తొలి టెస్టుకు ఎంపికైన



సర్ఫరాజ్ ఖాన్ మాత్రం ఇండియా-బి తరఫున దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచ్ ఆడనున్నాడు. ఇండియా-సిలో ఎటువంటి మార్పులు లేవు. కానీ ఇండియా-డి ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, తుషార్ దేశ్‌పాండే సేవలు కోల్పోయింది. అక్షర్ టెస్టు జట్టుకు ఎంపిక కాగా.. తుషార్ గాయపడ్డాడు. కావేరప్ప, నిశాంత్ సింధులు ఇండియా-డి జట్టుకు ఆడనున్నారు. సెప్టెంబర్ 12 నుంచి అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) క్రికెట్ గ్రౌండ్‌లో దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచులు జరుగనున్నాయి. సెప్టెంబర్ 15న ఈ మ్యాచులు ముగియనుండగా.. తొలి టెస్టుకు మూడు రోజుల ముంగిట భారత జట్టుతో సర్ఫరాజ్ ఖాన్ చేరనున్నాడు.

చినుకు లేదు.. ఆట లేదు!

కివీస్, అఫ్గాన్ ఏకైక టెస్టు దుస్థితి

గ్రేటర్ నోయిడా : న్యూజిలాండ్, అఫ్గనిస్థాన్ ఏకైక టెస్టు మ్యాచ్. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ మ్యాచ్‌ను గ్రేటర్ నోయిడాలోని క్రికెట్ స్టేడియంలో షెడ్యూల్ చేశారు. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఏకైక టెస్టు మ్యాచ్ ఆరంభం కావాలి. కానీ రెండు రోజులు గడిచినా.. టెస్టు మ్యాచ్‌లో ఇప్పటి వరకు టాస్ కూడా పడలేదు. కానీ దారుణంగా తడిసిన అవుట్‌ఫీల్డ్ కారణంగా 180 ఓవర్ల ఆట వృథా అయ్యింది. వర్షం లేకపోయినా.. మ్యాచ్ ఆరంభం కాకపోవటంతో ఇరు జట్ల క్రికెటర్లతో పాటు ఇరు దేశాల అభిమానులు సైతం సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.